


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




బుధవారం | 4-12-2019 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 229 | శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా. 1.45 తదుపరి నవమి; నక్షత్రం: శతభిషం సా. 5.10 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: రా. 12.21-2.09; దుర్ముహూర్తం: ఉ. 11.43-12.28; అమృతఘడియలు: ఉ. 9.06-10.53; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.35; సూర్యాస్తమయం: 5.36 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

# ఇదేనా మానవత్వం?

## టీడీపీ శ్రేణులపై దాడులెందుకు ఆపడం లేదు?

**జగన్... మీ చేతలన్నీ క్రూరత్వమే**

పౌరుషం రాష్ట్ర ప్రజల మీద కాదు..
మీ బాబాయి హంతకులపై చూపించు
రోషం మీకే కాదు.. మా కార్యకర్తలకీ ఉంది
చంపడమే మీకు తెలుసు.. అభిమానాన్ని
గుండెల్లో దాచుకోవడం టీడీపీకే తెలుసు
40 ఏళ్లలో ఇలాంటి నేతలను చూడలేదు
రాష్ట్రాన్ని రావణకాష్టంగా మారుస్తున్నారు
బుగ్గన, శ్రీదేవీ జాగ్రత్తగా మసలుకోండి
ఆనాడు మేమూ ఇలాగే చేస్తే మీరెక్కడ?
వైఎస్‌నాటి ఐఏఎస్‌లు నేటికీ కోర్టులకు..
చట్టాన్ని చేతుల్లోకి తీసుకొంటే ఖబడ్దార్
రిటైరైనా వదలం.. కేసులు వెలికితీస్తాం
పోలీసులకు చంద్రబాబు హెచ్చరికలు
కర్నూలులో వైసీపీ బాధితులతో భేటీ
అధినేతను కదిలించిన ఒక్కొక్కరి వ్యథ
అనంతలో మాజీ మంత్రి నారాయణపై దాడి
చొక్కా పట్టుకున్న వైసీపీ కార్యకర్త
కారుపై కొట్టి, రాళ్లు విసిరి.. దుర్భాషలు



చంద్రబాబు సమక్షంలో తన గోడు చెప్పుకొంటున్న వైసీపీ బాధితురాలు భారతి

**నా తమ్ముణ్ణి చంపుతారట సార్!**

"నా చిన్న తమ్ముణ్ణి చంపుతాం అంటున్నారు. మరొకర్ని కూడా చంపుతాం.. ఏం చేస్తావంటున్నారు సార్.. ఉన్న ఉద్యోగం పోయి రైతుబజార్లో పండ్లు అమ్ముకుంటున్నాను. ఎంత వేధించినా వెనక్కి తగ్గేది లేదు. మేం టీడీపీకే ఓటు వేస్తాం. పోలీసులూ...చేతనైతే పని చేయండి. లేకుంటే ఇంటికెళ్లి పడుకోండి"

- భారతి, బాధితురాలు, కర్నూలు జిల్లా నాయకల్లు గ్రామం

కర్నూలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): "తన మతం మానవత్వమని, సమస్యలు పరిష్కరించడమే కులమని ముఖ్యమంత్రి జగన్ మాటల్లో చెబుతూ, చేతల్లో మాత్రం క్రూరంగా వ్యవహరిస్తున్నారు. నిజంగా ఆయనకు మానవత్వమే ఉంటే టీడీపీ కార్యకర్తలు, నాయకులపై జరుగుతున్న దాడులపై స్పందించాలి. పోలీసులు, అధికారులకు ఆదేశాలిచ్చి దాడులు ఎందుకు ఆపలేకపోతున్నారో సమాధానం చెప్పాలి" అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు వేధిస్తున్న

మిగతా 10వ పేజీలో...

**మాజీ సీఎంకు భద్రత ఇలాగేనా?**

పోలీసు అధికారులే దగ్గరుండి రాళ్లేయించారు

గవర్నర్‌కు టీడీపీ నేతల ఫిర్యాదు

**'పద్మజ' నిర్బంధం... విడుదల**

మంత్రి కొడాలిని దూషించారంటూ కేసు

## ఏబీఎన్ ఆపాల్సిందే!

**మరోసారి మంత్రుల హుకుం**

ఎమ్మెస్వోలను పిలిచి ఆదేశాలు

రంగంలోకి పెద్దిరెడ్డి, పేర్ని, కొడాలి

టీడీ శాట్ ఆదేశాలున్నా అదే తీరు

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో టీడీ-శాట్ తప్పు పట్టినా సరే! సర్కారు పట్టు వీడటంలేదు! 'ప్రసారాలు ఆపడం కుదరదు. మాకు ఇబ్బందులు వస్తాయి' అని ఎమ్మెస్వోలు మొత్తుకుంటున్నా సరే! ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రసారాలు ఆపడమే లక్ష్యంగా మళ్లీ ఒత్తిడి మొదలుపెట్టింది. మంగళవారం మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పేర్ని నాని, కొడాలి నాని విజయవాడలో అందుబాటులో

మిగతా 2వ పేజీలో...

**ష్.. గప్‌చుప్!**

సీఎం సమీక్షల సమాచారం
'ఆంధ్రజ్యోతి'కి అందకుండా కట్టడి
టెలిగ్రామ్ గ్రూప్‌లో చేర్చని సీఎంవో
'పరిశీలిస్తాం' అని సరిపెట్టిన మంత్రి

2


తిరుపతి రైతుబజార్‌లో ఆరబోసిన ఉల్లిపాయలను పరిశీలిస్తూ వినియోగదారులతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

## చేతకాకపోతే దిగిపోండి

కాంట్రాక్టుల రద్దు, ఇసుక అమ్మడం
ఇవి తప్ప జగన్ చేసిందేమీ లేదు
కనీసం ఉల్లి ధరా నియంత్రించలేదు
ఆయనది మాట తప్పని కులమా?
మిగతావి తప్పే కులాలా?
మా వాళ్లపై దాడులు చేస్తే ఊరుకోను
కుటుంబాన్ని వదిలేసైనా వస్తా
151 సీట్లు వచ్చాయని విర్రవీగొద్దు
తెగించేందుకు సిద్ధంగా ఉన్నాం
తిరుపతి పర్యటనలో పవన్ హెచ్చరిక

తిరుపతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'అభివృద్ధి పనుల కాంట్రాక్టులు రద్దు చేయడం, ఇసుక అమ్ముకోవడం తప్ప వైసీపీ ప్రభుత్వం ఆరునెలల్లో చేసింది ఏమీ లేదు. కనీసం ఉల్లి గడ్డల ధరలు నియంత్రించలేని పాలన సాగిస్తోంది. పాలించడం చేతకాకపోతే దిగిపోండి..' అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మండిపడ్డారు. రాయలసీమ

మిగతా 10వ పేజీలో...

## రైలు చార్జీల పెంపు?

మెయిల్స్, ఎక్స్‌ప్రెస్‌లలో 5-10% వరకు
పార్లమెంటు సమావేశాల తర్వాత ప్రకటన
'ప్రయాణ' ఆదాయంలో భారీ లోటు
సరుకు రవాణా రాబడీ పతనం
ఆర్థిక మాంద్యం ప్రభావమే



12

**మద్య నిషేధమే లక్ష్యమైతే**

## రిటైల్ తగ్గించరేం?

బార్లనే తగ్గించడంలో మతలబేంటి?
కొత్త దరఖాస్తుకు 10 లక్షలు ఎందుకు?
ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు
డ్రా వాయిదా వేసుకోవాలని సూచన
తదుపరి విచారణ 18కి వాయిదా



9

**అమెజాన్‌లో ఆప్కో వస్త్రాలు!**

3

# కైలాసం సృష్టిస్తి రామాహరీ..




దక్షిణ అమెరికాలోని ఒక ద్వీపంలో సొంత దేశం ఏర్పాటు
సొంత జెండా, రాజ్యాంగం.. 10 శాఖలు, ప్రధాని, కేబినెట్
అక్కడి నుంచి 11 దిశల్లోకి.. 14 లోకాలలోకి ఉచిత ప్రవేశం
అందుకు ప్రత్యేక పాస్‌పోర్టు!.. గుర్తింపు కోసం ఐరాసతో చర్చ

**కొత్త లోకాలే చూపిస్తి రామాహరీ.. నిత్యానంద స్వామి సరికొత్త లీల**

*స్వయం ప్రకటిత దేవుడు.. రేప్ కేసు నిందితుడు, ప్రస్తుతం పరారీలో ఉన్న 'స్వామి నిత్యానంద' గుర్తున్నాడా? ఆయన ఇప్పుడు తన కోసం, తన అమాయక భక్తుల కోసం.. 'కైలాస' పేరుతో సొంతంగా ఒక ద్వీప దేశాన్నే సృష్టించుకున్నాడు! దానికి ఐక్యరాజ్య సమితి గుర్తింపు కోసం 'కైలాస' తరఫున ఆ దేశ (?) న్యాయప్రతినిధులు ఇప్పటికే సంప్రదింపులు కూడా మొదలుపెట్టారు!! ఆ దేశానికి సంబంధించి ఇప్పటికే అధికారిక వెబ్‌సైట్ (కైలాస డాట్ ఆర్గ్) కూడా రూపొందించారు.*

న్యూఢిల్లీ, డిసెంబరు 3: కైలాస.. రివైవింగ్ ద ఎన్‌లైటెన్డ్ సివిలైజేషన్.. ద గ్రేట్ హిందూ నేషన్' పేరుతో నిత్యానంద ఏర్పాటు చేసుకున్న ఈ దేశం దక్షిణ అమెరికాలోని ఈక్వెడార్‌కు సమీపంలో ఉంది. ట్రినిడాడ్ అండ్ టొబాగోకు సమీపంలో ఉండే ఒక ద్వీపాన్ని ఈక్వెడార్ నుంచి సొంతానికి కొనేసుకున్న నిత్యానంద.. ఆ దీవిలో తన సొంత దేశాన్ని ఏర్పాటు చేసి, సొంత జెండా, సొంత పాస్‌పోర్టు, సొంత జాతీయ చిహ్నం, సొంత రాజ్యాంగం.. ఇలా అన్నింటినీ రూపొందించుకున్నాడు. ఆ దేశానికి ఆయనే రాజు. పాలన

మిగతా 12వ పేజీలో...



## విక్రమ్ జాడ తెలిసింది!

**క్లూ ఇచ్చిన చెన్నై ఇంజనీర్**

శకలాలను గుర్తించిన నాసా.. 3 నెలల తర్వాత గుర్తింపు



విక్రమ్‌లాండర్ శకలాలు పడిన ప్రదేశం



12


వైఎస్సార్ లా నేస్తం పథకం బ్రోచర్‌ని ఆవిష్కరిస్తున్న సీఎం జగన్

9

**టీడీపీ ఎమ్మెల్యేలు**

## ముగ్గురికి గాలం!

10

ముగ్గురు మంత్రుల మంత్రాంగం.. బాలినేని నివాసంలో భేటీ

రేపు సీఎంను కలిసే అవకాశం.. తమ ఎమ్మెల్యేలకు బాబు ఫోన్లు







# మదాంధులు!

రాష్ట్రంలో 3చోట్ల అత్యాచారాలు.. పొరుగింట్లోనే పాపిష్టి వాడు
55 ఏళ్ల మహిళ రేప్, హత్య.. ఇంకోచోట కట్టుకున్నోడే కాటేశాడు
మరొకరితో కలిసి భార్యపై అత్యాచారం.. మరోచోట బాలికపై...

2

**అమ్మాయిలకు ధైర్యమే ఆయుధం**

'బీ సేఫ్' యాప్ ఆవిష్కరించిన హోంమంత్రి

12

**మార్చి 23 నుంచి టెన్త్ పరీక్షలు**

2



పరంజ్యోతి

## అనుభూతి అపరోక్షమే!

మోక్షం కావాలనుకునే వారికి మార్గాలు ఎన్నో! సాధనలో తీవ్రత, ప్రాప్తి, గురువు అనుగ్రహం వలన ఆయా మార్గాలు సాధకుడికి అందుబాటులోకి వస్తాయి. స్వాధ్యాయం, ప్రాథమిక సాధనాసోపానం. తనను తాను తెలుసుకోవటమే, అపరోక్షానుభూతి. ఇది పరమ చరమ స్థితి. సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపమైన శంకరభగవత్పాదులు అపరోక్షానుభూతిని పొందే మార్గాన్ని విస్పష్టంగా బోధించారు.

కంటికి కనిపిస్తున్న సమస్త వస్తు ప్రపంచాన్ని వదలవలసిన వస్తువుగా అన్నివేళలా ఎవరు భావిస్తారో, వారిది శుద్ధ వైరాగ్యం. తిరుగులేని స్థితి ఇది. ఆ విధంగానే ప్రకృతిని అనాత్మగానూ, ఈ ప్రపంచాన్ని చూపగలిగే, రూపంలేని స్థితిని ఆత్మగానూ నిశ్చయంగా అనుకోగలగటమే ఆత్మ-అనాత్మల గురించిన వివేకం! మనసులో ఏర్పడే సర్వసంకల్పాలను వదలటమే శమము. బాహ్య ఇంద్రియాల కార్యకలాపాలను నిగ్రహించటమే దమము. నిగ్రహించుకోలేని అహంకారమే మదము. ఇంద్రియ వృత్తుల నుండి మనసును మరల్చటమే ఉపరతి. ఇంద్రియ కర్మల వలన సంభవించే సమస్త దుఃఖాలను సహనంతో అనుభవించగలగడమే తితీక్ష! వేదములలో చెప్పబడిన విషయాలయందు, సద్గురు బోధల యందు నిలకడగా వుండే భక్తికే శ్రద్ధ అని పేరు. అటువంటి శ్రద్ధవలనే జ్ఞానం లభిస్తుంది.

చిత్తాన్ని హృదయ గుహలోని ఆత్మతో లయం చేయటమే సమాధానం. ప్రపంచ బంధనం వీడి, ముక్తిని కోరుతూ, నిశ్చిత బుద్ధితో భగవంతుని ధ్యానించటమే ముముక్షుత. కనుక వైరాగ్యం, వివేకం, శమము, దమము, తితీక్ష, శ్రద్ధ, సమాధానం, ముముక్షుత.. ఇవన్నీ సాధనలు. వీటిని పొందిన సాధకుడు, జ్ఞానసిద్ధి కోసం నిరంతరమూ తీవ్ర ప్రయత్నం చేయాలి. వస్తువును వెదకాలంటే వెలుతురు అవసరం. జ్ఞానం పొందాలంటే విచారణ అవసరం. ఏమని విచారణ కొనసాగించాలి? "నేనెవరు? ఈ సృష్టి ఎట్లా జరిగింది?" అని అనుకుంటూ విచారించాలి. పది ఇంద్రియాలు పంచభూతాల సంయోగమే నేను కాదు. పైకి కనిపిస్తున్న దేహం మాత్రమే నేను కాదు.



ప్రపంచం బ్రహ్మమని భావించటమే యమం. సమస్త వస్తువులలో పరమాత్మను చూడటం నియమం. పరమాత్మ తప్ప మరొక వస్తువు లేదనే నిశ్చిత భావనే త్యాగం. వాక్కుకు అతీతమైన పరబ్రహ్మమే నిత్యమని భావించటమే మౌనం. బ్రహ్మమును గూర్చిన చింతన సాగటానికి ఏ స్థితి అవసరమో అదే ఆసనం. పరమాత్మ భావనలో ఎవరి చిత్తం ఏకాగ్రస్థితిలో వుండగలదో, అదే సిద్ధ, శుద్ధాసనం!

ప్రపంచ దృష్టిని వదలి, బ్రహ్మభావన నిలబడితే, అది రేచకం; 'నేను బ్రహ్మమును' అనుకోవటం పూరకం; 'అహం బ్రహ్మాస్మి' భావన నిలకడ చెందితే అది కుంభకం! ఇంద్రియ విషయాలను పరమాత్మ భావనగా మార్చుకోవటమే ప్రత్యాహారం! వస్తువుల యందు మనసు కలిగినపుడు, ఆ వస్తువులన్నీ బ్రహ్మమే అనే భావనతో చూడటమే ధారణ. 'నేను బ్రహ్మమునన్న భావనను, రూపనామరహితమైన స్థితిలో ఉంచగలిగితే, అది ధ్యానం! అట్టి ధ్యానము మాత్రమే పరమానందమనే హిరణ్యగర్భానందాన్ని ప్రసాదిస్తుంది!

**-వి.ఎస్.ఆర్.మూర్తి, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త**



## లోకం తీరు



### చలికాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| విజయనగరం | 19.0 | 29.0 |
| హైదరాబాద్ | 19.7 | 26.8 |
| అనంతపురం | 22.0 | 26.8 |
| గుంటూరు | 23.1 | 30.2 |
| విజయవాడ | 24.4 | 30.3 |



## ఉల్లి @ 105

తాడేపల్లిగూడెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉల్లిపాయల ధర రోజు రోజుకూ పెరిగిపోతోంది. పశ్చిమగోదావరి జిల్లాలో వంద రూపాయలు దాటిపోయింది. తాడేపల్లిగూడెం హోల్‌సేల్ మార్కెట్‌లోనే మంగళవారం కిలో రూ.105కు అమ్మకాలు సాగించారు. కర్నూలు కంటే తాడేపల్లిగూడెంలో తక్కువ ధర వస్తుండటంతో రెండు రోజులుగా రైతులు పంట తీసుకురావడం లేదు. దీంతో మంగళవారం ఐదు లారీల ఉల్లి మాత్రమే వచ్చింది. కిలో రూ.102 నుంచి రూ.105 మధ్య విక్రయాలు సాగించారు. కాగా, రైతు బజార్లలో ప్రభుత్వం రూ.25కే రాయితీపై ఉల్లిని విక్రయిస్తోంది. జిల్లాలో ఐదు పట్టణాల్లో మాత్రమే రైతు బజార్లు ఉన్నాయి. రైతు బజార్లు లేనిచోట అధిక ధరకు ఉల్లిని కొనలేక వినియోగదారులు ఇబ్బందిపడుతున్నారు.

## ధరలు తగ్గే వరకూ రాయితీ ఉల్లి

- అక్రమ నిల్వలపై దాడులు చేయండి: సీఎం

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని రైతుబజార్లలో సబ్సిడీ ఉల్లిపాయలు అందుబాటులో ఉంచాలని సీఎం జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉల్లి అక్రమ నిల్వలపై విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు చేయాలని చెప్పారు. ఉల్లి ధరలపై మంగళవారం క్యాంప్ కార్యాలయంలో సీఎం అధికారులతో సమీక్షించారు. గత 18రోజుల్లో 16వేల క్వింటాళ్ల ఉల్లిని కిలో రూ.25కే సరఫరా చేసినట్టు అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన సీఎం.. బహిరంగ మార్కెట్‌లో ధరలు తగ్గేవరకూ రైతుబజార్లలో రాయితీ ఉల్లిని అమ్మాలని ఆదేశించారు. ప్రభుత్వంపై ఎంత ఆర్థిక భారం పడినా, ధరల స్థిరీకరణ నిధి నుంచి భరిస్తామని తెలిపారు. ఉల్లిని అక్రమంగా నిల్వ చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# వితంతువు రేప్.. హత్య

- మృతదేహంపై కారం చల్లి పైశాచికం
- రూ.78,900 నగదు అపహరణ
- తూ.గో.జిల్లాలో దారుణం.. నిందితుడి అరెస్టు

ఐ.పోలవరం, డిసెంబరు 3: దిశ 'హత్యాచార' ఘటన దేశాన్ని కుదిపేస్తున్న ఈ తరుణంలోనే.. తూర్పుగోదావరి జిల్లాలో మరో దారుణం చోటుచేసుకుంది. ఐదు పదుల వయసు పైబడిన ఒంటరి మహిళపై సోమవారం రాత్రి పొరుగింటి వ్యక్తే అత్యాచారానికి పాల్పడి, ఆపై దారుణంగా హత్య చేశారు. ముఖంపై కారం చల్లి మరీ తన పైశాచికాన్ని ప్రదర్శించాడు. రూ.78,900 నగదునూ అపహరించుకుపోయాడు. అయితే పోలీసులు అప్రమత్తమై కొద్ది గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేశారు. వారి కథనం ప్రకారం.. ఐ.పోలవరం మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ(55) ఒంటరిగా ఉంటోంది. భర్త పదిహేనేళ్ల కిందటే మరణించగా, కుమారుడు నాలుగేళ్ల కిందట మృతి చెందాడు. రాజమహేంద్రవరానికి చెందిన ఆమె మేనల్లుడు యోగక్షేమాలు తెలుసుకునేందుకు రాత్రి 9 గంటలకు మహిళతో ఫోన్ చేసి మాట్లాడాడు. ఆ సమయంలో ఎవరో తలుపు కొడుతున్నారని చెప్పింది. వెంటనే సెల్ స్విచ్ఛాఫ్ అయ్యింది. ఆ తర్వాత దుండగులు ఆమెపై అత్యాచారం చేసి, హతమార్చినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఘటనా ప్రాంతంలోనూ, మృతురాలి ముఖంపైనా కారం చల్లినట్లు గుర్తించారు.

### నిందితుడు పొరుగింటివాడే!

ఈ ఘటనలో అనుమానితుడిగా పొరుగింటిలోనే ఉంటున్న 30ఏళ్ల కేశనకుర్తి నాగబాబుతోపాటు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా సంఘటన స్థలానికి నాగబాబును తీసుకురావడంతో స్థానికులు అతడికి దేహశుద్ధి చేసి నిలదీశారు. దీంతో తానొక్కడినే ఈ అఘాయిత్యం పాల్పడ్డానని అంగీకరించాడు. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ నయీంఅస్మి, ఇంటెలిజెన్స్ డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్, అమలాపురం ఇన్‌చార్జి డీఎస్పీ బి.రామకృష్ణ పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను కూడా రంగంలోకి దిగింది. పోలీసులు తమదైన శైలిలో నాగబాబును విచారించగా.. తానే మహిళపై అత్యాచారం చేసి, చీరతో పీక బిగించి చంపినట్లు అంగీకరించాడు. తర్వాత ట్రంకు పెట్టెలో ఉన్నరూ.78,900 నగదు చోరీ చేసినట్లు తెలిపాడు. ఈ మేరకు అతడిని అరెస్టు చేసి, నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ముమ్మిడివరం సీఐ రాజశేఖర్ తెలిపారు. నేరం జరిగిన వెంటనే పోలీసులు దర్యాప్తును వేగవంతం చేయడంతో కొద్ది గంటల్లోనే కేసు కొలిక్కి వచ్చింది.

## భార్యపై భర్త, మరిది అత్యాచారం

- ప్రతిఘటించడంతో భౌతిక దాడి
- 'అనంత'లో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

కదిరి, డిసెంబరు 3: కట్టుకున్న భర్తే కామ పిశాచిలా మారాడు. తనకు తమ్ముడి వరసైన వ్యక్తితో కలిసి పూటుగా తాగి ఇంటికొచ్చాడు. భార్యను బంధించి.. ఇద్దరూ కలిసి అత్యాచారం చేశారు. అనంతపురం జిల్లా కదిరిలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. సోమేష్‌నగర్‌లో ఓ వ్యక్తి తన భార్యతో కాపురం ఉంటున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు. వారిని భార్య పుట్టింటి వద్ద వదిలేశారు. శుక్రవారం రాత్రి బయటకెళ్లి తప్పతాగిన భర్త, ఆయనకు తమ్ముడు వరసైన మరో వ్యక్తి.. ఇద్దరూ కలసి రాత్రి 10 గంటల సమయంతో ఇంటికి వచ్చారు. భార్య కాళ్లూ చేతులూ కట్టేసి, పూర్తిగా వివస్త్రను చేసి పాశవికంగా అత్యాచారం చేశారు. ఆమె ప్రతిఘటించడంతో కాళ్లూ చేతులనూ గాయపరిచారు. శనివారం సాయంత్రం వరకు విషయం బయటకు పొక్కకుండా భర్త కాపలా ఉన్నాడు. చివరికి స్థానికుల సాయంతో ఆమె పుట్టినిల్లు తలుపుల మండలంలోని ఓ గ్రామానికి చేరింది. అక్కడి అంగన్‌వాడీ కార్యకర్త ఈ విషయం తెలుసుకుని ఈస్ట్ సీడీపీఓకు సమాచారం ఇచ్చింది. ఈస్ట్ సీడీపీఓ రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు విచార ణ చేసి, బాధితురాలిని చికిత్స కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు. నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు చెప్పారు. కాగా, బాధితురాలి భర్త గాండ్లపెంట మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదేళ్ల బాలికపై గతంలో అత్యాచారానికి పాల్పడడంతో కోర్టు జైలు శిక్ష విధించింది. అయితే శిక్ష అనుభవించకుండా పారిపోయాడు. తనకు మాయమాటలు చెప్పి, మోసం చేసి, కేసు గురించి చెప్పకుండా తనను పెళ్లి చేసుకున్నాడని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

## బాలికపై అత్యాచారం

విజయవాడ, డిసెంబరు 3: బాలికపై పలువురు యువకులు అత్యాచారానికి పాల్పడిన ఘటన విజయవాడలోని భవానీపురంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. కొత్తపేట వాగు సెంటర్‌కు చెందిన బాలిక (17)కు తండ్రి లేరు. పూల డెకరేషన్ పనులకు వెళ్లేది. అక్కడ సాయి అనే వ్యక్తి పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న సాయి స్నేహితులు కూడా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. తర్వాత పెళ్లి చేసుకోవడానికి సాయి నిరాకరించడంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు సాయితో పాటు అతని స్నేహితులపై అత్యాచారం కేసు నమోదు చేశారు.

## పెళ్లికి నిరాకరించిందని బాలికపై బ్లేడుతో దాడి

చిలకలూరిపేట, డిసెంబరు 3: పెళ్లికి నిరాకరించిందనే నెపంతో బాలికపై వరసకు బావ అయ్యే వ్యక్తి బ్లేడుతో దాడికి పాల్పడిన సంఘటన గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. సంజీవనగర్‌కు చెందిన అఖిల్ బాలిక (16)ను ప్రేమిస్తున్నానని వెంటపడుతున్నాడు. తనను పెళ్లి చేసుకోవాలని కోరాడు. ఆమె ఒప్పుకోకపోవడంతో బ్లేడుతో మెడపై కోశాడు. ఆపై తాను కూడా మెడ కోసుకున్నాడు. బాలికను ఆస్పత్రికి తరలించగా 18 కుట్లువేశారు. ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు.

## రాయలసీమలో వర్షాలు

విశాఖపట్నం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీలంక, దక్షిణ తమిళనాడును ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి ఏర్పడింది. దీని ప్రభావంతో తమిళనాడు, రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో ఎక్కువ చోట్ల మంగళవారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. ఆళ్లగడ్డలో 3, మార్కాపురంలో 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో రాయలసీమ, కోస్తాల్లో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.



## అవి చర్చిలు కాదు.. లైంగిక చెరలు

*కేరళలో కేథలిక్ చర్చిలు నడిపే పలు కాన్వెంట్లు, ప్రార్థనా కేంద్రాలు లైంగిక వేధింపులకు అడ్డాలుగా మారాయి. కొందరు మతపెద్దలు ఏకంగా తమ అధికారిక నివాసాలకు యువ సన్యాసినులను తీసుకెళుతున్నారు. క్రైస్తవ సన్యాసినిగా పనిచేసిన 35 ఏళ్లలో కనీసం నాలుగుసార్లు నేను లైంగిక వేధింపులకు గురయ్యాను. నా సహచరుల్లో చాలా మందికీ ఇవే చేదు అనుభవాలు ఎదురయ్యాయి.*

**- లూసీ కాలపుర, కేరళలోని క్రైస్తవ నన్**

# విద్యార్థులతో జగన్ 'భజన'

- విద్యాశాఖ మంత్రి సురేశ్ సాక్షిగా నిర్వహణ



జగన్ పాటకు నృత్యం చేస్తున్న విద్యార్థులు

అది ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలోని గిరిజన గురుకుల పాఠశాల. ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన విద్యార్థులకు శనివారం ఇక్కడ జోన్-3 ఆటలపోటీలు నిర్వహించారు. అదే నియోజకవర్గానికి చెందిన మంత్రి ఆదిమూలపు సురేశ్ విచ్చేశారు. ఆయన సాక్షిగా విద్యార్థులు ముఖ్యమంత్రి జగన్ భజన నిర్వహించారు. సీఎం జగన్‌ను కొనియాడుతూ 'రాయలసీమ ముద్దుబిడ్డ మన జగనన్న' అన్న పాటకు విద్యార్థులతో నృత్యం చేయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం దానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

**- ఒంగోలు, ఆంధ్రజ్యోతి**



షెడ్యూల్ విడుదల చేస్తున్న సురేశ్, అనిల్

## మార్చి 23 నుంచి టెన్త్ పరీక్షలు

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు 2020 మార్చి 23 నుంచి జరగనున్నాయి. ఏప్రిల్ 8వ తేదీతో పరీక్షలు ముగుస్తాయి. సచివాలయంలో మంగళవారం విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్, జలవనరుల మంత్రి అనిల్ కుమార్ యాదవ్ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేశారు. అన్ని పరీక్షలు నిర్దేశిత తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు నిర్వహిస్తారు. కొన్ని లాంగ్వేజ్ పరీక్షలకు మరో అరగంట అదనంగా కేటాయించారు.

### పరీక్ష ఫీజు గడువు... 20

కాగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 20 వరకు అవకాశం ఉందని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఎ.సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబరు 27 వరకు, రూ.200 రుసుముతో జనవరి 4 వరకు, రూ.500 రుసుముతో జనవరి 18 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. రెగ్యులర్ అభ్యర్థులు అన్ని సబ్జెక్టులకు కలిసి రూ.125, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్టుల వరకు రూ.110 ఫీజు చెల్లించాలని, ఒకేషనల్ అభ్యర్థులు పై ఫీజులకు అదనంగా రూ.60 చెల్లించాలని తెలిపారు.

**పరీక్షల షెడ్యూల్**

| తేదీ | సబ్జెక్టు-పేపర్ |
|---|---|
| 23/03/20 | ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1(గ్రూప్-ఎ) |
| | ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1(కాంపోజిట్) |
| 24/03/20 | ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2(గ్రూప్-ఎ) |
| | ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2(కాంపోజిట్) |
| | ఓఎస్ఎస్‌సీ లాంగ్వేజ్ పేపర్-1 (సంస్కృతం, అరబిక్, పర్షియన్) |
| 26/03/20 | సెకండ్ లాంగ్వేజ్ |
| 27/03/20 | ఇంగ్లీషు పేపర్-1 |
| 28/03/20 | ఇంగ్లీషు పేపర్-2 |
| 30/03/20 | మేథ్స్ పేపర్-1 |
| 31/03/20 | మేథ్స్ పేపర్-2 |
| 01/04/20 | జనరల్ సైన్స్ పేపర్-1 |
| 03/04/20 | జనరల్ సైన్స్ పేపర్-2 |
| 04/04/20 | సోషల్ స్టడీస్ పేపర్-1 |
| 06/04/20 | సోషల్ స్టడీస్ పేపర్-2 |
| 07/04/20 | ఓఎస్ఎస్‌సీ లాంగ్వేజ్ పేపర్-2 (సంస్కృతం, అరబిక్, పర్షియన్) |
| 08/04/20 | ఎస్ఎస్‌సీ వొకేషనల్ కోర్స్(థియరీ) |

# ష్.. గప్‌చుప్!

- సీఎం సమీక్షల సమాచారం 'ఆంధ్రజ్యోతి'కి అందకుండా కట్టడి
- టెలిగ్రామ్ గ్రూప్‌లో చేర్చని సీఎంవో
- విన్నవించుకున్నా లభించని ఫలితం
- 'పరిశీలిస్తాం' అని సరిపెట్టిన సమాచార మంత్రి

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): "కక్షలు, కార్పణ్యాలు, రాగద్వేషాలు, వివక్ష లేకుండా పారదర్శకంగా పాలిస్తాం" అని ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సమయంలో వైఎస్ జగన్ స్పష్టమైన ప్రకటన చేశారు. ఇతర అంశాల సంగతి పక్కనపెడితే... స్వయంగా ముఖ్యమంత్రి చేసే అధికారిక సమీక్షల విషయంలోనే ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తోంది. సీఎం చేసే సమీక్షల సమాచారం 'ఆంధ్రజ్యోతి'కి రాకుండా నియంత్రించింది. ముఖ్యమంత్రి వివిధ శాఖలు, అంశాలపై చేసే సమీక్షల వివరాలనును మీడియాకు తెలియచేసేందుకు సీఎం కార్యాలయం (సీఎంవో) ప్రత్యేకంగా ఒక 'టెలిగ్రామ్' గ్రూప్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో ఏబీఎన్, ఆంధ్రజ్యోతిని చేర్చలేదు. ఈ విషయాన్ని పలుమార్లు సీఎంవో దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లభించలేదు. ముఖ్యమంత్రి కార్యాలయ చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా నియమితుడైన శ్రీహరికి కూడా ఈ అంశం గురించి వివరించినప్పటికీ స్పందన కనిపించలేదు. సీఎంవో మీడియా గ్రూప్‌లో 'ఆంధ్రజ్యోతి'ని చేర్చలేదని సమాచార శాఖ మంత్రి పేర్ని నాని దృష్టికి తీసుకెళ్లినప్పుడు 'పరిశీలిస్తాం' అని హామీ ఇచ్చారు తప్ప ఫలితం మాత్రం లేదు. సీఎం సమీక్షల సమాచారాన్ని ప్రభుత్వమే తొక్కిపెట్టినప్పటికీ 'ఆంధ్రజ్యోతి' తనవంతు బాధ్యతగా ఇతర మార్గాల్లో ఆ వివరాలను సేకరించి... పాఠకులకు అందిస్తూనే ఉంది.

## ఏబీఎన్ ఆపాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న ఎమ్మెస్వోలను పిలిపించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ప్రసారాలు నిలిపివేయాల్సిందే అని మంత్రులు స్పష్టం చేశారు. న్యాయపరమైన వివాదాలు ఏమైనా వస్తే తాము చూసుకుంటామన్నారు. ఈ సమావేశానికి హాజరుకాని ఎమ్మెస్వోలకు కూడా విషయం చెప్పాలని ఆదేశించారు. ఈ ఏడాది సెప్టెంబరులోనూ మంత్రుల ఆదేశాల మేరకు ఏబీఎన్ ప్రసారాలను నిలిపివేశారు. దీనిపై ఏబీఎన్ న్యాయపోరాటం చేసింది. ప్రసారాల నిలిపివేతను టీడీశాట్ తప్పుపట్టింది. ప్రసారాలను పునరుద్ధరించాల్సిందేనని స్పష్టం చేసింది. లేనిపక్షంలో లైసెన్సులు రద్దు చేస్తామని కూడా హెచ్చరించింది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఫైబర్ నెట్‌కు రూ.5 లక్షల జరిమానా కూడా విధించింది. మరోవైపు ప్రజలు, ప్రజాసంఘాలు, పాత్రికేయ సంఘాలు కూడా ఏబీఎన్ నిలిపివేతపై నిరసన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెస్వోలు ఏబీఎన్ ప్రసారాలను పునరుద్ధరించారు. అయితే... ఏబీఎన్‌ను ప్రేక్షకులకు దూరం చేయడమే లక్ష్యంగా సర్కారు పెద్దలు మళ్లీ పావులు కదిపారు. ప్రసారాలు నిలిపివేయాల్సిందేనని మరోసారి ఎమ్మెస్వోలకు స్పష్టం చేశారు. దీంతో ప్రస్తుతం ఎఫ్‌టీఏ1 (ఫ్రీటు ఎయిర్) ప్యాకేజీలో ఉన్న ఏబీఎన్‌ను ఫలానా తేదీ నుంచి ఎఫ్‌టీఏ2 ప్యాకేజీలోకి మారుస్తున్నామని, చానల్ కావాలనుకునే వారు అదనంగా డబ్బులు చెల్లించాలని స్క్రోలింగ్ మొదలుపెట్టారు. దీనిపై ప్రేక్షకుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఉచితంగా ఇవ్వాల్సిన చానల్‌కు డబ్బులు అడగటమేమిటని ఫోన్లు చేసి ప్రశ్నించారు. 'తాము ప్రసారం చేస్తున్న ఫ్రీ చానళ్ల పరిమితి మించినందున... ఏబీఎన్ ప్యాకేజీ మారుస్తున్నాం' అని ఎమ్మెస్వో ప్రతినిధులు పొంతన సమాధానం చెప్పారు. "ఇన్నాళ్లు ఫ్రీగానే ఇచ్చారు కదా! కొత్తగా ఏం చానళ్లు వచ్చాయని ఏబీఎన్‌ను మారుస్తున్నారు? అదనంగా ఎందుకు డబ్బులు ఇవ్వాలి" అని నిలదీస్తున్నారు. దీనికి సమాధానం ఇవ్వలేని ఎమ్మెస్వోలు యథాతథంగా ఏబీఎన్ ప్రసారాలు కొనసాగిస్తున్నారు. కానీ, ప్యాకేజీ మార్పు స్క్రోలింగ్‌ను మాత్రం తొలగించలేదు. ఈ నేపథ్యంలో మంత్రులు మరోమారు రంగంలోకి దిగారు. ఎమ్మెస్వోలను పిలిపించి... ఎట్టి పరిస్థితుల్లో ఏబీఎన్‌ను ఆపివేయాలని హుకుం జారీ చేసినట్లు తెలిసింది.

## ఓఆర్ఎస్ కంటే గంజి బెటర్

- డాక్టర్ వి.ఐ.మత్తన్ వెల్లడి



రాయదుర్గం/హైదరాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అతిసారతో బాధపడే చిన్నారులకు ఓఆర్ఎస్ కంటే అన్నం నుంచి తీసిన గంజి తాగించడం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వెల్లూరు క్రిస్టియన్ వైద్య కళాశాలలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగ వ్యవస్థాపకుడు డాక్టర్ వడకేనదయిల్ ఇత్తియెరా మత్తన్ వెల్లడించారు. తమ పరిశోధనల్లో ఈ విషయాన్ని గుర్తించామన్నారు. గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీలో మంగళవారం డాక్టర్ డి.భాస్కర్‌రెడ్డి స్మారక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

## టీటీడీ చైర్మన్ రాజీనామా చేయాలి

- ఆనంద ఆశ్రమం పీఠాధిపతి శ్రీనివాసానంద

విశాఖపట్నం, డిసెంబరు 3: తిరుమల లడ్డూ ధర, వసతి గృహాల అద్దె పెంపు వెనుక రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం ఉందని ఆనంద ఆశ్రమం పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి ఆరోపించారు. మంగళవారం ఆయన విశాఖపట్నంలో మాట్లాడుతూ దేవస్థానానికి ఆదాయం వస్తుండగా, ధరలు పెంచడం ఎందుకని ప్రశ్నించారు. కేవలం భక్తులను ఇబ్బంది పెట్టడానికేనని ఇదంతా చేస్తున్నారని, దీనికి బాధ్యత వహిస్తూ టీడీటీ చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తిరుమల వెబ్‌సైట్‌లో అన్యమత ప్రచారం జరడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. పవన్‌కల్యాణ్ హిందువులకు రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని, అందుకు ఆయన క్షమాపణ చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రారంభిస్తే మాతృభాష తెలుగు మరుగున పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

## వైవీ, ధర్మారెడ్డిని తొలగించాలి

- జైహిందుస్థాన్ పార్టీ డిమాండ్

తిరుపతి, డిసెంబరు 3: టీటీడీలో వివాదాలు సృష్టించి శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, అదనపు ఈవో ధర్మారెడ్డిని ప్రభుత్వం వెంటనే తొలగించాలని జైహిందుస్థాన్ పార్టీ జాతీయ అధ్యక్షుడు తుమ్మా ఓంకార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన తిరుపతిలో మాట్లాడుతూ హిందువులకు పవిత్రమైన కార్తీకమాసంలో శ్రీవారి పుష్కరిణిని మరమ్మతుల పేరుతో మూసివేడం దారుణమన్నారు. పార్టీ ఉపాధ్యక్షుడు బి.మునిబాబు మాట్లాడుతూ టీటీడీకి అనుబంధమైన కపిలేశ్వరస్వామి ఆలయంలో ప్రైవేటు వ్యక్తులకు యాగాలు, హోమాల నిర్వహణకు ఎలా అనుమతిస్తారని ప్రశ్నించారు. టీటీడీలో అన్యమత ప్రచారం జరగడం లేదని చైర్మన్ సుబ్బారెడ్డి ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు.

# మాజీ మంత్రి నారాయణపై దాడి

- చొక్కా పట్టుకున్న వైసీపీ కార్యకర్త
- కారుపై కొట్టి, రాళ్లు విసిరి.. దుర్భాషలు



నారాయణపై వైసీపీ కార్యకర్తల దాడి

అనంతపురం డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత పి.నారాయణపై ఓ వైసీపీ కార్యకర్త దాడిచేశాడు. మంగళవారమిక్కడ జీసస్ నగర్‌లోని నారాయణ స్కూలులో నారాయణ ప్రిన్సిపాళ్లు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అది ముగిసిన తర్వాత ఆయన స్కూలు నుంచి బయటకు వస్తుండగా పీడీఎస్‌యూ నాయకుడు నరేశ్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు మనోహర్ మరికొందరు విద్యార్థులతో పాటు వైసీపీ కార్యకర్త ఆవుల రాఘవేంద్రరెడ్డి నిరసన తెలిపారు. అధిక ఫీజులు వసూలు చేయడం దారుణమని, కరువు జిల్లాలో 50 శాతం రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిశీలిస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు. అయితే రాఘవేంద్రరెడ్డి దురుసుగా.. ఆగు, ఇప్పుడే చెప్పాలని నారాయణను నిలదీశాడు. సమాధానమిచ్చి వెళ్తున్న మాజీ మంత్రి చొక్కాను వెనుక నుంచి లాగాడు. తర్వాత ముందుకెళ్లి చొక్కా పట్టుకున్నాడు. ఉలిక్కిపడిన స్కూలు సిబ్బంది నారాయణను సురక్షితంగా కారెక్కించారు. అయితే రాఘవేంద్రరెడ్డి కారు ముందుకెళ్లి దానిపై చేతితో పిడిగుద్దులు గుద్దాడు. స్థానికులు, సిబ్బంది ఎంత అడ్డుకున్నా ఆగకుండా రెచ్చిపోయాడు. తర్వాత కారుపై రాళ్లు కూడా విసిరాడు. దుర్భాషలాడాడు. రాత్రికి పోలీసులు అక్కడకు వెళ్లి సంఘటనపై ఆరా తీశారు. ఈ సంఘటనపై డీఎస్పీ వీరరాఘవరెడ్డిని ఆరా తీయగా తమకేమీ తెలియదని బదులిచ్చారు.

# అనకాపల్లిలో గోవధ

- గుట్టుచప్పుడు కాకుండా మాంసం విక్రయం
- కొవ్వుతో నూనె తయారు..హోటళ్లకు సరఫరా
- కబేళాను సీజ్ చేసిన అధికారులు



ఆవు మాంసాన్ని చూపిస్తున్న జోనల్ కమిషనర్ శ్రీరామ్మూర్తి

అనకాపల్లి, డిసెంబరు 3: గుట్టుచప్పుడు కాకుండా ఆవులను వధిస్తూ, మాంసం విక్రయంతోపాటు, కొవ్వుతో నూనె తయారుచేసి హోటళ్లకు సరఫరా చేస్తున్న ఘటన అనకాపల్లిలో బట్టబయలైంది. దీనికి సంబంధించి ఓ వ్యక్తిని మహా విశాఖ నగర పాలక సంస్థ అనకాపల్లి జోనల్ కార్యాలయ అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. గవరపాలెం అరుంధతి నగర్‌కు చెందిన కొల్లి సూరిబాబు అనకాపల్లి కబేళాలో ఆవులను వధించి మాంసం విక్రయిస్తున్నాడు. వాటి కొవ్వును మరిగించి నూనెగా తయారు చేసి స్థానిక హోటళ్లకు సరఫరా చేస్తున్నాడు. మంగళవారం వార్డు పర్యటనలో భాగంగా జోనల్ కమిషనర్ శ్రీరామ్మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు ఇక్కడికి వచ్చారు. కబేళా నుంచి దుర్వాసన వస్తుండడంతో లోపలకు వెళ్లి ఆరా తీశారు. అక్కడ బక్కచిక్కిన ఆవులు వారికి కనిపించాయి. మరింత లోనికి వెళ్లగా ఆవు మాంసం, కొవ్వు, కొవ్వుతో తయారుచేసిన నూనె కనిపించాయి. సూరిబాబును అదుపులోకి తీసుకొని పట్టణ పోలీసులకు అప్పగించారు. కమిషనర్ ఫిర్యాదు మేరకు సూరిబాబు, వి.రమణపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు.

## అన్యమత వివాదాలపై సరైన నిర్ణయం తీసుకోవాలి

**విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర**


స్వామిజీలకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

శ్రీశైలం, డిసెంబరు 3: తిరుమల తిరుపతి దేవస్థానంలో తరచూ అన్యమత వివాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వాటి నివారణకు ప్రభుత్వం సరైన నిర్ణయాలు తీసుకోవాలని విశాఖ శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి అన్నారు. శారదా పీఠం పీఠాధిపతి స్వరూప నందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి మంగళవారం శ్రీశైలంలోని భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం మల్లికార్జున స్వామి అభిషేక పూజల్లో పాల్గొని భ్రమరాంబదేవిని దర్శించుకున్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం స్వాత్మానంద సరస్వతిని దేశమంతటా యాత్ర చేపట్టాలని ఆదేశించినట్లు స్వరూపానందేంద్ర సరస్వతి తెలిపారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని వారి ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్‌లో యాత్ర ప్రారంభిస్తున్నామని చెప్పారు.

## అంబేడ్కర్ వర్సిటీకి జాతీయ స్థాయి స్వచ్ఛత అవార్డు

ఎచ్చెర్ల, డిసెంబరు 3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో స్వచ్ఛత అవార్డు లభించింది. న్యూ ఢిల్లీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ అందజేసిన స్వచ్ఛ క్యాంపస్ అవార్డులో నాలుగో స్థానాన్ని అంబేడ్కర్ వర్సిటీ దక్కించుకుంది. కేంద్ర మానవ వనరుల శాఖ కార్యదర్శి ఆర్.సుబ్రహ్మణ్యం, యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ డీపీ సింగ్, ఏఐసీటీఈ చైర్మన్ అనిల్ డి.సహస్ర బూదే, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ చేతుల మీదుగా అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కూన రాంజీ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రఘుబాబు అవార్డు అందుకున్నారు.

## చేనేత కార్మికుల రిలే నిరాహార దీక్షలు

మంగళగిరి రూరల్, డిసెంబరు 3: షెడ్డు కార్మికులకు రూ.24 వేలు ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఎర్రబాలెంలో చేనేత కార్మికుల దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 97వేల కుటుంబాలకు పథకం వర్తిస్తుందని ప్రకటించిన ప్రభుత్వం షెడ్డు కార్మికులను తొలగించి చేనేత కార్మికులను మోసం చేసిందన్నారు. షెడ్డు కార్మికులకూ సాయం అందజేయాలని లేకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని చెప్పారు.


**శ్రీ కాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానము**
**శ్రీకాళహస్తి :: చిత్తూరు జిల్లా**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు**

ఆర్.సి.నెం. E1/12/2018 తేది : 02-12-2019

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానము నందు క్రింద తెలిపిన వివిధ అభివృద్ధి పనులు.

1) సానిటేషన్ మరియు హౌస్ కీపింగ్ పనులు
2) కైలాస సదన్ అతిథి గృహమునకు ఫర్నిచర్ సరఫరా చేయుట
3) లగేజి / బ్యాగ్ స్కానర్స్ సప్లై చేయుట
4) ఆలయము నందు అవసరమైన HVLS ఫ్యాన్లు సప్లై చేయుటకుగాను

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరులు కోరబడుచున్నవి.
వివరములకై www.eprocurement.gov.in నందు పరిశీలించవచ్చును. ఇతర వివరములకై 77023 76820/ 81791 90081/ 99859 49739/ 87904 05030/ 93940 49697 నందు సంప్రదించవచ్చును.

| | |
|---|---|
| బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభపు తేది | 7-12-2019 ఉ॥10.00 గం॥ల నుండి |
| బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది | 21-12-2019 మ॥3.00 గం॥ల వరకు |
| బిడ్‌లను స్వీకరించుటకు చివరి తేది | 21-12-2019 మ॥ 4.00 గం॥లకు |
| బిడ్‌లను తెరచు తేది | 21-12-2019 సా॥ 5.00 గం॥లకు |

// శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి సేవలో //
సం/- సి. చంద్రశేఖర్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి


## తండ్రిని కొట్టి.. పించను లాక్కెళ్లాడు



త్రిపురాంతకం, డిసెంబరు 3: ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పింఛనే ఆ పండుటాకుకి ఆసరా. కొన్నాళ్లుగా పాక్షిక పక్షవాతంతో బాధపడుతూ పనిచేయలేని స్థితిలో పింఛనుతోనే కాలం వెళ్లదీస్తున్నాడతను. అలాంటి ముసలి తండ్రిపై జాలి చూపాల్సింది పోయి.. అతన్ని కొట్టి ఆ పింఛను సొమ్ము లాక్కున్నాడో ప్రబుద్ధుడు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం దూపాడులో మంగళవారం ఈ దారుణం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సూదుల సుబ్బయ్య (75)కు 16 మంది సంతానం. ఆయన ఇటీవల పాక్షిక పక్షవాతంతో మంచాన పడ్డాడు. నెలనెలా వచ్చే వృద్ధాప్య పింఛన్‌తో జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల కూడా గ్రామ సచివాలయానికి వచ్చి పింఛన్ తీసుకున్నాడు. కాగా మద్యానికి బానిసైన రెండో కొడుకు నాగరాజు అక్కడే కాచుకుని పెన్షన్ డబ్బు తనకివ్వాలని అడిగాడు. సుబ్బయ్య నిరాకరించడంతో కర్రతో చితకబాదాడు. పెన్షన్ పుస్తకం లాక్కుని చించేశాడు. అక్కడున్న సిబ్బంది, గ్రామస్తులు అడ్డుకోబోతే వారిపైనా దాడికి ప్రయత్నించి దుర్భాషలాడాడు. తండ్రి వద్ద డబ్బు లాక్కుని వెళ్లిపోయాడు.

## మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి: రఘువర్మ

పూసపాటిరేగ,డిసెంబరు3: అమ్మఒడిలో నేర్చుకున్న భాష మాతృభాష అని, ఆ భాషలోనే విద్యాబోధన జరగాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ జిల్లా పరిషత్ పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి ఆరో తరగతి వరకూ ఆంగ్లమాధ్యమంలో బోధన జరగాలని చెబుతూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని, దీనిపై పునరాలోచించాలన్నారు.

# రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాలు

**మండలానికి ఐదు ఏర్పాటు: మంత్రి కన్నబాబు**

సర్పవరం జంక్షన్, డిసెంబరు 3: రైతులకు మరింత మెరుగైన సేవలందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా తొలిదశలో 2 వేల వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు వ్యవసాయ, సహకారశాఖ మంత్రి కురసాల కన్నబాబు పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులకు మేలైన వరి వంగడాలు, వ్యవసాయ వనరులు పంపిణీ చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, ఇందులో భాగంగా మండలానికి ఐదు కేంద్రాలు ఏర్పాటుచేయనున్నామని తెలిపారు. ఈ కేంద్రాల్లో ఉత్తమ ఆచరణీయ వరిసాగుపై రైతులకు శిక్షణ, వైఎస్సార్ వ్యవసాయ ఇన్‌పుట్ షాపులో నాణ్యత పరీక్ష చేసిన విత్తనాలు, వరిసాగులో మరింత మెలకువలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు ఉపయోగపడే ఇన్‌పుట్ దుకాణాలు, గ్రామ విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటుచేయనున్నామన్నారు. మొదటి దశలో ఏర్పాటుచేయనున్న భరోసా కేంద్రాలకు అధికారులు తగిన ఏర్పాట్లుచేయాలని సూచించారు. తాత్కాలికంగా పాక్స్ సొసైటీల్లో ఏర్పాటుచేస్తున్నామని, 2022 నాటికి పూర్తిస్థాయిలో అన్ని గ్రామ సచివాలయాల సమీపంలో నూతన భవనాలు నిర్మించనున్నట్టు తెలిపారు. రైతు భరోసా పథకం, ఖరీఫ్, రబీ సాగు, ప్రభుత్వ పథకాల అమలుపై కన్నబాబు అధికారులకు పలు సూచనలు చేశారు.

**అమెజాన్‌లో ఆప్కో వస్త్రాలు: మేకపాటి**

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అమెజాన్ వెబ్‌సైట్ ద్వారా ఆప్కో వస్త్రాల విక్రయం ప్రారంభించినట్టు పరిశ్రమలు, చేనేత శాఖ మంత్రి మేకపాటి గౌతం రెడ్డి చెప్పారు. మంగళవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం తరపున జరుగుతున్న అమ్మకాలు కాబట్టి 8 శాతం కమీషన్ మాత్రమే అమేజాన్ వసూలు చేస్తున్నట్లు చెప్పారు.

**పట్టిసీమ నీరు నిలిపివేత**

పోలవరం, డిసెంబరు 3: పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు గోదావరి జలాల పంపిణీని సోమవారం రాత్రి నిలిపివేశారు. ఈ ఏడాది పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా 84 రోజులపాటు 43 టీఎంసీల గోదావరి జలాలను పోలవరం ప్రాజెక్టు కుడికాలువ ద్వారా కృష్ణా, రాయలసీమలకు తరలించినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డీఈ భాస్కరరామకృష్ణ తెలిపారు. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 14 మీటర్లు ఉందని, ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ పరిధిలో అన్నిచోట్ల రబీ పంటకు సరిపడా జలాల సరఫరా జరుగుతున్నందున నీటి సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు.




# తహసీల్దార్ గోవిందసింగ్‌పై మరో కేసు

**రూ.43.37 లక్షలు, పలు డాక్యుమెంట్లు స్వాధీనం**

**షేర్స్‌లో రూ.13 లక్షల పెట్టుబడి**

**ఆస్తుల విలువ సుమారు రూ.4 కోట్లు**


గోవిందసింగ్ నివాసంలో స్వాధీనం చేసుకున్న నగదు, నగలు, బ్యాంక్ పాసుబుక్కులు

కర్నూలు, డిసెంబరు 3: పట్టాదారు పాసు పుస్తకం కోసం రూ.5వేలు లంచం తీసుకుంటూ అక్టోబరులో ఏసీబీ అధికారులకు చిక్కిన కర్నూలు జిల్లా సంజామల తహసీల్దార్ గోవిందసింగ్‌పై మరో కేసు నమోదైంది. ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ నాగభూషణం తెలిపారు. మంగళవారం కర్నూలులోని క్రిష్ణానగర్ న్యూ కాలనీలో ఉన్న గోవింద సింగ్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. గతంలో అక్టోబరు 11వ తేదీన ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో రూ.16.32 లక్షల నగదు, 428 గ్రాముల బంగారు నగలు గుర్తించారు. వీటితో పాటు రూ.1.09 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఫిక్స్‌డ్ డిపాజిట్లన్నీ ఆయన భార్య అంభుజాసింగ్, కొడుకు ప్రదీప్ సింగ్, కూతురు ప్రదీప్‌దీప్తి సింగ్ పేర్ల మీద ఉన్నాయి. కర్నూల్లోనే ఒక్కొక్కటి 5 సెంట్లతో ఉన్న నాలుగు ఇళ్ల స్థలాల డాక్యుమెంట్లు, రాయచూరులో ఐదు సెంట్ల స్థలాల డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రా బ్యాంక్ లాకర్‌ను తెరిస్తే అక్కడ కూడా రూ.26.50 లక్షల నగదు లభ్యమైంది. తాజాగా మంగళవారం ఆయన ఇంట్లో జరిపిన సోదాల్లో మరో రూ.55 వేల నగదు లభ్యమైంది. అలాగే ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. వీటితో పాటు కార్వే స్టాక్ షేర్స్‌లో గోవిందసింగ్ రూ.13 లక్షల పెట్టుబడి పెట్టినట్లు గుర్తించారు. బహిరంగ మార్కెట్లో ఆయన ఆస్తుల విలువ రూ.4 కోట్లు పైగా ఉంటుందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా... గోవిందసింగ్ నవంబరు 30వ తేదీన బెయిల్‌పై విడుదలయ్యారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన ఏసీబీ బుధవారం ఆయనను కోర్టులో హాజరుపరచనున్నారు.


## క్యాన్సర్‌ను జయించవచ్చును !

ప్రతి సంవత్సరం లక్షలాది కొత్త కేసులు నమోదు అవుతున్నాయి. క్యాన్సర్ భారతదేశంలో రోజురోజుకు తన ప్రభావాన్ని పెంచుతున్నది. 2025లోగా ఐదు రెట్లు పెరిగి మరణానికి కారకమవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. భారతదేశంలో మరణాలకు ప్రధాన కారకాలలో క్యాన్సర్ ఒకటి అవుతుంది. సుమారు 3 మిలియన్ల రోగులు ఈ వ్యాధి నుండి బాధపడుతున్నారు.
క్యాన్సర్‌పై పోరాడి విజయాన్ని పొంది, ఇప్పుడు ఆనందంగా గడుపుతున్న వారి విజయ గాధలు ఎన్నోఉన్నాయి. ఈ ప్రేరణ ఎంతో మంది హృదయాలలో ఆనందాలను నింపి, వారిని ఆనందంగా జీవించడానికి దోహదపడుతున్నాయి. సకాలంలో హానికరమైన క్యాన్సర్‌ను గుర్తించి, చికిత్సను అందించడంవలన జీవిత కాలాన్ని పెంచవచ్చును. అదేవిధంగా నాల్గవ దశలో ఉన్న ఎంతోమంది క్యాన్సర్ రోగులను సాధారణ ఆరోగ్య స్థితికి తీసుకరావడం జరిగింది. వారిలో చాలా మందికి కాలేయం, మెదడు, ఊపిరితిత్తులు, వీర్యగ్రంథి, క్లోమగ్రంథి, మూత్రపిండాలు, గర్భాశయం వగైరాలకు వ్యాధి సోకడం వలన వారు క్రమంగా నిరాశకు లోనయి చివరి దశగా భావించి చికిత్స పొందినవారే.


పిత్తాశయ క్యాన్సర్ జయించిన శారదా దేవి విజయగాధ

శ్రీమతి శారదా దేవికి పరీక్షలు నిర్వహించగా ఆమె పిత్తాశయ క్యాన్సర్‌తో బాధపడుతున్నదని కనుగొనబడింది. రెండవసారి కూడా పరీక్ష చేయించగా అదే నిర్ధారణ అయ్యింది. కొన్నిసార్లు ఆమెకు ఉపశమనం కల్గినట్లుగా, కొన్నిసార్లు సంక్లిష్టంమైనట్లుగా అనిపించేది. మొత్తంగా చూసినప్పుడు పెద్ద మార్పు అనిపించలేదు. ఆమె శారీరక స్థితి కూడా క్షీణించింది. జ్వరం, తలనొప్పి వచ్చినట్లుగా ఉండేది. తత్ఫలితంగా వేగంగా బరువు తగ్గడం మొదలైంది. వ్యాధి తీవ్రత వలన ఆమె బలహీనం కావడంతో ఏదేని చికిత్సను అందించడానికి ఎంతో ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడింది.
జూలై 1996లో ఆమె DSRC నిపుణుల చికిత్సకోసం వచ్చింది. ఆకలి మందగించడం, జ్వరం తలనొప్పికి అందించిన చికిత్సకు అందరిమాదిరిగా బాగా స్పందించింది మరియు నిద్రించు పరిస్థితి మెరుగుపడి 1 క్రిగా బరువు పెరిగింది. 6-8 నెలలలోనే అన్ని విధాలుగా ఆరోగ్యం కుదుట పడి 17 కి.గ్రా బరువు పెరిగింది.
పిత్తాశయంలో కణితి తగ్గినట్లుగా వ్యాధినిర్ధారణలో తేలింది. 14 నెలల తర్వాత నిర్వహించిన USGలో కాలేయం, క్లోమం, ప్లీహము మరియు మూత్రపిండాలు సాధారణ స్థితికి వచ్చాయి. పిత్తాశయంలో రాయి కారణంగా అది కుచించుకపోయింది. 21 నెలల తర్వాత ఇంతకుముందు ఉన్న క్యాన్సర్‌పోయి రోగి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా పూర్వపు స్థితికి చేరింది. ఇప్పుడు క్యాన్సర్ లేకుండా శ్రీమతి శారదా దేవి పూర్తిగా సాధారణ జీవితాన్ని గడుపుతూ ఉంది. ఇటువంటి గాథలు ఎంతో విలువైనవి. వ్యాధిపై పోరాడే పటిమను వారికి అందించడం వలన వారిలో భయం తొలగిపోయి క్యాన్సర్ రోగులు ఎంతో ధృఢంగా ఉంటారు.
క్యాన్సర్‌పై పోరాడటానికిమాతో కలసిరండి. మరింత సమాచారం కొరకు 9100943142కి కాల్ చేయండి లేదా www.dsresearchcentre.com దర్శించండి.

● ADVT





1335.2019

# సరికొత్త సంబంధాలు

శ్రీలంకలో ఇద్దరు సోదరులు దేశాధినేతలుగా ఉన్నారు. అధ్యక్ష ఎన్నికల్లో చక్కని విజయం సాధించిన గోటబయ రాజపక్స, అగ్రజుడు మహీంద రాజపక్సని ప్రధానిగా నియమించుకున్నారు. సర్వసాధారణంగా ప్రజాస్వామ్యదేశాల్లో కనిపించని దృశ్యం ఇది. చైనాకు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన మహీంద గతంలో లంకాధీశుడిగా భారత్‌తో ఎలా వ్యవహరించారో చూసిందే. ఇప్పుడు కీలకపదవులు రెండూ వారివే కావడంతో భారత్–లంక బంధాల విషయంలో భయం కలగడం సహజం. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన గోటబయ తన తొలి విదేశీ పర్యటన భారత్‌లోనే జరపడం ద్వారా ఆ అనుమానాలు పటాపంచలు చేసేందుకు ప్రయత్నించారు. చైనాతో తమవి ఆర్థికబంధాలేననీ, భారత్‌తో అంతకు మించినదేదో ఉన్నదన్నారు. రెండు దేశాల మధ్యలో మూడోవ్యక్తి దూరేందుకు చోటివ్వబోమన్నారు. భారత భద్రతకు, ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ పనీ తన హయాంలో జరగదన్నారు. మోదీని తన తొలి విదేశీ అతిథిగా పర్యటించేందుకు రమ్మన్నారు. గోటబయ పర్యటన సందర్భంగా మనదేశం లంకకు ఆర్థిక సహాయాన్ని కూడా ప్రకటించింది. అయినప్పటికీ, రాజపక్స సోదరుల విషయంలో మన అనుమానాలు మనకుంటాయి, వారి లెక్కలు వారికుంటాయి.

గెలిచినందువల్ల కాబోలు, రాజపక్స సోదరులు ఈ ఎన్నికల్లో భారత్ ఏ కుట్రలకూ పాల్పడలేదన్నారు. తన ఓటమికి భారత్ కారణమని గతంలో మహీంద ఆరోపించిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకుంటే, ఇది మంచిమాటే. నిజానికి, ఈ ఎన్నికల్లో వేలుపెట్టేందుకు భారత్ గతంలో మాదిరిగా ప్రయత్నించలేదని కూడా అంటున్నారు. ఐదేళ్ళక్రితం మైత్రిపాల సిరిసేన అధికారంలోకి రావడంలో భారత్ సహకారమూ ఉన్నదన్న విమర్శలున్నాయి. సిరిసేన మీద మన మనసు విరిగిపోవడం, రాజపక్స సోదరులకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ ఇప్పటి తటస్థవైఖరికి కారణం కావచ్చు. గత ఏడాది స్థానిక ఎన్నికల్లో రాజపక్స పార్టీకి లభించిన ప్రజాదరణ చూసిన తరువాత భారత్ మనసు మారినట్టుంది. మహీంద రాజపక్స ఆ తరువాత రెండు మూడుసార్లు భారత్ వచ్చి ప్రభుత్వ పెద్దలతో భేటీ అయ్యారు. గోటబయ ఎన్నిక కాగానే ప్రధాని అభినందనలు తెలియచేయడం, ప్రమాణస్వీకారం అనంతరం విదేశాంగమంత్రి జయశంకర్ కొలంబో వెళ్ళి కలవడం తెలిసినవే.

ఆర్థికం, అభద్రత ఈ అన్నదమ్ముల విజయానికి దోహదపడిన అంశాలు. ఆర్థిక రంగం దెబ్బతినిపోయి, అప్పుల పాలైన దేశాన్ని రాజపక్స సోదరులు ఒడ్డునపడేస్తారని ప్రజల నమ్మకం. మాజీ ప్రధాని రణిల్ విక్రమసింఘే, అధ్యక్షుడు సిరిసేన మధ్య సాగిన అధికార యుద్ధంతో ప్రజలు విసిగెత్తిపోయారు. రెండువందల యాభైమంది ప్రాణాలు బలితీసుకున్న శ్రీలంక చర్చి పేలుళ్ళ ఘటన ప్రజల్లో భద్రతకు సంబంధించిన భయాన్ని పెంచేసింది. అధ్యక్ష ప్రధానుల మధ్య వైరంతో ప్రభుత్వ యంత్రాంగం చచ్చుబడిపోయి, ఈ పేలుళ్ళను నివారించలేకపోయిందని ప్రజలు భావించారు. ఎల్‌టీటీఈ నుంచి దేశాన్ని రక్షించిన ఈ సోదరులే ఇకపై ఉగ్రవాదం నుంచి తమను కాపాడగలరని ప్రజలు నమ్మారు. గతంలో మాదిరిగానే ఈ ఎన్నికల్లోనూ రాజపక్స సోదరులకు తమిళులు, ముస్లింలు ఓటు చేయలేదు కానీ, సింహళీయులు మాత్రం గంపగుత్తగా వీరికే ఓటేశారు. తాను సింహళీయుల ఓటుతోనే గెలిచాననీ, తమిళులు, ముస్లింలు తనను నమ్మకపోయినా వారికి అన్యాయం చేయబోనని ఎన్నికల్లో గెలిచిన వెంటనే గోటబయ ఓ మాటన్నారు కూడా. లంక తమిళ ప్రాంతాలకు అధికారాలు కట్టబెట్టే విషయంలో ఆయన ఎంత ఉదారంగా ఉంటారో చూడాలి.

అన్నదమ్ముల వైఖరిలో ఎంతో తేడా ఉన్నదనీ, పాశ్చాత్య సమాజాల్లో తిరుగుతూ, మొన్నటివరకూ అమెరికా పౌరసత్వం కూడా ఉన్న గోటబయ తన అగ్రజుడి తరహాలో జాతి దురహంకారంతో వ్యవహరించకపోవచ్చుననీ, చైనాతో అంతగా అంటకాగకపోవచ్చనీ నిపుణుల అభిప్రాయం. అగ్రరాజ్యాల ఆధిపత్యపోరులో చిక్కుకోకుండా లంకను సాధ్యమైనంత తటస్థంగా ఉంచాలన్నది గోటబయ ఆలోచన. చైనా ఇప్పటికే లంకలో పలు ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టి, దానిని అప్పుల ఊబిలో ముంచింది. లంకని కుదువపెట్టేశారని ప్రజలూ ఆగ్రహంగా ఉన్నారు. ఈ ప్రాజెక్టులను రద్దుచేసుకోలేని, కొనసాగించలేని అయోమయ స్థితిలో దేశం ఉన్నది. సిరిసేన ప్రభుత్వం ఓ రేవు ప్రాజెక్టును 99 సంవత్సరాల లీజుకు ఇచ్చి చైనానుంచి కొంతమేరకు రుణాన్ని మాఫీ చేయించుకున్న విషయం తెలిసిందే. ఆయన మీద భారత్ మనసు విరిగిపోవడానికి ఇదీ ఓ కారణం. మహీందతో పోల్చితే, ఒక మిలటరీ ఉన్నతాధికారిగా గోటబయకు భారతదేశ శక్తియుక్తులపై ఎంతో అవగాహన ఉన్నదనీ, దేశభద్రతకూ, అధికార సుస్థిరతకు దాని సహకారం అత్యావశ్యకమని ఆయనకు తెలుసునని ఓ వాదన. ఢిల్లీ పర్యటనలో చెప్పిన మాటలకు ఆయన ఎంత కట్టుబడతారో చూడాలి.

# ఆ మహిళల పరువూ విలువైనదే

వెటర్నరీ డాక్టర్ ప్రియాంక రెడ్డి హత్య దేశాన్ని కలిచివేసింది. నవంబర్ 27వ తారీకు ఇంటినుండి ఉద్యోగం రీత్యా బయలుదేరిన ఆమె తిరిగి రాలేదు. మాదాపూర్ నుంచి శంషాబాద్ కు వచ్చిన ఆమె, తన స్కూటీ టైర్ పంక్చర్ అయినట్టు, అక్కడి మనుషులను చూస్తుంటే తనకు భయం కలుగుతోందని చెల్లికి ఫోన్ చేసి చెప్పింది. తరువాత కొద్ది నిముషాల్లోనే ఆమె మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. దానితో ఆమె తల్లి, చెల్లెలు ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు ఇస్తే, వారు పాత పోలీస్ స్టేషన్‌కు వెళ్ళమన్నారు. మరుసటి రోజు ప్రియాంక శవం దహనమై కనిపించింది.

28న ప్రియాంక నివాస కాలనీ వాసులు, వెటర్నరీ సంఘ సభ్యులు క్యాండిల్ మార్చ్ చేసారు. తరువాతి రోజు దేశం మొత్తం పలు చోటల నిరసనలు వెల్లువెత్తాయి. దోషులను బహిరంగంగా ఉరి తీయాలని లేదా తగులబెట్టాలని ప్రజలు డిమాండ్ చేసారు.

ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగాన్ని గౌరవించాలని చెప్పే ఒక వర్గం (విమెన్ అండ్ ట్రాన్స్ జేఏసీ) ఉరిశిక్షకు వ్యతిరేకతను ప్రకటించారు. ఇక్కడ గమనించాల్సి విషయం ఏమిటంటే, ప్రజాస్వామ్యానికి తిలోదకాలిచ్చి, బహిరంగ శిక్షలు అమలు చేస్తే అణగారిన వర్గాలు మరింత అన్యాయానికి గురి అయ్యే అవకాశం ఉంది. ఆ నలుగురిని ఉరి తీస్తే స్త్రీలు ఈ దేశంలో స్వేచ్ఛగా బతకగలరా? మరెవరూ అలాంటి వారు లేరా? స్త్రీలపై దౌర్జన్యం అనేది మన సమాజంలో అంతర్భాగంగా వేళ్ళూనికొని వుంది. ఆడపిల్లను కట్టడి చెయ్యటానికి, హింసకుగురిచేయటానికి వెనుదీయనివారు ఈరోజు స్త్రీలపై దాడులను ఖండిస్తున్నారు.

సామజిక మాధ్యమాల్లో ప్రియాంక రెడ్డి ఆ రాత్రి బయటకెందుకు వెళ్ళింది అని, పాశ్చాత్య దుస్తులు ధరించిన మహిళను మానభంగం చెయ్యటం తప్పు లేదని వాదిస్తున్నారు. తమిళ సినిమా దర్శకుడు ఒకాయన సాంప్రదాయ దుస్తులు ధరించకపోవడం, కట్టుబాట్లను గౌరవించకపోవటంవల్లే హింస పెరిగిందంటూ మహిళలపై వారి అస్తిత్వంపై దాడి చేసాడు. ప్రజలకు ఎందుకు వీరి పైన ఆగ్రహం కలగటం లేదు? ఎందుకు కేవలం ఆ నలుగురు ముద్దాయిలను మాత్రమే ఉరి తీయాలంటున్నారు? ఎందుకంటే భారతీయ సమాజంలో కొన్ని రకాల హింసలు అంతర్భాగంగా ఉంటాయి. వాటిని ప్రశ్నించటం అంటే, బ్రాహ్మణీయ భావజాలాన్ని కులసమాజాన్ని ప్రశ్నించినట్టే. ఇక్కడ ప్రియాంక తల్లి తనకూతురు కనపడకపోవడం కాలనీలో ఎవరితోనూ చెప్పుకోలేకపోయింది. ఎందుకంటే, ఇప్పుడు ఏ సమాజం ఆమె వైపు నిలబడిందో అదే సమాజం ఒకవేళ ఆమె కూతురు క్షేమంగా ఉండి ఉంటే సమయానికి ఎందుకు ఇంటికి రాలేదో రకరాలుగా చర్చించి, నిందించి వారి పరువుతీసేవారు. అటువంటి హింసాత్మకమైన సమాజం ఇప్పుడు హింసకు వ్యతిరేకంగా నిరసనలు జరుపుతున్నది. స్త్రీలు కుటుంబంలో అనుభవించే హింసను చూసీ చూడనట్టు ఊరుకునే సమాజం, తక్కువ కులం వారిని ప్రేమిస్తే కన్న కూతురునే చంపేసే తల్లి తండ్రులున్న మన సమాజం ఈరోజు ముద్దాయిలను ఉరి తీయాలని కోరుతున్నది.



**స్త్రీలు కుటుంబంలో అనుభవించే హింసను చూసీచూడనట్టు ఊరుకునే సమాజం, తక్కువ కులం వారిని ప్రేమిస్తే కన్న కూతురునే చంపేసే తల్లి తండ్రులున్న మన సమాజం ఈరోజు ముద్దాయిలను ఉరి తీయాలని కోరుతున్నది.**

మహిళను గౌరవించే మన సమాజంలో ఒక స్త్రీని చూడగానే అమ్మ గుర్తురావాలి అంటున్నారు కొందరు. భారత సమాజంలో స్త్రీలకు గౌరవం ఉంది కానీ, ఆ గౌరవానికి అందరు స్త్రీలు అర్హులు కాదు. బ్రాహ్మణీయ కుల సమాజ కట్టుబాట్లలో బ్రతికే స్త్రీలు మాత్రమే ఈ గౌరవానికి అర్హులు. ఆడవాళ్లను అమ్మతో పోల్చి, ఆమె త్యాగం, బాధలు, ఓర్పు, పవిత్రతను గుర్తుచేస్తూ గౌరవించమని అర్థించటం క్రూరత్వమే అనిపించుకుంటుంది. ఆమె, ఏ బట్టలు ధరించినా, ఎన్ని పెళ్లిళ్లు చేసుకున్నా, ఒంటరిగా ఉన్నా, సెక్స్ వర్క్ చేస్తూన్నా, పేద స్త్రీ అయినా, మధ్య తరగతి అయినా, అర్ధరాత్రి బయట తిరిగినా అందరినీ ఒకే విధంగా గౌరవించమని మన బ్రాహ్మణీయ సమాజం చెప్పదు. ఈ సమాజంలో అమ్మ అంటే మధ్య తరగతికి చెందిన ఒక స్త్రీ. ఆమెకు కొన్ని లక్షణాలు ఆపాదించి పెట్టారు. ఆమె పెళ్లి తరువాత మాత్రమే తల్లి అవుతుంది. సాంప్రదాయ దుస్తులు ధరిస్తుంది. భర్తకు, పిల్లలకు చాకిరీ చేస్తూ త్యాగశీలిగా పేరు పొందుతుంది. ఈ తీరులో ఉండని స్త్రీలను గౌరవించమని బ్రాహ్మణీయ సమాజం మనకు ఎప్పుడు చెప్పదు. దాంతో స్త్రీలను అదుపుచేయడానికి పురుషులు మానభంగాన్ని ఒక ఆయుధంగా వాడుకుంటారు. ఈరోజున ఎక్కడ విన్నా చూసినా, మానభంగం హత్యలకు గురైన స్త్రీల గురించి, వారి దుస్తుల గురించి, లైంగిక జీవితం గురించి చర్చ జరుగుతుందంటే దానికి కారణం 'స్త్రీలను గౌరవించండి' అంటూ కొన్ని షరతులు పెట్టిన మన సమాజం. చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న మహిళలు సౌకర్యం మేరకు, అనుకూలమైన దుస్తులు ధరిస్తున్నారు. దీనిని కారణంగా చూపి, పురుషాధిక్యతను, లైంగిక హింసను సమర్థిస్తున్న మన సమాజం మహిళలకు భద్రత చేకూర్చలేదు.

దళిత, ఆదివాసీ స్త్రీలు అగ్రకుల పురుషుల చేతులలో లైంగిక హింసకు గురి అవుతారు. మధ్య తరగతి ప్రజలు అటువంటి హింసను చూసీచూడనట్టు వదిలేస్తారు. ఇప్పటి నిరసనలో పాల్గొన్న ఒక మహిళ పోలీసులను నిలదీస్తూ ఇలా అన్నది: "ప్రియాంక ఒక చదువుకున్న అమ్మాయి. ఆమె ఒక గౌరవమైన కుటుంబానికి చెందింది. ఆమె లంబాడా తండా నుంచి వచ్చిన అమ్మాయి కాదు, ఇలా జరిగితే ఊరుకోవటానికి". ఈ మాటలు వింటూంటే స్త్రీలకు, వారి శరీరాలకు విలువను నిర్ణయించే అంశాలు కులం, వర్గం, మతమేనని అర్థం కావడం లేదా? స్త్రీ అస్తిత్వానికి ఇంకా గుర్తింపు గౌరవం లేదు. ప్రియాంక రెడ్డి స్థానంలో ఒక పేద ఆదివాసీ మహిళ ఉన్నప్పుడు స్పందించని ఈ సమాజం ఎన్నటికీ మహిళలకు భద్రతను ఇవ్వలేదు.

ఈరోజు బహిరంగ ఉరిశిక్షలు కావాలని కోరే వారి మనస్తత్వం ఏంటి? వీరు ప్రత్యూష, ఆయేషా వంటి వారిని దారుణంగా మానభంగం చేసి చంపిన వారిపై ఇలాంటి ఆగ్రహం చూపించారా? లేదు. ఎందుకంటే.. దాని వెనుక అగ్రకుల, రాజకీయ నాయకుల హస్తాలున్నాయి. ఆ మహిళలు సినీ రంగానికి చెందిన వారు కాబట్టి, వారి లైంగిక జీవితాన్ని వీరు అనుమానిస్తారు కాబట్టి, వారిపై దాడులను వీరు సమర్థిస్తారు. ఇప్పుడు ముద్దాయిలను దారుణంగా కాల్చి చంపమని అడుగుతున్న హింసాత్మక సమాజంలో స్త్రీలు అసలు మనగలరా? ప్రజలలోను, సమాజంలోను మార్పు కూడా రాకుండా, ముద్దాయిలను నేర నిరూపణ చెయ్యకుండా శిక్షిస్తే అది ప్రజాస్వామ్యంపై అత్యాచారం తప్ప మహిళలకు ఒరిగేది ఏమీ ఉండదు. కుల రహిత, పితృస్వామ్య రహిత సమాజం ఏర్పడే వరకు స్త్రీలు స్వేచ్ఛగా స్వతంత్రంగా మనగలరు అనుకోవటం పొరపాటు.

■ సౌజన్య తమలపాకుల
అసిస్టెంట్ ప్రొఫెసర్, టిస్స్, హైదరాబాదు

# భావి పరిణామాలకు సూచిక మహారాష్ట్ర

ఇండియాగేట్



■ ఎ. కృష్ణారావు

మహారాష్ట్రలో అయిదు రోజుల క్రితం శివసేన–ఎన్సీపీ–కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఒక పెద్ద రాష్ట్రం భారతీయ జనతా పార్టీ చేతుల్లోంచి జారిపోయిన అత్యంత కీలక పరిణామంపై పార్లమెంట్ సెంట్రల్ హాలులో రాజకీయ నాయకుల మధ్య రసవత్తర చర్చలు జరుగుతున్నాయి. నిజానికి ఎన్సీపీ నేత అజిత్ పవార్‌ను తమ వైపు ఆకర్షించి, అర్ధరాత్రి గవర్నర్, రాష్ట్రపతుల ద్వారా పావులు కదిపి, రాష్ట్రపతి పాలన ఎత్తివేసి, తెల్లవారేసరికి బిజెపి ప్రభుత్వం ఏర్పాటయ్యేసరికి దేశం యావత్తూ నివ్వెరపోయింది. పలువురు రాజకీయ పరిశీలకులు దీన్ని అమిత్ షా చాణక్యంగా అభివర్ణించారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌లను అభినందిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బిజెపి జాతీయ అధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇద్దరూ ప్రకటనలు జారీ చేశారు. మోదీ, అమిత్ షాలు పూనుకోకపోతే రాత్రికి రాత్రి గవర్నర్, రాష్ట్రపతి ఇద్దరూ దేవేంద్ర ఫడణవీస్ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అతి వేగంగా చర్యలు తీసుకునే వారు కాదు. 1975లో ఎమర్జెన్సీ విధించిన సమయంలో తప్ప ఇలా అర్ధరాత్రి రాజ్యాంగాధినేతలు నిద్రను త్యాగం చేసి ఒక ప్రభుత్వ ఏర్పాటుకు చర్యలు తీసుకున్న ఘట్టాలు దాదాపు లేవనే చెప్పాలి. శివసేన–ఎన్సీపీ–కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయకుండా అడ్డుకుని తమ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకే మోదీ, అమిత్ షాలు వ్యూహరచన చేసి ఉంటారన్న విషయం స్పష్టమవుతోంది. కానీ వ్రతం చెడ్డా ఫలం దక్కలేదన్నట్లు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రమణ బెంచ్ ఇచ్చిన తీర్పుతో పరిస్థితి మారిపోయింది. ఆ తీర్పు వచ్చిన వెంటనే అజిత్ పవార్ తన పదవికి రాజీనామా చేయడంతో ఆయన వెంట ఎన్సీపీ ఎమ్మెల్యేలు లేరన్న విషయం బిజెపికి తెలిసిపోయింది. దీనితో ఫడణవీస్ కూడా రాజీనామా చేయక తప్పలేదు. తమకు మెజారిటీ లేదు కనుక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేమని కొద్దిరోజుల క్రితమే గవర్నర్‌కు చెప్పిన బిజెపి అంతలోనే అధికారం దక్కించుకోవడానికి ఎందుకు తహతహ ప్రదర్శించింది? ముందూ వెనుకా ఆలోచించకుండా అజిత్ పవార్‌ను నమ్ముకుని అనూహ్యంగా ప్రభుత్వాన్ని ఎందుకు ఏర్పాటు చేసింది? అధికారం దక్కించుకోవాలన్న ఆతురత దేవేంద్ర ఫడణవీస్‌కు ఉంటే ఉండవచ్చు కాని కేంద్రంలో ఆ ఇద్దరు పెద్దలు కూడా ఎందుకు తొందరపడ్డారు? అజిత్ పవార్ వెంట ఎన్సీపీ ఎమ్మెల్యేలు ఉన్నారా లేదా అని ఎందుకు ధ్రువపరుచుకోలేదు? అజిత్ పవార్ స్వయంగా వచ్చారా లేదా ఎవరైనా ప్రయోగించారా లేదా అని కూడా ఎందుకు అనుమానించలేదు? ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఒకటి రెండు రోజులు ఎక్కువ సమయం తీసుకుంటే మాత్రం కొంపమునిగేదేముంది? కాని అధికారం మత్తులో ఉన్నవారు, తమ వ్యూహరచనపై తమకు అమిత విశ్వాసం ఉన్నవారు, అవతలి శక్తులను తక్కువ అంచనా వేసే వారు అన్ని సమయాల్లోనూ విజయాన్ని సాధించలేరనే విషయం ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది. నిజానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా మహారాష్ట్రలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రయత్నించారన్న విషయం ఎన్సిపి నేత శరద్ పవార్ తాజాగా ఒక మరాఠీ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ ద్వారా స్పష్టమైంది. మహారాష్ట్ర పరిణామాలు జరుగుతున్న సమయంలో పార్లమెంట్‌లోనే నరేంద్ర మోదీ, శరద్ పవార్‌ల మధ్య భేటీ జరిగింది. ఈ భేటీలో జరిగిన చర్చ గురించి అప్పుడు శరద్ పవార్ వెల్లడించలేదు కాని ఉద్ధవ్ ఠాకరే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిదానంగా వెల్లడించారు. తమతో చేతులు కలపమని ప్రధాని కోరారని, తన కూతురు సుప్రియా సూలేకు కేంద్రంలో మంత్రిపదవి ఇవ్వజూపారని పవార్ వెల్లడించారు. ఈ భేటీకి ముందు రాజ్యసభ 250వ సమావేశాల సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగిస్తూ పార్లమెంటరీ సంప్రదాయాల గురించి శరద్ పవార్ నుంచి నేర్చుకోవాలని మిగతా సభ్యులకు హితబోధ కూడా చేశారు. ప్రధాని తనను ప్రశంసించినా, తనను ప్రత్యేకంగా భేటీకి పిలిచి స్నేహహస్తం చాచినా శరద్ పవార్ లొంగలేదు. అయినప్పటికీ బిజెపి అగ్రనేతలు ఊరుకోకుండా అజిత్ పవార్‌కు గాలం విసిరారు. ఆ వ్యూహం కూడా చివరకు బెడిసి కొట్టింది.

భారతీయ జనతా పార్టీ తొందరపాటు పుణ్యమా అని మహారాష్ట్రలో బిజెపికి అధిక సీట్లు ఉన్నప్పటికీ, మిగతా పార్టీలు చేతులు కలిపి ఏర్పాటు చేసిన ప్రభుత్వం కొంతకాలమైనా స్థిరంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే ఇప్పుడిప్పుడే చేతులు కాల్చుకున్న బిజెపి అగ్రనేతలు వెంటనే ఈ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నాలు చేసేందుకు సాహసించకపోవచ్చు. మొత్తం ఉదంతంలో మరాఠా అగ్రనేత శరద్ పవార్ చక్రం తిప్పినందువల్ల ఎన్సీపీ–శివసేన స్నేహానికి ఇప్పట్లో ఢోకా లేకపోవచ్చు. తమ ఎమ్మెల్యేలను ఎలా కాపాడుకోగలమా అని సతమతమవుతున్న తరుణంలో అనుకోకుండా అధికారం పంచుకునే అవకాశం వచ్చిన కాంగ్రెస్‌కు కూడా ఈ కూటమినుంచి తప్పుకునే అవకాశాలు లేవు. భారతీయ జనతా పార్టీ నుంచి ముంచుకొస్తున్న ప్రమాదమే ఈ వైరుధ్య శక్తుల్ని ఏకం కావడానికి దోహదం చేసింది. పైగా




**అమిత్ షా వ్యూహం మహారాష్ట్ర విషయంలో ఎందుకు బెడిసికొట్టింది? బిజెపి అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తూనే హోంమంత్రి పదవి చేపట్టిన తర్వాత అమిత్ షాకు దేశ రాజకీయ పరిణామాలపై దృష్టి మళ్లించేందుకు సమయం లేకపోయిందా? మహారాష్ట్ర, హర్యానా ఫలితాలతో పాటు అనేక రాష్ట్రాల్లో ఉపఎన్నికల ఫలితాల్లో బిజెపి దెబ్బతినడం ఈ అనుమానాలకు దారితీస్తున్నది. ప్రజాస్వామ్యంలో ఒకరో ఇద్దరో అన్ని నిర్ణయాలు తీసుకుంటే, టీమ్ వర్క్ అనేది లేకపోతే ఫలితాలు ఎప్పుడూ సానుకూలంగా ఉండవనడానికి ఈ పరిణామాలు ఉదాహరణ.**

మహారాష్ట్ర లాంటి బలమైన ఆర్థిక వనరులున్న రాష్ట్రంలో తమకు లభించే ప్రయోజనాలను వదులుకుని ఎక్కిన కొమ్మను నరుక్కునే అవివేకమైన పనిని శివసేన–ఎన్సీపీ–కాంగ్రెస్ కూటమి చేసే అవకాశాలు తక్కువ. కనుక ఈ కూటమి సర్కార్‌కు ఇప్పట్లో ప్రమాదం ఉండకపోవచ్చు. అయినా, కర్ణాటకలో జరిగినట్లు తగిన అదనుకోసం బిజెపి అగ్రనేతలు ఎప్పుడూ వేచి చూస్తూ ఉంటారు. మొదటి సారి యడ్యూరప్ప ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు విఫలమైనప్పటికీ రెండవసారి వేరే వ్యూహం పన్ని 17 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి కుమార స్వామి ప్రభుత్వాన్ని పడగొట్టి బిజెపి రెండవ సారి అధికారంలోకి రాగలిగింది. అది మహారాష్ట్రలో జరుగుతుందా లేదా చెప్పలేము.

మహారాష్ట్ర పరిణామాలు కేవలం ఆ రాష్ట్రానికి మాత్రమే పరిమితం అయ్యే అవకాశాలు లేవు. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అగ్రనేతలు వేస్తున్న ఎత్తుగడలకు భయకంపితులైన పలు ప్రాంతీయ పార్టీలకు ఈ పరిణామాలు కొంత ధైర్యాన్నిచ్చాయనడంలో అతిశయోక్తి లేదు. ఇవాళ కనీసం 10 రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. తాజాగా హర్యానాలో ఒక ప్రాంతీయ పార్టీతో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేయవలిసి వచ్చింది. పార్లమెంట్ ఉభయ సభల్లో కూడా కాంగ్రెస్ కంటే ప్రాంతీయపార్టీలకే సంఖ్యాబలం ఎక్కువ. ఎటొచ్చీ కొన్ని ప్రాంతీయ పార్టీల బలహీనతలతో ఆడుకుంటున్నప్పటికీ బిజెపిని కాంగ్రెస్ కంటే ప్రాంతీయ పార్టీలే ఎంతో కొంత బలంగా ఢీకొనగలుగుతున్నాయి.

అంతే కాదు, బిజెపికి సంబంధించి మహారాష్ట్ర అత్యంత కీలకమైన రాష్ట్రం. అంబానీ లాంటి బలమైన వ్యాపారుల అడ్డా అది. మహారాష్ట్రలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అక్కడ అన్ని వ్యవహారాల్లో, లావాదేవీల్లో గుజరాత్ ప్రాబల్యం పెరిగిపోయింది. పెద్ద పెద్ద కాంట్రాక్టుల నుంచి చిన్న చిన్న కాంట్రాక్టుల వరకూ అధిక భాగం గుజరాతీలే దక్కించుకుంటున్నారని అంటున్నారు. ఇది మరాఠా అస్తిత్వానికి సంబంధించిన అంశంగా మారింది. ఇప్పుడు శివసేన అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టులన్నింటినీ సమీక్షించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అత్యంత ఇష్టమైన ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ రైల్ ప్రాజెక్టుతో పాటు పలు ప్రాజెక్టులను సమీక్షిస్తామని ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాకరే ప్రకటించారు. గుజరాత్ ప్రాబల్యాన్ని తగ్గించి మరాఠా అస్తిత్వాన్ని కాపాడడమే కాదు, దేవేంద్ర ఫడణవీస్ హయాంలో అక్రమ లావాదేవీలను కూడా కొత్త ప్రభుత్వం త్రవ్వి తీసే అవకాశాలున్నాయి. ఇది ఇంతటితో ఆగేలా కూడా లేదు, గుజరాత్‌లో అమిత్ షాపై ఆరోపణలు వచ్చిన ఒక ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న ముంబై సిబిఐ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బ్రిజ్ గోపాల్ హరికిషన్ లోయా అనుమానాస్పద మృతిని పునర్ విచారించాల్సిన అవసరం ఉన్నదని శరద్ పవార్ తాజా ఇంటర్వ్యూలో చెప్పడం గమనార్హం. ఇలాంటి తీవ్ర పరిణామాలెన్నో జరిగేందుకు మహారాష్ట్రలో మార్పులు దారితీస్తే దేశ రాజకీయాలు మరోసారి వేడెక్కేందుకు అవకాశం ఉన్నది.

ఇంతకీ అభినవ చాణక్యుడనిపించుకున్న అమిత్ షా వ్యూహం మహారాష్ట్ర విషయంలో ఎందుకు బెడిసికొట్టింది? బిజెపి జాతీయ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తూనే హోంమంత్రి పదవి చేపట్టిన తర్వాత అమిత్ షాకు దేశ రాజకీయ పరిణామాలపై దృష్టి మళ్లించేందుకు సమయం లేకపోయిందా? మహారాష్ట్ర, హర్యానా ఫలితాలతో పాటు అనేక రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల ఫలితాల్లో బిజెపి దెబ్బతినడం ఈ అనుమానాలకు దారితీస్తున్నది. ప్రజాస్వామ్యంలో ఒకరో ఇద్దరో అన్ని నిర్ణయాలు తీసుకుంటే, మిగతా వారు నిమిత్త మాత్రులుగా మిగిలిపోతే, టీమ్ వర్క్ అనేది లేకపోతే ఫలితాలు ఎప్పుడూ సానుకూలంగా ఉండవనడానికి ఈ పరిణామాలు ఉదాహరణ.

విచిత్రమేమంటే భారత దేశం ప్రజాస్వామ్య దేశం అని మనం అనుకుంటున్నప్పటికీ కొన్ని పార్టీలు ఒక సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకరో ఇద్దరో నిర్ణయాధికారాలను తమ చేతుల్లోనే ఉంచుకుని, అధికార వికేంద్రీకరణనూ, టీమ్ వర్క్‌నూ పక్కన పెట్టడం జరుగుతోంది. కేంద్ర మంత్రులు, అధికారులు ప్రధానమంత్రి కార్యాలయం వైపు చూస్తే రాష్ట్ర మంత్రులూ, అధికారులూ ముఖ్యమంత్రి కార్యాలయం వైపు చూడడం అలవాటైపోయింది. అందువల్ల ఒక విపత్కర పరిణామం జరిగినప్పుడు తక్షణ నిర్ణయాలు తీసుకోవడం సాధ్యపడడం లేదు. ఒకరిద్దరు వ్యక్తులకే నిర్ణయాధికారం ఉండడం వల్ల మిగతా వారిలో ఉదాసీనత, అలసత్వం ఏర్పడడం సహజం. తద్వారా వ్యవస్థలు కూడా మందకొడిగా లేదా నిర్వీర్యంగా మారిపోయే అవకాశాలు కనిపిస్తాయి. ప్రతి సారీ అగ్రనేతలే నిర్ణయాలు తీసుకుంటే, మిగతావారిని భజన బృందాలుగా మారిస్తే అన్ని సార్లూ అద్భుతమైన ఫలితాలు రాకపోవచ్చు. ఏదో ఒక సమయంలో అవి బెడిసికొట్టే అవకాశం ఉంటుంది. తామే నిర్ణయాలు తీసుకోవడం, మిగతావారిని నిమిత్త మాత్రులుగా మార్చడం అనేది ఒక రకంగా అభద్రతా భావం అని చెప్పవచ్చు. అందువల్ల పై స్థాయిలో అధికార వికేంద్రీకరణ అమలుపరిచి, తమకు మాత్రమే అద్భుతమైన తెలివితేటలున్నాయని భావించకుండా బలమైన టీమ్‌ను ఏర్పర్చుకుని నిర్ణయాలను కలిసికట్టుగా తీసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆరోగ్యకరమైన సంప్రదాయం.

అయినప్పటికీ ప్రజాస్వామ్యం పేరుతో భారత దేశంలో అమలు అవుతున్న రాజకీయ పరిణామాలను వాస్తవ దృక్పథంతో అర్థం చేసుకోకుండా ప్రతి దాన్నీ వ్యతిరేక దృష్టితో విమర్శించాలనుకోవడం, దానికి సిద్ధాంతం పులుముకోవడం అనేది ఒక మేధో విష వలయంగా మారిపోయింది. ఆర్థిక సంస్కరణలు దేశంలో ప్రవేశించిన తర్వాత పాత కళ్లద్దాలతో కొత్త పరిణామాలను విశ్లేషించడం, విమర్శించడం పాత ఉద్యమ రూపాలను ప్రయోగించి అవి విఫలమయ్యాయని బాధపడడం, రాజకీయ నేతల అవసరార్థ తెలివితేటల ముందు పరాజితులై చింతించడం కన్నా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాధినేతల నిర్ణయాలను మంచి చెడ్డల ఆధారంగా బేరీజు వేయడం, ప్రజలను చైతన్యపరచడం మంచిది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

# ఆంగ్ల మాధ్యమంతో నష్టం పేదలకే!

ఇంగ్లీష్ మాధ్యమాన్ని సమర్థించేవారు దానిని వ్యతిరేకించేవారిని అడుగుతున్న ముఖ్యమైన ప్రశ్నలు కొన్ని ఉన్నాయి: "మరి మీ పిల్లలు ఏ మాధ్యమంలో చదువుతున్నారు? ఇంగ్లీష్ మాధ్యమం చదువుకునే అవకాశం ధనవంతులకేనా? కొన్ని కులాల వారికేనా?" ఇలాంటివి. సాక్షాత్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, విద్యాశాఖ మంత్రి కూడా ఈ ప్రశ్నలు అడిగారు. ఈ ప్రశ్నలకి ఆధారం, తెలుగు మాధ్యమం కన్నా ఇంగ్లీష్ మాధ్యమం గొప్పది అనే నమ్మకం. అయితే అన్ని పరిశోధనలూ విద్యాబోధనకి మాతృభాషని ఉపయోగించటమే మెరుగైనది అని తేల్చి చెప్తున్నాయి. యునెస్కో, యూనిసెఫ్ వంటి సంస్థల పరిశోధనలలో కూడా ఈ విషయం ఋజువయ్యింది. అందువల్లనే జాంబియా, టాంజానియా, ఘనా వంటి ఎన్నో నిరుపేద ఆఫ్రికా దేశాలు ఇంగ్లీష్, ఫ్రెంచ్ వంటి విదేశీ భాషలని వదిలి తమ దేశాలలో మాతృభాషని విద్యాబోధనకి ఉపయోగించడం ప్రారంభించాయి. ఇంగ్లీష్ మాధ్యమం కన్నా తెలుగు మాధ్యమం మెరుగైనది అని అర్థం అయితే, ఇంగ్లీష్ మాధ్యమ వ్యతిరేకుల్ని "మరి మీ పిల్లలు చదివేది ఏ మాధ్యమంలో?" అని ఎవరూ ఎదురు ప్రశ్నించరు. అప్పటికీ అడిగితే అది "ఏం మీ పిల్లలు మాత్రమే నాశనం అవ్వాలా, మా పిల్లలు అవ్వకూడదా?" అని అడిగినట్టు ఉంటుంది.

ప్రభుత్వ, ప్రైవేట్ బడుల మధ్య ఎన్నో తేడాలు ఉన్నాయి. వాటిలో మాధ్యమం కూడా ఒకటి. దాదాపు ప్రైవేట్ బడులన్నీ ఇంగ్లీష్ మాధ్యమాన్ని ఉపయోగిస్తుంటే, ప్రభుత్వ బడులు తెలుగును ఉపయోగిస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పుడు ప్రభుత్వ బడులలో కూడా ఇంగ్లీష్ మాధ్యమాన్ని ప్రవేశపెట్టి, ప్రభుత్వ – ప్రైవేట్ బడుల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గిస్తాము అంటోంది. ఉద్దేశం మంచిదే, ఎంచుకున్న మార్గమే సరైనది కాదు.

ఈ నిర్ణయం ఎటువంటిదో ఒక ఉదాహరణ ద్వారా వివరించడానికి ప్రయత్నిస్తాను. ఒక వ్యక్తికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. అందులో మొదటివాడు రెండో వాడి కన్నా దాదాపు అన్నిట్లో ఎంతో మెరుగైన వాడు. అయితే ఒక్క కంటిచూపు విషయంలో మాత్రం రెండో వాడు మెరుగైన వాడు. మొదటి వాడు కళ్ళద్దాలు వాడతాడు. రెండవ వాడి కంటి చూపు బ్రహ్మాండం. ప్రభుత్వం ప్రైవేట్ ప్రభుత్వ బడుల మధ్య అంతరాన్ని తగ్గించడానికి తెలుగు మాధ్యమాన్ని తొలగించి ఇంగ్లీష్ మాధ్యమం ప్రవేశపెట్టాలని ఆలోచించడం ఎలా ఉన్నదంటే ఆ పిల్లల తండ్రి ఇద్దరి పిల్లల మధ్య అంతరాన్ని తగ్గించడానికి, రెండో పిల్ల వాడి కంటిచూపు తగ్గించడానికి ప్రయత్నించడంలాగ. బోధనలో మాధ్యమంగా ప్రభుత్వ బడులు తెలుగును ఉపయోగించడం అనేది కనీసం ఆ విషయంలో ప్రభుత్వ బడులని, ప్రైవేట్ వాటి కన్నా మెరుగైన స్థితిలో ఉంచుతున్నాయి. ఇప్పుడు అది కాస్తా తీసేస్తే పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారవుతుంది.

ఖతార్ దేశం చేసిన ప్రయోగం నుండి మనం పాఠాలు నేర్చుకోవాలి. మాతృభాష కన్నా ఇంగ్లీష్ మాధ్యమం మెరుగైనది అనే భ్రమ ప్రపంచంలో ఎన్నో దేశాలలో ఉంది. ఖతార్ దేశం, ప్రపంచంలోనే అత్యంత ధనిక దేశాలలో ఒకటి. వారి తలసరి ఆదాయం దాదాపు రూ.90 లక్షలు. ఖతార్ వాళ్ళు కూడా 2002 నుండి 2012 వరకూ సైన్స్, లెక్కల వరకూ ఇంగ్లీష్ మాధ్యమాన్ని ప్రవేశపెట్టారు. ధనిక దేశం కనుక సహజంగానే వారు కల్పించే సదుపాయాలు కానీ, ఉపాధ్యాయుల స్థాయి కానీ అత్యుత్తమంగానే ఉంటాయి. అంత అత్యున్నత ప్రమాణాలతో విద్యని అందించినా అక్కడ ఇంగ్లీష్ మాధ్యమం వలన మెరుగైన ఫలితాలు లభించలేదు. విద్యా ప్రమాణాలు క్షీణించాయి. దాంతో 2013లో మళ్లీ మాతృభాషకి తిరిగివచ్చారు. కనుక ప్రైవేట్ బడులలో ఎటువంటి పరిస్థితులు ఉన్నాయో అటువంటి పరిస్థితులే ప్రభుత్వ బడులలో కూడా కల్పిస్తే, ప్రభుత్వ బడులలో మాధ్యమంగా తెలుగు ఉపయోగిస్తారు కనుక, నిస్సందేహంగా ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థుల ఫలితాలే బాగుంటాయి.

**మధ్య తరగతి, ధనిక వర్గాల పిల్లలకు, పట్టణాలలో పెరిగే పిల్లల తల్లిదండ్రులకు ఎంతో కొంత ఇంగ్లీష్ వచ్చి ఉంటుంది. వారి మాటలలో ఇంగ్లీష్ పదాలు, వాక్యాలు ఎక్కువ దొర్లుతుంటాయి. ఈ కారణం వలన ఈ వర్గాలకు చెందిన పిల్లలకు ఇంగ్లీష్‌తో పరిచయం ఎక్కువగా ఉంటుంది. పల్లెటూరి వాతావరణంలో పెరిగే పిల్లలకూ, పేద పిల్లలకూ ఇది వర్తించదు. అంటే, ఇంగ్లీష్ మాధ్యమం ద్వారా చదువు మొదలు పెట్టే సమయానికే పట్టణ–పల్లె, పేద–ధనిక వర్గాలకు చెందిన పిల్లల మధ్య వ్యత్యాసం ఉంటుంది. అది కాలక్రమేణా తగ్గుతుందనుకుంటే పొరపాటే. తగ్గదు సరికదా, ఇంకా పెరుగుతుంది. దీనినే మేత్యు (Matthew) ఎఫెక్ట్ అంటారు.**



అసలు ఈ అంశాన్ని భాష, సంస్కృతి వగైరా వంటి వాటి మీద ప్రేమ– అనే దృష్టితో చూడకపోవడమే మంచిది. పిల్లలకు చదువు బాగా అబ్బాలి అంటే మాధ్యమంగా ఏ భాష ఉంటే మంచిది– అనే ఒక్క కోణంలో మాత్రమే ఈ అంశాన్ని పరిశీలించడం మంచిది అని నా వ్యక్తిగత అభిప్రాయం. లేకపోతే ఈ విషయంపై జరిగే చర్చ అనవసరంగా దారి తప్పే అవకాశం ఉంది.

మాతృభాషలో విద్యాబోధన మంచిదే అయినా ఉద్యోగాల విషయానికి వచ్చేసరికి ఇంగ్లీష్ తప్పనిసరి అనే భావన ప్రజలలో బలంగా ఉంది. ప్రస్తుతం మన వ్యవస్థ కూడా అదే విధంగా ఉంది. అయితే ఆలోచనాపరులు కూడా ఇక్కడే చిన్న తప్పు చేస్తున్నారు. అవసరం ఇంగ్లీష్ భాషే కానీ, ఇంగ్లీష్ మాధ్యమం కాదు. ఇంగ్లీష్ భాష నేర్పడం వేరు, ఇంగ్లీష్‌ని మాధ్యమంగా చేయడం వేరు. ఇంగ్లీష్ భాష నేర్చుకోవాలి అంటే దానిని మాధ్యమంగా ఉపయోగించాల్సిన అవసరం లేదు. ఇంగ్లీష్ భాష అవసరం అనుకుంటే స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించవచ్చు. ఉదాహరణకి మొన్న మోదీకి, చైనా రాష్ట్రపతికి మధ్య జరిగిన సమావేశానికి సంబంధించిన వీడియోలు చూసిన వారికి, వారిద్దరూ అనువాదకుల సహాయంతో చర్చించుకున్నారనే విషయం అర్థమవుతుంది. మరి మోదీ గారి అనువాదకులు మాండరిన్ (చైనీస్) భాషలో చదువుకున్నారా? ఆ భాష నేర్చుకున్నారు అంతే. అంతేకాక మాతృభాష మీద పట్టు లేకపోతే ఇతర భాషలను నేర్చుకోవడం కూడా చాలా చాలా కష్టం. అనేక పరిశోధనలు ఈ విషయాన్నే తేల్చి చెప్పాయి.

ప్రపంచీకరణ నేపథ్యంలో ఇంగ్లీష్ భాష తప్పనిసరి అయిపోయింది అన్నది మరో భ్రమాజనితమైన వాదన. 2019 కెఒఎఫ్ గ్లోబలైజేషన్ ఇండెక్సులో భాగమైన మొదటి 25 దేశాలలో 24 దేశాలు మాతృభాషనే ఉపయోగిస్తున్నాయి. ఆ ఒక్క దేశం కూడా సింగపూర్. అది పేరుకు దేశమే అయినా, నిజానికి ఒక మహా నగరం. కనుక మనకి ఆదర్శం కాదు. ఈ 25 దేశాలలో కేవలం 5 దేశాలు మాత్రమే, ఇంగ్లీష్‌ని ఉపయోగిస్తున్నాయి. ఆ ఐదింటిలో, నాలుగు దేశాలకు ఇంగ్లీష్ మాతృభాష.

శాస్త్ర సాంకేతిక రంగాలలో పరిశోధనలకు ఇంగ్లీష్ మాధ్యమం అవసరం అన్నది మరో భ్రమ. పరిశోధనా పత్రాలు, పుస్తకాలు ఎక్కువగా ఇంగ్లీషులోనే లభిస్తున్నాయన్నది నిజమే అయినా, వాటి నుంచి లబ్ధి పొందటానికి, ముందే చెప్పినట్లు, దానికి ఇంగ్లీష్ మాధ్యమం అవసరం లేదు, ఇంగ్లీష్ భాష చాలు. అది కూడా అవసరం లేని స్థితిని ప్రభుత్వాలు ఆ పరిశోధనా పత్రాలని, పుస్తకాలనీ భారతీయ భాషలలోకి అనువదించడం ద్వారా కల్పించవచ్చు. 2013 నుండి 18 వరకూ గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్సులో 58 దేశాలు మొదటి 50 స్థానాలను సొంతం చేసుకున్నాయి. వాటిల్లో 55 మాతృభాషనే మాధ్యమంగా ఉపయోగిస్తున్నాయి. 2017 నుండి 19 వరకూ బ్లూమ్బెర్గ్ ఇన్నోవేషన్ ఇండెక్సులో 43 దేశాలు మొదటి 40 స్థానాలను సొంతం చేసుకున్నాయి. వాటిల్లో 40 మాతృభాషనే మాధ్యమంగా ఉపయోగిస్తున్నాయి.

తొంభై శాతానికి పైగా తల్లిదండ్రులు పిల్లలని ప్రభుత్వ పాఠశాలలకు పంపించకపోవడానికి అక్కడ ఇంగ్లీష్ మాధ్యమం లేకపోవడం ఒక ప్రధాన కారణం. మనదేశంలో మాత్రమే కాదు, మాజీ బ్రిటీష్ పాలిత దేశాలన్నింటిలోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది. అలానే ఫ్రాన్స్‌వారు పాలించిన దేశాలలో ప్రజలు ఫ్రెంచ్ మాధ్యమం కావాలని కోరుకుంటున్నారు. మాజీ వలస దేశాలలో ఇటువంటి మానసిక స్థితి అత్యంత సహజం. అందుకు కారణం వలస పాలకులు వెళ్లిపోయినా ఆ విధానాలను, వ్యవస్థలనూ అలానే కొనసాగించడమే తప్ప, ఆ భాషల వలన ఏవో ప్రత్యేక ప్రయోజనాలు ఉండటం కాదు. అంచెలంచెలుగా మద్యాన్ని పూర్తిగా నిషేధించాలి అని జగన్ గారు నిర్ణయం తీసుకున్నారు. మద్యం తాగే వారిని ఈ విషయం మీద మీ అభిప్రాయం చెప్పండి అని అడిగితే 90% మంది నిషేధం వద్దు అనే అంటారు. అంత మాత్రాన మద్య నిషేధం తప్పై పోతుందా? కనుక అన్ని నిర్ణయాలనూ ప్రజాభిప్రాయం మేరకు తీసుకోవడం సరైన పద్ధతి కాదు. కొన్ని నిర్ణయాలను నిపుణుల సూచనల మేరకే తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం కూడా అటువంటిదే.

కనుక ఏ రకంగా చూసినా మాధ్యమంగా తెలుగును ఉపయోగించడమే మంచిది. ప్రభుత్వం ప్రైవేటు బడులను కూడా తెలుగు మాధ్యమంలోకి ఎలా మార్చాలా, అని ఆలోచన చేయాలే తప్ప, ప్రభుత్వ బడులలో ఉన్న తెలుగు మాధ్యమాన్ని తొలగిస్తే దాని వలన పిల్లలు తీవ్రంగా నష్టపోతారు. నిజానికి ఇంగ్లీష్ మాధ్యమం వలన ఎక్కువగా నష్టపోయేది పేద పిల్లలు, పల్లెలలో పెరిగే పిల్లలే. మధ్య తరగతి, ధనిక వర్గాల పిల్లలకు, పట్టణాలలో పెరిగే పిల్లల తల్లిదండ్రులకు ఎంతో కొంత ఇంగ్లీష్ వచ్చి ఉంటుంది. అందువలన వారి మాటలలో ఇంగ్లీష్ పదాలు, వాక్యాలు ఎక్కువగా దొర్లుతుంటాయి. ఈ కారణం వలన ఈ వర్గాలకు చెందిన పిల్లలకు ఇంగ్లీష్‌తో పరిచయం కొంత ఎక్కువగా ఉంటుంది. ఇది పల్లెటూరి వాతావరణంలో పెరిగే పిల్లలకు, పేద పిల్లలకూ వర్తించదు. అంటే, ఇంగ్లీష్ మాధ్యమం వలన చదువు మొదలు పెట్టే సమయానికే పట్టణ–పల్లె, పేద–ధనిక వర్గాలకు చెందిన పిల్లల మధ్య వ్యత్యాసం ఉంటుంది. అది కాలక్రమేణా తగ్గుతుందనుకుంటే పొరపాటే. తగ్గదు సరికదా, ఇంకా పెరుగుతుంది. దీనినే మేత్యు (Matthew) ఎఫెక్ట్ అంటారు. ఈ విషయంపై జరిగిన పరిశోధనని బ్రిటీష్ కౌన్సిల్ వారు తమ "డ్రీమ్స్ అండ్ రియాలిటీస్" అనే పుస్తకంలో ప్రచురించారు. ఇది ఆన్‌లైన్‌లో దొరుకుతుంది, ఎవరైనా చదవవచ్చు. కనుక ప్రభుత్వం వారు ఏ వర్గాలనైతే ఇంగ్లీషు మాధ్యమం ద్వారా మెరుగుపరచాలి అని భావిస్తున్నారో, నిజానికి వారే అత్యధికంగా నష్టపోతారు.

■ రంజిత్ కుమార్
చరిత్ర పరిశోధకులు

బెటర్ లైఫ్

## నా ఐడియాలు పనికిరానివా?



నేనొక కాస్మొటిక్ కంపెనీలో పనిచేస్తున్నా. ఆ కంపెనీ ఉత్పత్తులకు సంబంధించి నాకు కొన్ని ఐడియాలు ఉన్నాయి. నిజానికి ఆ ఉత్పత్తులు మరింత నాణ్యతగా ఉండటానికి నా ఐడియాలు బాగా ఉపయోగపడతాయనేది నా నమ్మకం. కంపెనీకి నేను ఇప్పటిదాకా ఎన్నో ఐడియాలు చెప్పాను. కానీ, కంపెనీవారు పెద్దగా ఏమీ స్పందించలేదు. వాటిల్లో ఏ ఒక్క ఐడియానూ వారు స్వీకరించలేదు. పైగా నా ఐడియాలు విని హేళనగా మాట్లాడారు. దానికితోడు గత కొంతకాలంగా నేను తీవ్రమైన ఆత్మన్యూనతకు గురయ్యేలా మాట్లాడుతున్నారు. నా సమస్య ఏమిటంటే, మాది పేద కుటుంబం. కంపెనీ వదిలేసి వెళ్లి, నా ఐడియాలతో స్వతంత్రంగా ఒక కంపెనీని ప్రారంభించే పరిస్థితిలో లేను. నిజానికి నా ఐడియాలను కంపెనీవారు సరిగా ఉపయోగించుకుంటే అమ్మకాలు రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. ఇటీవల ఎన్నో స్టార్టప్‌ల గురించి తరచూ వింటున్నా... కానీ, నాకు ధైర్యం రావడం లేదు. ఈ పరిస్థితుల్లో ఉద్యోగ బాధ్యతల్ని మనస్ఫూర్తిగా నిర్వర్తించలేకపోతున్నా. మరోవైపు ఉద్యోగం వదిలేసి ఏదైనా చేయడానికి సాహసించలేకపోతున్నా. ఈ పరిణామాలు నన్ను తీవ్రమైన మానసిక సంఘర్షణకు గురిచేస్తున్నాయి. ఈ స్థితిలో నన్ను ఏం చేయమంటారో చెప్పండి.

**- కె.లావణ్య,** విశాఖపట్నం

మీ ఐడియాలను కంపెనీ వాళ్లు స్వీకరించనంత మాత్రాన అవి పూర్తిగా నిరుపయోగమైనవనీ, ఏ మాత్రం ప్రామాణికత లేనివనీ అనుకోవాల్సిన పనిలేదు. కాకపోతే ప్రతి కంపెనీకి వాటికవి నిర్దేశించుకున్న తమవైన కొన్ని ప్రమాణాలు ఉంటాయి. ఏ వర్గాన్ని, ఏ తరహా కొనుగోలుదారులను ఆకర్షించాలనే విషయంలో వారికొక టార్గెట్ ఉంటుంది. అందువల్ల దానికి భిన్నమైన ఇతర ఐడియాలు, భిన్న ప్రతిపాదనలు వస్తే తిరస్కరిస్తారు. అంతమాత్రాన మీ ఐడియాలు తక్కువ స్థాయిలో, తక్కువ ప్రమాణాలతో ఉన్నాయని అనుకోవడానికి వీల్లేదు. నిజానికి మన అనుభవంలోకి వచ్చిన విషయాలే బీజంగా, పుట్టుకొచ్చిన ఐడియాల్లో జీవం ఉంటుంది. వాటిలో సృజనాత్మకత ఉంటుంది. అందువల్ల మీరు మీ ఐడియాలను వదులుకోవాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు. ఈ ఒక్కసారికే అంతా అయిపోయిందని ఆ ఐడియాను బుట్టదాఖలు చేయాల్సిన పనిలేదు. ఆ మాటకొస్తే, ఆ తరహా ఐడియాలనే పెంచి పోషించాల్సిన అవసరం ఉంటుంది. ఈ కంపెనీ కాకపోతే మరో కంపెనీని సంప్రతించే నిరంతర క్రమంలో ఎవరో ఒకరు వాటిని అక్కున చేర్చుకునే అవకాశాలున్నాయి.

మీరు కొత్త స్టార్టప్‌లు ఎన్నో చూస్తున్నానన్నారు. అయితే మీకు మీరుగా ప్రారంభించడానికి ధైర్యం రాకపోవడానికి కారణం... ఆ స్టార్టప్‌లు నూటికి నూరుశాతం విజయవంతంకాకపోవడం కావచ్చు. యువతీ యువకులే ఎక్కువగా ప్రారంభిస్తున్న ఈ స్టార్టప్‌ల్లో సగానికి సగం ఫెయిల్ అవడానికి, మార్కెటింగ్ సమస్యలతో పాటు టార్గెట్‌ల విషయంలో వారి అంచనాలు తారుమారు కావడం కూడా ఒక కారణమే! అందువల్ల మీ ఐడియాలు, మీ కంపెనీ అంచనాలను గుర్తించి, స్వీకరించకపోవడం మీ ఫెయిల్యూర్ ఏమీ కాదు. ఏమైనా మీ ఐడియాలను మీ దగ్గరే భద్రపరుచుకోండి. వాటితో ఎప్పటికైనా ఒక స్టార్టప్‌ను ప్రారంభించి విజేతగా నిలిచే అవకాశాలు తప్పకుండా ఉంటాయి. అప్పటిదాకా ఇదే ఉద్యోగంలో గానీ, మరో ఉద్యోగంలోగానీ కొనసాగండి. పూర్తిస్థాయి సానుకూల పరిస్థితులు ఏర్పడినప్పుడు మీ వెంచర్‌ను స్టార్ట్ చేయండి. ఇప్పుడు మీ ఐడియాలను తిరస్కరించిన వారే రేపు మిమ్మల్ని మెచ్చుకుంటారు. దాంతో మీ ఆశయం పూర్తి స్థాయిలో వాస్తవ రూపం దాల్చుతుంది. బెస్టాఫ్‌లక్.

• **డాక్టర్ ప్రవీణ్‌కుమార్ చింతపంటి**, కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, హైదరాబాద్

## చలికాలం శిరోజాల కోసం..

బ్యూటీ



చలికాలం వాతావరణంలో తేమ ఎక్కువగా ఉంటుంది. అందుకే ఈ సీజన్‌లో శిరోజాల విషయంలో తప్పనిసరిగా తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తల గురించి ప్రసిద్ధ సౌందర్య నిపుణురాలు షెహనాజ్ హుస్సేన్ చెబుతున్న చిట్కాలివి...

- కొబ్బరినూనె లేదా బాదంనూనెను శిరోజాలకు బాగా పట్టించాలి. ఇలా చేయడం వల్ల వెంట్రుకలు మృదువుగా, పట్టులా ఉంటాయి.
- నూనెతో మాడును సున్నితంగా మర్దనా చేయాలి. వెంట్రుకల కుదుళ్ల నుంచి వలయాకారంలో చేతివేళ్లతో మసాజ్ చేయాలి.
- తలస్నానం చేసిన తర్వాత చాలామంది టవల్‌తో వెంట్రుకలను గట్టిగా తుడుచుకుంటుంటారు. అలా చేయొద్దు. తలకు తువ్వాలు చుట్టుకుని కాసేపు అలాగే ఉంచుకుంటే వెంట్రుల్లో ఇంకిన నీరును టవల్ పీల్చేస్తుంది.
- వెంట్రుకలు చిట్లినా, పొడిబారినట్టు అనిపించినా ఐరనింగ్ చేయొద్దు. తడి వెంట్రులపై హెయిర్ డ్రయ్యర్‌ను ఉపయోగించొద్దు. తడి వెంట్రుకలు సహజంగా ఆరబెట్టుకోవాలి.
- మాడు పొడిబారడం వల్ల ఈ కాలంలో చుండ్రు సమస్య ఉంటుంది. చుండ్రు పోవడానికి హాట్ ఆయిల్ థెరపీ ట్రై చేయండి.
- వారంలో ఒకటి లేదా రెండుసార్లు వేడిచేసిన కొబ్బరి నూనెను శిరోజాలకు, మాడుకు రాసుకోవాలి. తర్వాత వేడి నీళ్లల్లో ముంచి బాగా పిండేసిన టవల్‌ను తలకు టర్బన్‌లాగ చుట్టుకోవాలి. ఐదు నిమిషాల తర్వాత టవల్ తీసేయాలి. ఇలా నాలుగైదు సార్లు చేయాలి.

ఆదర్శం



# ఆ ప్రశాంతత మరెక్కడా లేదు..!

**మహిళ కష్టం మహిళలకే తెలుస్తుంది... అందుకే, విద్యార్థినిగా తనకు ఎదురైన కష్టం మరే ఆడపిల్లకూ రాకూడదనుకున్నారు... విద్యార్థినుల కోసం పదహారువేల టాయిలెట్లను కట్టించారు సుధామూర్తి... ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్‌గా, రచయిత్రిగా సుధామూర్తి పేరు ప్రసిద్ధం. అయితే అన్నిటికన్నా సమాజం గుర్తుంచుకొనేది ఆమె దాతృత్వాన్నే. ఆ దాతృత్వానికే ఇటీవల 'కౌన్ బనేగా కరోడ్‌పతి'షోలో అమితాబ్ బచ్చన్ సలామ్ కొట్టారు... వయసులో తనకన్నా ఎనిమిదేళ్ళు చిన్నవారైన సుధామూర్తికి పాదాభివందనం చేశారు. ఆమెలో సేవా బీజాలు ఎలా పడ్డాయి, ఆమె ఆదర్శమేమిటో సుధామూర్తి మాటల్లోనే...**



అమితాబ్ బచ్చన్‌తో...

"నా చిన్నప్పుడు మా నాన్న నాకొక కథ చెప్పారు. ఒక వృద్ధుడు రోజూ ఒక మామిడి మొక్క నాటుతూ ఉంటాడు... అవి పెద్దవై, కాయలు కాసి, పండ్లు అయ్యే వరకూ తాను బతికి ఉండనని తెలిసినప్పటికీ.! ఈ కథ విన్న తరువాత మా నాన్నను నేనో ప్రశ్న అడిగాను- 'ఆ వృద్ధుడు రోజూ ఒక మొక్క నాటడంలో గొప్పేముంద'ని. "అది అతను తనకోసం చేసుకున్నది కాదు, ఇతరుల కోసం చేసింది. అందుకే అది గొప్ప పని" అని అన్నారు. మామిడి చెట్టు తన పళ్ళను తినదు, ఆవు దాని పాలను తాగదు. ఇది అర్థమైన తరువాత నా ఆలోచనా విధానం, నా జీవితం మారిపోయింది. చాలా మందికి ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఒక ఛారిటబుల్ ట్రస్ట్. ఒక సంపన్నమైన కంపెనీకి అనుబంధ సంస్థ. నాకు మాత్రం అది నా గుండెకు చాలా దగ్గరైన సంస్థ. దానికి నేను తల్లిని. అది ప్రారంభించినప్పటి నుంచీ నేను దానితోనే ఉన్నాను. దాన్ని నా చేతుల్లో దాచుకొని చాలా దూరం ప్రయాణం చేశాను, ఈ దారిలో నాకు ప్రశంసలు దొరికాయి, విమర్శలు ఎదురయ్యాయి. వాటన్నిటికీ అతీతంగా నడుస్తున్నాను.

### ఆ విలువ అర్థమయింది!

మా నాన్న ప్రొఫెసర్. వైద్యుడు కూడా! మా అమ్మ తన పెళ్ళికి ముందు టీచర్‌గా పని చేశారు. నాకు ఇంజనీరింగ్ అంటే ఇష్టం. సైన్స్ పాఠ్యాంశంగా తీసుకుంటే అది చదవవచ్చని అనుకున్నాను. అయితే మా ఇంట్లో వాళ్ళ ఆలోచనలు వేరేగా ఉండేవి. ఆ రోజుల్లో ఒక అమ్మాయి ఇంజనీరింగ్‌లో చేరడం ఊహించరాని విషయం. అది అబ్బాయిలు చదివే చదువని వాళ్ల నమ్మకం. చివరికి మావాళ్ళను ఒప్పించగలిగాను. నా సమస్య అక్కడితో తీరిపోలేదు. హుబ్లీలో కాలేజీలో ఇంజనీరింగ్‌లో చేరడానికి దరఖాస్తు చేశాను. అక్కడ 600 సీట్లు ఉన్నాయి. 599 మంది అబ్బాయిలు. నేనొక్కరే అమ్మాయిని. పైగా మొదటి అమ్మాయిని కూడా! నా మార్కులు చూసి ప్రిన్సిపాల్ నాకు సీటిచ్చారు. అయితే కొన్ని షరతులు పెట్టారు. అవి: 'కోర్స్ పూర్తయ్యేవరకూ చీర కట్టుకొనే కాలేజీకి రావాలి. కాలేజీ క్యాంటిన్‌కు వెళ్ళకూడదు. కాలేజీలో ఏ అబ్బాయితోనూ మాట్లాడకూడదు.'

నిజం చెప్పాలంటే, చీర కట్టుకోవడం నాకు ఇబ్బంది కాదు. క్యాంటిన్ చెత్తగా ఉండేది కాబట్టి ఇబ్బందేం లేదు. మూడో షరతును నేను ఒక ఏడాది చాలా కఠినంగా పాటించాను. అయితే రిజల్ట్స్‌లో నేను మంచి ర్యాంక్ తెచ్చుకోవడంతో అబ్బాయిలే నాతో మాట్లాడడం మొదలుపెట్టారు. వీటన్నిటికన్నా నాకు బాగా సమస్య అయిన విషయం మా కాలేజీ మొత్తం మీద మహిళల కోసం ప్రత్యేకంగా టాయిలెట్ లేకపోవడం! ఈ మాట నేను ఇంట్లో చెబితే, కాలేజీ మానెయ్యమంటారు. ఎందుకంటే నేను ఇంజనీరింగ్‌లో చేరడం ఎవరికీ ఇష్టం లేదు. కాబట్టి నాకు నేను సర్దిచెప్పుకున్నాను. ఉదయం ఏడు గంటలకు కాలేజీ మొదలయ్యేది. రెండు కిలోమీటర్లు నడిచి అక్కడికి చేరుకొనేదాన్ని. పదకొండు గంటలకు తరగతులు పూర్తయిన తరువాత, మళ్లీ రెండు కిలోమీటర్లు వెనక్కి వచ్చాకే, టాయిలెట్‌కు వెళ్ళేదాన్ని. పరిశుభ్రంగా ఉండే వాష్‌రూమ్ విలువ నాకు అప్పుడు బాగా అర్థమైంది. ముఖ్యంగా టాయిలెట్ లేకపోతే మహిళలు పడే కష్టం ఒక మహిళగా నాకు తెలుసు. అందుకే ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ అయిన తరువాత వివిధ రాష్ట్రాల్లో 16 వేల టాయిలెట్లు కట్టించాను. అలాగే సమాజంలో అట్టడుగు వర్గాల పిల్లల కోసం అరవై వేల గ్రంథాలయాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, అనాథ శరణాలయాలు, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం నాకు ఎంతో ఆనందంగా అనిపిస్తోంది.

> ### ఆ మాట గర్వంగా చెప్పుకోవచ్చు!
>
> ఇటీవల 'కౌన్ బనేగా కరోడ్‌పతి' 11వ సీజన్ ఫైనల్ ఎపిసోడ్‌కు ముఖ్యఅతిథిగా సుధామూర్తి హాజరయ్యారు. వివిధ రంగాల్లో విజయాలు సాధించిన ప్రముఖులను కూడా ఈ ప్రోగ్రామ్‌కు ప్రత్యేకంగా ఆహ్వానించి, కర్మవీర్‌గా పరిచయం చేసి, వారి ద్వారా వీక్షకుల్లో స్ఫూర్తిని నింపుతూ ఉంటారు. "ఈ రోజు కర్మవీర్ సుధామూర్తిని కలుసుకున్నాం. ఆమె 60 వేల లైబ్రరీలు, 16 వేల టాయిలెట్లు కట్టించారు" అంటూ సుధామూర్తిని అమితాబ్ పరిచయం చేశారు. "మన దేశాన్ని అభివృద్ధి చేయడంలో అది మా బాధ్యత" అన్నారు సుధామూర్తి. ఆ మాటలకు కదిలిపోయిన అమితాబ్ "సుధామూర్తి నివసిస్తున్న దేశంలో నివసిస్తున్నామని మనం రొమ్ము విరుచుకొని గర్వంగా చెప్పుకోవచ్చు" అన్నారు. అంతేకాదు తనకన్నా వయసులో ఎనిమిదేళ్ళు చిన్నవారైన ఆమె పాదాలకు నమస్కరించారు.

### టాటా మాటలు మరచిపోలేను!

ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్‌లో అగ్రస్థానంలో నిలిచిన తరువాత బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఎం.ఇ.లో గోల్డ్ మెడల్ సాధించాను. అప్పుడే టాటా ఇంజనీరింగ్ అండ్ లోకో మోటివ్ కంపెనీ (టెల్కో) ఇచ్చిన ఉద్యోగ ప్రకటన నా



కంటపడింది. అయితే ఆ ప్రకటన చివర్లో, 'మహిళా అభ్యర్థులు దరఖాస్తు చెయ్యనవసరం లేదు' అని ఉంది. వెంటనే ఆ సంస్థ అధినేత జె.ఆర్.డి. టాటాకు "ఎప్పుడూ కాలం కన్నా ముందుండే టాటా లాంటి ఒక అగ్రశ్రేణి, ప్రగతిశీల సంస్థలో ఇలాంటి నియంత్రణ అవసరమా?" అని పోస్ట్ కార్డ్ రాశాను. తరువాత ఆ సంగతి మరిచిపోయాను. కొద్దిరోజుల్లోనే టెల్కో నుంచి నాకో టెలిగ్రామ్ వచ్చింది, ఇంటర్వ్యూకు రావాలనీ, రానూ పోనూ ఫస్ట్ క్లాస్ టిక్కెట్లు ఇస్తామనీ అందులో ఉంది. ఇంటర్వ్యూకి వెళ్ళాను. గ్రాడ్యుయేట్ ట్రైనీగా ఎంపికయ్యాను. టెల్కోలో మొట్టమొదటి మహిళా టెక్నికల్ ఆఫీసర్‌ని నేనే! నా లేఖ చదివిన తరువాత జె.ఆర్.డి.టాటా స్వయంగా జోక్యం చేసుకున్నారనీ, "ఆ అమ్మాయికి తన సబ్జెక్ట్‌లో మంచి పరిజ్ఞానం ఉంటే ఆమెను తప్పకుండా నియమించండి" అని ఇంటర్వ్యూ బోర్డును ఆదేశించారనీ నాకు తరువాత తెలిసింది.

ఎనిమిదేళ్ళు ఆ సంస్థలో ఉద్యోగం చేశాను. రాజీనామా చేసి, బయటికి వెళ్తూ ఉంటే జె.ఆర్.డి. టాటా ఎదురుపడ్డారు. నా రాజీనామా సంగతి చెప్పాను. "నువ్వు పోరాడి సంపాదించుకున్న ఉద్యోగం, ఎందుకు వదిలేస్తున్నావ్?" అని అడిగారు. నా భర్త ఇన్ఫోసిస్ సంస్థను ఏర్పాటు చేయాలనుకుంటున్నారనీ, అతనికి సహకారం అందించాలనుకుంటున్నాననీ చెప్పాను. అప్పుడు ఆయన "నువ్వు బాగా డబ్బు సంపాదిస్తే, దాన్ని సమాజానికి తప్పకుండా తిరిగి ఇవ్వు! ఎందుకంటే దాని వల్ల నువ్వు ఎంతో ప్రేమను తిరిగి పొందుతున్నావు" అన్నారు. ఆయనను చూడడం అదే చివరిసారి. కానీ ఆయన మాటలు నేనెప్పటికీ మరచిపోలేను.

> సమాజంలో అట్టడుగు వర్గాల పిల్లల కోసం 60 వేల గ్రంథాలయాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, అనాథ శరణాలయాలు, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం నాకు ఎంతో ఆనందంగా అనిపిస్తోంది.

### దానికి డబ్బుతో పని లేదు

సమాజానికి తిరిగి ఇవ్వడం ఎంతో ముఖ్యం. అది మనల్ని మరింత మానవీయంగా మారుస్తుంది. జీవితం మనకు మరింత బాగా అర్థమయ్యేలా చేస్తుంది. 'సమాజానికి ఇవ్వడం' అంటే తోటి మానవులను ప్రేమించడం! మీ దగ్గర పని చేస్తున్న వారితో దయగా ఉండండి. తోటి ఉద్యోగులకు పనిలో సాయపడండి. కొన్ని వీధి కుక్కల సంరక్షణ బాధ్యత తీసుకోండి. దగ్గర్లో ఉన్న బస్తీలో నలుగురు పిల్లలకు పాఠాలు చెప్పండి. వీటిలో దేనికీ మీ బ్యాంకు ఖాతాలో డబ్బు ఉండాల్సిన పని లేదు. నా జీవితంలో ఇరవై నాలుగేళ్ళు చదువుతో గడిచిపోయింది. ఇరవయ్యేళ్ళ పాటు నా భర్తకు చేదోడుగా ఉన్నాను. 1996లో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ స్థాపించి, సేవా కార్యక్రమాలు చేపట్టిన తరువాత ఎన్నడూ లేనంత ప్రశాంతతను అనుభవిస్తున్నాను. ఇంతకు మించిన ఆనందం నాకు మరెందులోనూ కనిపించడం లేదు."

న్యూస్‌మేకర్



## అతడి కళకు సలామ్!

**రెండు చేతులు లేవు. అయితేనేం... కాళ్లనే చేతులుగా మలుచుకున్నాడు. పెయింటింగ్ మీద ఆసక్తితో కాన్వాసుపై కాలితో కుంచె పట్టుకుని జీవం ఉట్టిపడే చిత్రాలు వేస్తాడు. ఎవరి సాయం గురించి ఆలోచించడు. పైగా ఇతరులకు సాయం చేసేందుకు ముందుంటాడు. ఇటీవల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కలిసి 'ముఖ్యమంత్రి సహాయ నిధి'కి రూ.5వేలు విరాళం ఇచ్చి తన పెద్ద మనసు చాటుకున్నాడు. తాజాగా సూపర్‌స్టార్ రజనీకాంత్ బొమ్మ గీసి దాన్ని ఆయనకు అందించి 'పాదచాలనం' చేశాడు. శిఖరమంతటి ఆత్మవిశ్వాసానికి నిలువుటద్దంలా కనిపించే ఆ కుర్రాడే ప్రణవ్ బాలసుబ్రమణ్యం. ఇటీవల వార్తల్లో నిలిచిన ఆ కుర్రాడి నేపథ్యమిది....**

ప్రణవ్ స్వగ్రామం పాలక్కడ్ జిల్లాలోని అల్థూర్. వడ్రంగి కుటుంబంలో రెండో సంతానంగా పుట్టిన ప్రణవ్‌కు రెండు చేతులు లేకపోవడం చూసి అమ్మానాన్న తల్లడిల్లిపోయారు. 'ఎన్ని కష్టాలు పడతాడో' అని ఆందోళన చెందారు. కానీ పెరిగి పెద్దయ్యే కొద్దీ ప్రణవ్ కాళ్లతోనే అన్ని పనులు చేసుకోవడం చూసి ఆశ్చర్యపోయారు. "ప్రణవ్‌ది చిన్నప్పటి నుంచి పోటీపడేతత్వం. తోటి పిల్లలు ఏది చేస్తే తను అది చేసేవాడు. అలా తాను ఎందులోనూ తోటి పిల్లలకు తక్కువ కాదని నిరూపించుకునేవాడు. ఒకరోజు మా పెద్దోడు బొమ్మలు వేయడం చూసిన ప్రణవ్ తను కూడా బొమ్మలు వేయాలనుకున్నాడు. మేము కూడా వాడి ప్రయత్నానికి సాయంగా నిలిచాం" అని చెబుతారు ప్రణవ్ నాన్న బాలసుబ్రమణ్యం.

> ### అభిమాన హీరోతో సెల్ఫీ...
>
> ఈ మధ్య ఒక తమిళ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'జీవితంలో ఒక్కసారైనా సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను కలవాలనుంది' అని చెప్పాడు ప్రణవ్. ఈ విషయం రజనీ చెవిన పడింది. దాంతో ఆయన ప్రణవ్‌ను చెన్నైలోని తన ఇంటికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తన అభిమాన నటుడికి తను పాదంతో వేసిన చిత్రాన్ని అందించాడు ప్రణవ్. రజనీతో సెల్ఫీ దిగి సంబరపడిపోయాడు.

ప్రణవ్ కాళ్ల సాయంతోనే టీ తాగడం, ఫోన్ లిఫ్ట్ చేసి మాట్లాడడం, దుస్తులు ఇస్త్రీ చేసుకోవడం, కంప్యూటర్ కీ బోర్డు మీద లెటర్స్ టైప్ చేయడం వంటి పనులన్నీ చేయడం అలవాటు చేసుకున్నాడు.

అంతేకాదు 2016లో జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకున్నాడు ప్రణవ్. కాలివేలితో ఈవీఎం మిషన్ మీద తన ఓటు వేశాడు. "ఓటు వేయడం మనందరి ప్రాథమిక హక్కు. దాన్ని అందరూ తప్పకుండా



రజనీకాంత్‌తో...

వినియోగించుకోవాలి" అని చెబుతూ దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకోవాలనే సందేశం కూడా ఇచ్చాడు.

### పెయింటింగ్స్ అమ్మి విరాళం....

కాలివేళ్ల మధ్య పెయింట్ బ్రష్ పట్టుకోవడం కోసం మొదట్లో చాలా కష్టపడ్డాడు ప్రణవ్. అదే పనిగా ప్రయత్నించి, క్రమంగా కుంచె పట్టుకోవడంలో పట్టు సాధించాడు. అప్పటి నుంచి అవలీలగా చిత్రాలు వేసేవాడు. ఆ చిత్రాలను అమ్మితే వచ్చిన డబ్బును సేవాకార్యక్రమాల కోసం విరాళంగా ఇచ్చేవాడు. గత ఏడాది కేరళలో వరదలు వచ్చినప్పుడు కుటుంబంతో కలిసి దివ్యాంగుల పిల్లల క్యాంప్స్ ఉన్న చోటుకు వెళ్లి వారికి ఆర్థిక సాయం అందించాడు.



కేరళ సీఎంతో...

ప్రణవ్ టాలెంట్‌ను గుర్తించి స్థానిక ఫ్లవర్స్ టీవీ ఛానల్ రియాలిటీ షోలో అతడికి అవకాశం ఇచ్చింది. ఆ షోలో ప్రణవ్ 5000రూపాయలు గెలుచుకున్నాడు. ఆ డబ్బును తన 21వ పుట్టిన రోజున కేరళ ముఖ్యమంత్రిని కలిసి సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళంగా ఇచ్చి తన పెద్ద మనసు చాటుకున్నాడు. కాలితో సెల్‌ఫోన్ పట్టుకొని సీఎంతో సెల్ఫీ కూడా దిగాడు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పినరయి ప్రణవ్ పాదాన్ని తన చేతితో పట్టుకొని అభినందించారు. "నేను నా 21వ పుట్టినరోజును ప్రత్యేకంగా జరుపుకోవాలనుకున్నా. మాది పేద కుంటుంబం కావడంతో ఇప్పటి వరకూ నా బర్త్‌డే సెలబ్రేట్ చేసుకోలేదు. కానీ ఈ రోజు ముఖ్యమంత్రి గారికి రూ.5000ల చెక్కును అందించినప్పుడు నాకు వెయ్యి కేకులు కోసిన అనుభూతి కలిగింది" అన్నాడు ప్రణవ్.






# ఏ డిగ్రీ అయినా ఓకే..

దేశంలోని అతిపెద్ద ఐటీ కంపెనీల్లో టీసీఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) అత్యంత ప్రతిష్ఠాత్మకమైంది. ప్రతిభావంతులను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందు ఉంటోంది. ఇందుకోసం ఎన్నో సృజనాత్మకమైన విధానాలను అనుసరిస్తోంది. ఐటీ కంపెనీలు సాధారణంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్, రిఫరెన్స్ ఇలా వివిధ పద్ధతుల ద్వారా ఉద్యోగులను నియమించుకుంటాయి. అయితే టీసీఎస్ వీటికి భిన్నంగా అత్యంత నైపుణ్యమున్న మానవవనరులను రిక్రూట్ చేసుకునేందుకు నూతన పద్ధతులను అవలంభిస్తోంది. టీసీఎస్ కోడ్‌వీటా, నింజా, డిజిటల్, హ్యూమ్ఐఎన్ ఇటువంటివే. అదే కోవలోనే ఆర్ట్స్, సైన్స్, కామర్స్ గ్రాడ్యుయేట్ల కోసం 'ఫ్యూచర్ ఫార్వార్డ్ కెరీర్స్ నేషనల్ క్వాలిఫయర్ టెస్ట్' అనే కాన్సెప్ట్‌కు రూపకల్పన చేసింది. డిగ్రీ విద్యార్థులకు ఇది చక్కని అవకాశం. దీనికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో వివరాలను తెలుసుకుందాం..

బెస్ట్ టాలెంట్‌ను ఎంపిక చేసుకోవాలనే ఉద్దేశంతో బిజినెస్ 4.0 వ్యూహంలో భాగంగా 'ఫ్యూచర్ ఫార్వార్డ్ కెరీర్స్ నేషనల్ క్వాలిఫయర్ టెస్ట్' అనే విధానానికి టీసీఎస్ అంకుర్పారణ చేసింది. దీని ద్వారా ఎంపికైన ప్రతిభావంతులకు టీసీఎస్ ఫాస్టెస్ట్ గ్రోయింగ్ యూనిట్లలో పనిచేసే అవకాశం లభిస్తుంది. ఆయా రంగాల్లో భవిష్యత్‌లో టెక్నాలజీపరంగా వచ్చే మార్పులకు అనుగుణంగా స్కిల్డ్ వర్క్ ఫోర్స్‌గా తీర్చిదిద్దుతారు.

## ఏయే విభాగాలు?

ఈ ప్రోగ్రామ్ ద్వారా ఎంపికయిన వారికి కాగ్నిటివ్ బిజినెస్ ఆపరేషన్స్ (సీబీఓ), బ్యాంకింగ్ - ఫైనాన్షియల్ సర్వీసెస్ - ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ), లైఫ్ సైన్సెస్ అండ్ హెల్త్‌కేర్, మీడియా అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్, టెలికామ్, ట్రావెల్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, ప్రీ సేల్స్ విభాగాల్లో అవకాశం కల్పిస్తారు. అర్హత, నైపుణ్యాలను బట్టి వీటిల్లోంచి ఆసక్తి ఉన్న డొమైన్‌ను కూడా ఎంచుకోవచ్చు.

## ఎంపిక ఇలా

రాత పరీక్ష, ఇంటర్వ్యూ అనే రెండు దశల ఆధారంగా ఎంపిక ప్రక్రియ సాగుతుంది. రాత పరీక్షను దేశవ్యాప్తంగా ఒకేసారి (పాన్ ఇండియా టీసీఎస్ క్వాలిఫయర్ టెస్ట్) నిర్వహిస్తారు. ఇందుకోసం హాల్‌టికెట్‌ను అభ్యర్థుల రిజస్టర్డ్ మెయిల్‌కు పంపిస్తారు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారు ఇంటర్వ్యూకు హాజరు కావాలి. రాత పరీక్ష ఫలితాలు, ఇంటర్వ్యూ షెడ్యూల్‌ను అభ్యర్థులకు మెయిల్ చేస్తారు. ఎంపికయినవారు 2020, మే నుంచి ఉద్యోగంలో చేరాల్సి ఉంటుంది.

## పరీక్ష ఇలా

రాత పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఇందులో ఐదు విభాగాల నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. అవి.. వెర్బల్ ఎబిలిటీ (10 ప్రశ్నలు), రీడింగ్ కాంప్రెహెన్షన్ (4 ప్రశ్నలు), లాజికల్ రీజనింగ్ (12 ప్రశ్నలు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (12 ప్రశ్నలు), డేటా ఇంటర్‌ప్రిటేషన్ (12 ప్రశ్నలు). ఇంగ్లీష్ భాష - వ్యాకరణంపై ప్రాథమిక అవగాహన, వాక్య నిర్మాణం, విశ్లేషణాత్మక, తార్కిక సామర్థ్యాలను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. ఈ క్రమంలో లీనియర్ ఆల్జీబ్రా, రేషియో ప్రపోర్షన్స్, స్పీడ్-డిస్టెన్స్, జామెట్రీ, టైమ్ అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, ఏరియాస్ అండ్ వాల్యూమ్స్, కోఆర్డినేట్ జామెట్రీ, ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్, నంబర్ సిస్టమ్స్, ట్రిగ్నోమెట్రీ, కాలిక్యులస్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇంగ్లీష్ గ్రామర్ విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థుల అవగాహన కోసం మాక్ టెస్ట్‌ను కూడా రూపొందించారు. లింక్ https://g91.tcsion.com/OnlineAssessment/index.html?2030@@M14 ద్వారా మాక్ టెస్ట్‌ను రాయొచ్చు.

## అర్హులెవరు?

- 2019-20 బ్యాచ్‌కు చెందిన ఆర్ట్స్, కామర్స్, సైన్స్ గ్రాడ్యుయేట్లు మాత్రమే.
- బీఏ ఎకనామిక్స్, బీటెక్, బీఈ, బీఎంఎం, బీఏ స్టాటిస్టిక్స్, బీఏ జర్నలిజం, సీఏ, ఐసీడబ్ల్యూఏ, ఎంబీఏ, ఎంఎస్సీ, ఎంఏ, ఎంకామ్ అభ్యర్థులు అనర్హులు.
- ఫుల్ టైమ్, అంటే 15 సంవత్సరాలపాటు రెగ్యులర్ ఎడ్యుకేషన్ విధానంలో డిగ్రీ చేసిన వారు మాత్రమే. కరస్పాండెన్స్ కోర్సులు / పార్ట్ టైమ్ / ఓపెన్ స్కూల్ పద్ధతిలో చదివిన అభ్యర్థులు అనర్హులు.
- విద్యాభ్యాసం మొత్తమ్మీద రెండేళ్లకు మించి అకడమిక్ గ్యాప్ ఉండొద్దు.
- మూడు నెలల కంటే ఎక్కువ పని అనుభవం ఉండకూడదు.
- షిఫ్టుల వారీగా (రాత్రి షిఫ్టులు కూడా) పని చేయడానికి సిద్ధంగా ఉండాలి.
- ఉన్నత విద్యను అభ్యసిస్తున్న లేదా బ్యాక్‌లాగ్స్ ఉన్న విద్యార్థులను అనుమతించరు.

## ముఖ్య తేదీలు

- రిజిస్ట్రేషన్: ఆన్‌లైన్ ద్వారా
- రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జనవరి 5, 2020
- రాత పరీక్ష తేదీలు: 2020, జనవరి 18, 25
- వెబ్‌సైట్: https://www.tcs.com/careers/tcsfutureforwardcareersdrive2020



### కొత్త ఒరవడి.. టాలెంట్‌కే ఓటు

వాస్తవానికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ పేరున్న కాలేజీలకే పరిమితం. మారుమూల కాలేజీల్లో చదివే విద్యార్థులు టీసీఎస్ వంటి ప్రముఖ సంస్థల నియామక ప్రక్రియలో పాల్గొనే అవకాశం దాదాపుగా ఉండదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మారుమూల కాలేజీల్లో చదివే విద్యార్థులకు, ముఖ్యంగా ఫ్రెషర్స్‌కు తమ ప్రతిభను నిరూపించుకునే వేదిక ఉండాలనే ఉద్దేశంతో బిజినెస్ 4.0 వ్యూహంలో భాగంగా టీసీఎస్ ఇటువంటి వినూత్న నియామక పద్ధతులను అనుసరిస్తోంది. ఈ ఒరవడి కేవలం టీసీఎస్‌కే పరిమితం కాలేదు. హెచ్‌సీఎల్ టెక్ బీ, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్, గ్రాడ్యుయేట్స్, ఉమెన్ కెరీర్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తోంది. విప్రో కంపెనీ సైతం దాదాపు సగం నియామకాలను ఆన్‌లైన్ పరీక్ష ద్వారానే పూర్తి చేస్తోంది. ఈ పరిణామాలను బట్టి ప్రతిభ ఆధారంగా నియామకాలను చేపట్టేందుకు ఐటీ కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్న విషయం స్పష్టమవుతుంది.

## అంగన్వాడీ సహాయకులు

ఖాళీలు 329

మహిళా, శిశు అభివృద్ధి సంస్థ - అనంతపురం జిల్లాలోని 8 ఐసీడీఎస్ ప్రాజెక్టులలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- పోస్టుల వారీగా ఖాళీలు: అంగన్వాడీ వర్కర్లు - 55, మినీ అంగన్వాడీ వర్కర్లు - 18, అంగన్వాడీ సహాయకులు - 256.
- అర్హత: పదో తరగతి ఉత్తీర్ణత, అంగన్వాడీ కేంద్రం ఉన్న గ్రామంలో స్థానికులై ఉండాలి.
- వయసు: 21 - 35 ఏళ్ల మధ్య ఉండాలి.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా.
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 8, 2019.
- వెబ్‌సైట్: ananthapuramu.ap.gov.in/

## అపెంట్రీస్

ఖాళీలు 4805

భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ స్కిల్ ఇండియా మిషన్‌లో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న ఫ్యాక్టరీల్లో అపెంట్రీస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వివరాలు..

OFB

- విభాగాల వారీగా ఖాళీలు: ఐటీఐ పోస్టులు - 3210, నాన్ ఐటీఐ పోస్టులు - 1595
- అర్హత: ఐటీఐ పోస్టులకు ప్రభుత్వ గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- నాన్ ఐటీఐ: నాన్ ఐటీఐ పోస్టులకు కనీసం 50 శాతం మార్కులతో మాధ్యమిక్ (పదోతరగతి /తత్సమాన) పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలి. సైన్స్, మ్యాథమెటిక్స్‌లో 40 శాతం మార్కులు తప్పనిసరి.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 20, 2019
- వెబ్‌సైట్: www.ofb.gov.in/

## అప్రెంటీస్

ఖాళీలు 1104

నార్త్ ఈస్ట్ రైల్వే.. అప్రెంటీస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- భర్తీ చేసే విభాగాలు: ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెకానిస్ట్, డీజిల్ మెకానిక్, ట్రిమ్మర్.
- అర్హత: పదో తరగతి, ఐటీఐ చేసి ఉండాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 28, 2019
- వెబ్‌సైట్: ner.indianrailways.gov.in/

## స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ).. స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు కోరుతోంది.

IDBI BANK

ఖాళీలు 61

- పోస్టుల వారీగా ఖాళీలు: డీజీఎం - 2, ఏజీఎం - 5, మేనేజర్ - 54.
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, పోస్టుగ్రాడ్యుయేషన్, సీఏ / ఎంబీఏ, అనుభవం.
- ఎంపిక: ప్రిలిమినరీ స్క్రీనింగ్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్ / పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 12, 2019.
- వెబ్‌సైట్: www.idbibank.in/index.asp



## మేనేజ్‌మెంట్ ట్రైనీ

ఖాళీలు 399

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్).. మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

सेल SAIL

- విభాగాల వారీగా ఖాళీలు: మెకానికల్ - 156, మెటలర్జికల్ - 67, ఎలక్ట్రికల్ - 91, కెమికల్ - 30, ఇనుస్ట్రుమెంటేషన్ - 36, మైనింగ్ ఇంజనీరింగ్ - 19.
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ / బీటెక్, గేట్‌లో అర్హత సాధించి ఉండాలి.
- ఎంపిక: రాతపరీక్ష / ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 15, 2019.
- వెబ్‌సైట్: www.sailcareers.com/

## అసోసియేట్ ప్రొఫెసర్

ఖాళీలు 60

సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ సౌత్ బిహార్ (సీయూఎస్‌బీ) - గయ, టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- భర్తీ చేసే పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్.
- సబ్జెక్టులు: మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కెమిస్ట్రీ, లైఫ్ సైన్స్, జాగ్రఫీ, ఎకానమిక్స్, పొలిటికల్ స్టడీస్, సైకాలాజికల్ స్టడీస్, తదితరాలు.
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, పీహెచ్‌డీ, నెట్ / స్లెట్ / సెట్, అనుభవం.
- ఎంపిక: షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ / ఆఫ్‌లైన్.
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 18, 2019.
- హార్డ్‌కాపీలను పంపడానికి చివరి తేదీ: డిసెంబరు 23, 2019.
- వెబ్‌సైట్: http://cusb.ac.in/

## లోయర్ డివిజన్ క్లర్క్

ఖాళీలు 66

భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖకు చెందిన న్యూఢిల్లీలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- పోస్టుల వారీగా ఖాళీలు: అప్పర్ డివిజన్ క్లర్క్ (యూడీసీ) - 14, లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ) - 52.
- అర్హత: ఎల్‌డీసీ పోస్టులకు ఇంటర్మీడియెట్, యూడీసీ పోస్టులకు ఏదైనా డిగ్రీ. రెండు పోస్టులకు టైపింగ్ స్కిల్స్ అవసరం.
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 19, 2019.
- వెబ్‌సైట్: http://www.ccras.nic.in/

## కిడ్ సైంటిస్ట్



**కావలసినవి:**

- ఒక సీసా
- నాణెం
- బిరడా
- గుండుసూది
- రెండు ఫోర్కులు
- మెత్తని తీగ
- రెండు కోడిగుడ్లు
- రెండు చిన్న కొవ్వొత్తులు
- ఒక అగ్గిపెట్టె

### ఆవిరితో నడిచే రంగుల రాట్నం

ముందుగా కోడిగుడ్లను ఒకవైపు కొద్దిగా పగలగొట్టి వాటిలోని తెల్లసొన, పచ్చసొనను తీసేయండి. తరువాత వాటిని 1/3 వంతు నీటితో నింపండి. గ్లూతో లేదా ఎంసీల్‌తో మూసి కొద్దిగా రంధ్రం ఉంచండి. తీగతో కోడిగుడ్లను వేలాడదీయండి. గుడ్ల కింద తీగతో చేసిన రెండు చిన్న బుట్టలు పెట్టాలి. గుడ్లపైన ఫోర్కును తగిలించడానికి వీలుగా తీగను వదలాలి. రెండు ఫోర్కులను బిరడాకి ఎదురెదురుగా బొమ్మలో చూపించినట్టుగా గుచ్చండి. బిరడాకు కింద గుండు సూది గుచ్చండి. ఇప్పుడు సీసా తీసుకొని బిరడాను పెట్టండి. ఒక నాణెంను బిరడాపై పెట్టండి. తరువాత సూది గుచ్చి ఉన్న బిరడాను తెచ్చి పైన పెట్టండి. తేలికగా ఉండే అల్యూమినియం ఫోర్కులు తీసుకోండి. ఇప్పుడు బుట్టలలో కొవ్వొత్తి పెట్టి వెలిగించండి. కోడిగుడ్లలో ఉన్న నీళ్లు మరగగానే ఆవిరి గుడ్లలో నుంచి బయటకు పోతుంది. దాంతో ఫోర్కులతో సహా గుడ్లు తిరుగుతాయి. జెట్ సూత్రం ఆధారంగా పనిచేసే ఈ ప్రయోగం పిల్లలకు కనువిందు చేస్తుంది.




పదాలు పూరించండి!







### సరైన నీడను కనిపెట్టండి?



### డైలీ సుడోకు -213

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 9 | | 1 | | 2 | | | 3 |
| | 8 | 4 | | 6 | | | 2 | |
| 1 | | 3 | | 5 | 7 | | | |
| | 6 | | | 7 | | | | 9 |
| 3 | | 5 | | | | 1 | | 7 |
| 9 | | | | 3 | | | 4 | |
| | | | 6 | 8 | | 9 | | 4 |
| | 1 | | | 2 | | 6 | 7 | |
| 4 | | | 7 | | 9 | | 8 | |

**సుడోకు - 212 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 8 | 1 | 3 | 6 | 4 | 5 | 7 | 2 |
| 6 | 2 | 3 | 5 | 7 | 1 | 9 | 8 | 4 |
| 7 | 5 | 4 | 8 | 9 | 2 | 6 | 3 | 1 |
| 1 | 7 | 8 | 4 | 3 | 6 | 2 | 9 | 5 |
| 4 | 3 | 2 | 9 | 5 | 8 | 7 | 1 | 6 |
| 5 | 6 | 9 | 2 | 1 | 7 | 8 | 4 | 3 |
| 8 | 9 | 5 | 6 | 4 | 3 | 1 | 2 | 7 |
| 3 | 1 | 6 | 7 | 2 | 9 | 4 | 5 | 8 |
| 2 | 4 | 7 | 1 | 8 | 5 | 3 | 6 | 9 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

# అది... ఓ మహోత్సవం!

- మమ్ముట్టి



అల్లు అరవింద్, మమ్ముట్టి

"ప్రతి పన్నెండేళ్లకు ఒకసారి 16 నుండి 18వ శతాబ్దం వరకూ దేశమంతటా మామాంగాన్ని మహోత్సవంలా నిర్వహించేవారు. ప్రేమ, ప్రతీకారం, మోసం నిండిన ఓ సంఘటనతో ఈ సినిమా చేశాం. చరిత్రలోని నిజమైన భావోద్వేగాలను తెరపైకి తీసుకొచ్చాం. చరిత్ర ఓ ప్రాంతానికి పరిమితం కాకూడదని మలయాళంతో పాటు తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నాం" అని మమ్ముట్టి అన్నారు. ఆయన హీరోగా నటించిన 'మామాంగం' తెలుగు ట్రైలర్‌ను అల్లు అరవింద్, సినిమాలో ఓ పాటను మహి వి. రాఘవ్ సోమవారం విడుదల చేశారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ "చరిత్రలో మరుగున పడిన హీరోలెందరో. అటువంటి హీరో కథతో 'సైరా నరసింహారెడ్డి' వచ్చింది. ఇప్పుడు 'మామాంగం' వస్తోంది. ఈ సినిమాను తెలుగులో విడుదల చేయమని అడిగినప్పుడు సంతోషించా. 'స్వాతి కిరణం'లో మమ్ముట్టిగారిని తీసుకున్నప్పుడు ఏం చేస్తారనుకున్నాను. సినిమా చూశాక ఆయన ఎంత గొప్ప నటుడో తెలిసింది. ఫోన్ చేసి మాట్లాడా. తర్వాత 'పవన్ కల్యాణ్ సినిమాలో విలన్‌గా చేస్తారా?' అన్నాను. 'చిరంజీవిని ఇదే మాట అడుగుతావా?' అన్నారు. 'లేదు' అన్నాను. 'నన్ను ఎందుకు అడుగుతున్నావ్' అన్నారు. 'సారీ' చెప్పాను" అన్నారు.



హరీశ్‌రావు, ఉదయ్‌శంకర్, వెంకటేశ్, సీతారామశాస్త్రి, ఐశ్వర్యారాజేశ్

# నా హృదయానికి దగ్గరైనవారు తీసిన చిత్రమిది!

- వెంకటేశ్

"ఈ చిత్రానికి పని చేసిన ప్రతి ఒక్కరూ నా హృదయానికి దగ్గరైనవారు. 'ఆటగదరా శివ'లో ఉదయ్‌శంకర్ అద్భుతంగా నటించాడు. ఈ 'మిస్ మ్యాచ్'లో నిజ జీవితానికి దగ్గరైన పాత్ర చేశాడు. మహిళలు ఉన్నతస్థాయికి ఎదిగే కథల్ని ఇష్టపడతా. ఇదీ అటువంటి కథేనని తెలిసింది" అని వెంకటేశ్ అన్నారు. ఉదయ్ శంకర్, ఐశ్వర్యారాజేశ్ జంటగా ఎన్వీ నిర్మల్ దర్శకత్వంలో జి. శ్రీరామ్ రాజు, భరత్ రామ్ నిర్మించిన 'మిస్ మ్యాచ్' ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన ప్రీరిలీజ్ వేడుకలో తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి టి. హరీశ్‌రావు, వెంకటేశ్ బిగ్ సీడీ విడుదల చేశారు. హరీశ్‌రావు మాట్లాడుతూ "క్రీడా నేపథ్యంలో సాగే సందేశాత్మక ప్రేమకథా చిత్రమిదని ప్రచార చిత్రాలను బట్టి అర్థం అవుతోంది. ప్రేమ మనిషిని విజయం వైపు నడిపించాలి కానీ, వికృత రూపం తీసుకోకూడదు. సినిమాల్లో మంచి సందేశం ఉండాలి. సమాజంలో విలువలు, మహిళల గౌరవం పెరిగేలా ఉండాలి" అన్నారు. "ఈ చిత్రంలో ఐశ్వర్య మల్లయోధురాలి పాత్ర చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో అటువంటి అమ్మాయిలు చాలా అవసరం" అన్నారు కె. రాఘవేంద్రరావు. "నేను 'తొలిప్రేమ'లో రాసిన 'ఈ... మనసే' పాటను ఈ సినిమా కోసం రీమిక్స్ చేశాం. పాటలు వింటుంటే గిఫ్టన్ మంచి సంగీతం అందించారనిపించింది" అని 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి అన్నారు. ఈ కార్యక్రమంలో దేశపతి శ్రీనివాస్, చంద్ర సిద్ధార్థ, డాలీ, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.






















| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 40,675.45 | 11,994.20 | 38,265 | 44,560 | 71.66 | 60.64 |
| 126.72 ↓ | 54.00 ↓ | 286 ↑ | 360 ↑ | | ↓ |
| | | ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత) | | | |



## మహీంద్రా బీఎస్-6 ఎక్స్‌యూవీ 300

ప్రారంభ ధర రూ.8.30 లక్షలు

న్యూఢిల్లీ : మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం).. దేశీయ మార్కెట్లోకి బీఎస్-6 ప్రమాణాలతో కూడిన కాంపాక్ట్ ఎస్‌యూవీ.. ఎక్స్‌యూవీ300 ను విడుదల చేసింది. ఈ కాంపాక్ట్ ఎస్‌యూవీ ధర రూ.8.30 లక్షల నుంచి రూ.11.84 లక్షల మధ్యన ఉన్నాయి. 1.2 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజన్‌తో ఎక్స్‌యూవీ300 అందుబాటులో ఉంటుందని తెలిపింది. 2020 ఏప్రిల్ 1 నుంచి బీఎస్-6 నిబంధనలు అమల్లోకి రానుండటంతో దశలవారీగా ప్రమాణాలకు అనుగుణంగా వాహనాలను ఉత్పత్తి చేయనున్నట్లు మహీంద్రా తెలిపింది.

**'మారుతి' కార్లు మరింత ప్రియం**

మారుతి సుజుకీ వచ్చే నెల నుంచి కార్ల ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. తయారీ ఖర్చు పెరిగిపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించింది.

## మెర్సిడెస్ కొత్త ఎస్‌యూవీ జీఎల్‌సీ

ప్రారంభ ధర రూ.52.56 లక్షలు



న్యూఢిల్లీ : జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్.. మార్కెట్లోకి ప్రీమియం ఎస్‌యూవీ జీఎల్‌సీ ను తీసుకువచ్చింది. బీఎస్ -6 ప్రమాణాలతో కూడిన ఈ ఎస్‌యూవీ ప్రారంభ ధర రూ.52.56 లక్షలు (ఎక్స్‌షోరూమ్). మెర్సిడెస్ బెంజ్ ఇండి యా ఎండీ, సీఈఓ మార్టిన్ షువెంక్ ఈ కారును మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సరికొత్త జెనరేషన్ జీఎల్‌సీ.. పెట్రోల్, డీజిల్ ఇంజన్ ఆప్షన్లతో అందుబాటులో ఉం టుందని మెర్సిడెస్ తెలిపింది. జీఎల్‌సీ 200 పెట్రోల్ వెర్షన్ కారు ధర రూ.52.75 లక్షలుండగా డీజిల్ వేరియంట్ జీఎల్‌సీ 220డీ ధర రూ.57.75 లక్షలుగా ఉంది. దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న ఎస్‌యూవీల్లో జీఎల్‌సీ ఒకటని, ఇప్పటి వరకు 7,000 యూనిట్లను విక్రయించినట్లు మార్టిన్ తెలిపారు.

## జీఎంఆర్, గాయత్రిపై ఎన్ఎస్ఈ నిఘా

**▸▸ మరో 6 కంపెనీలపైన కూడా..**

న్యూఢిల్లీ: మౌలిక రంగానికి చెందిన జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, గాయత్రి ప్రాజెక్ట్స్ సహా 8 కంపెనీలపై నిఘా పెట్టాలని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నిర్ణయించింది. ప్రమోటర్ల వాటా షేర్లలో అత్యధిక శాతం తాకట్టులో ఉన్నందున ఈ కంపెనీలను అదనపు నిఘా కోసం ఎంచుకుంది. ఈ జాబితాలో జిందాల్ స్టీల్ అండ్ పవర్, ఫ్యూచర్ ఎంటర్‌ప్రైజెస్, డిష్ టీవీ, మాక్స్ ఇండియా, సద్భావ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్, సీక్వెంట్ సైంటిఫిక్ కూడా ఉన్నాయి. ఈ 8 కంపెనీల ఈక్విటీ షేర్లు, ఈక్విటీ డెరివేటివ్‌లపై కనీసం 35 శాతం లేదా వాస్తవిక మార్జిన్ అందులో ఏది ఎక్కువైతే దాన్ని విధించనున్నట్లు ఎక్స్ఛేంజ్ వెల్లడించింది. ఈ నెల 4 వరకున్న అన్ని ఓపెన్ పొజిషన్లతో పాటు 5 నుంచి ఏర్పడే కొత్త పొజిషన్లకు పెంచిన మార్జిన్ వర్తిస్తుందని ఎన్ఎస్ఈ స్పష్టం చేసింది. ప్రమోటర్లు తమ వాటా షేర్లను అధిక మొత్తంలో తాకట్టు పెట్టుకున్న కంపెనీలపై అదనపు నిఘా చర్యలు చేపట్టాలని అక్టోబరులో నిర్ణయించాయి.

## మరిన్ని సంస్కరణలకు రెడీ

**▸▸ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**

న్యూఢిల్లీ : భారత్‌ను పెట్టుబడులకు మరింత ఆకర్షణీయమైన దేశంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రా మ న్ స్ప ష్టం చేశారు. ఇందుకోసం మరిన్ని సంస్కరణలు తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. భారత-స్వీడన్ వ్యాపార సదస్సులో ఆమె ఈ విషయం వెల్లడించారు. అయితే ఏ రంగాలు, విషయాల్లో సంస్కరణలు తీసుకు వచ్చేది ఆర్థిక మంత్రి వెల్లడించలేదు. 'బ్యాంకింగ్, గనులు, బీమాతో సహా వివిధ రంగాల్లో మరిన్ని సంస్కరణలకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని నేను హామీ ఇస్తున్నా' అన్నారు. దేశీయ కంపెనీలతో పాటు, దేశంలో పని చేస్తున్న విదేశీ కంపెనీలు ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలను పరిష్కరించేందుకూ తమ ప్రభుత్వం ఎప్పటికపుడు చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్థిక మంత్రి చెప్పారు. ఇందులో భాగంగానే నీరసించిన జీడీపీని గాడిలో పెట్టేందుకు ఇటీవల కార్పొరేట్ టాక్స్‌ను 10 శాతం తగ్గించిన విషయాన్ని గుర్తు చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి, వచ్చే బడ్జెట్ వరకు ఆగకుండానే ఈ చర్య తీసుకున్నట్లు తెలిపారు.

# కార్వీ కేసు.. రోజుకో మలుపు!

## సంస్థ క్లయింట్లకు షేర్ల బదిలీని నిలిపివేసిన శాట్

## నేడు తుది ఆదేశాలు జారీ చేయనున్న అప్పిలేట్ ట్రిబ్యునల్



న్యూఢిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. సంస్థ తాకట్టు పెట్టిన ఖాతాదారుల షేర్లను మరిన్ని బదిలీ చేయకుండా సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (శాట్) సస్పెన్షన్ విధించింది బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ కేసులో తుది ఆదేశాలు జారీ చేయనుంది. కార్వీ ఆధీనంలో ఉన్న ఖాతాదారుల షేర్లను తిరిగి వారి అకౌంట్లలోకి బదిలీ చేయాలని డిపాజిటరీ సంస్థ ఎన్ఎస్‌డీఎల్‌ను గత నెలలో సెబీ ఆదేశించింది. దాంతో 83,000 మంది (దాదాపు 90 శాతం మంది) ఖాతాదారులకు కార్వీ తాకట్టు పెట్టుకున్న షేర్లను ఎన్ఎస్‌డీఎల్ తిరిగి బదిలీ చేసింది. అయితే, నియంత్రణ మండలి నిర్ణయాన్ని సోమవారం బజాజ్ ఫైనాన్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో సవాలు చేసింది. కార్వీకి రుణాలిచ్చిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఇంకా ఇతర ఆర్థిక సంస్థలు కూడా మంగళవారం బజాజ్ ఫైనాన్స్‌తో జత కలిశాయి. కార్వీ స్టాక్ బ్రోకింగ్ మొత్తం 95,000 మంది ఖాతాదారులకు చెందిన రూ.2,300 కోట్ల విలువైన షేర్లను వారి అనుమతి లేకుండానే తనఖా పెట్టి రూ.600 కోట్ల రుణం పొందింది. కంపెనీ తమకు తాకట్టు పెట్టిన షేర్లపై తమకే హక్కు ఉంటుందన్నది రుణదాతల వాదన. తమకు తాకట్టు పెట్టిన షేర్లను కార్వీ క్లయింట్లకు తిరిగిచ్చేయాలని సెబీ ఆదేశించడాన్ని తప్పుబట్టాయి. క్లయింట్లకు తిరిగిచ్చేసిన సెక్యూరిటీలను మళ్లీ వాపసు తీసుకొని ఈ కేసు తేలేవరకు ఎస్క్రో అకౌంట్‌లో జమ చేయాలని బ్యాంకుల తరపున న్యాయవాది కోరారు. రుణదాతల వాదనలను విన్న శాట్ బెంచ్.. కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (బీఎస్ఈ)కి చెందిన డీపీ ఖాతా నుంచి మరిన్ని షేర్లను బదిలీ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయంలో బజాజ్ ఫైనాన్స్‌తో పాటు ఇతరుల వాదనలు వినాలని, తదనుగుణంగా ఈ నెల 10లోగా తుది నిర్ణయం తెలియజేయాలని సెబీని శాట్ కోరింది.

### అప్పుల కుప్పపై బ్రోకరేజీలు

కేవలం కార్వీనే కాదు, పలు ప్రముఖ బ్రోకరేజీ కంపెనీలు సైతం ట్రేడింగ్ కార్యకలాపాలు కొనసాగించేందుకు రుణాలపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. దేశంలోని టాప్-15 బ్రోకర్లకు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు రూ.9,000 కోట్లకు పైగా రుణాలు మంజూరు చేశాయి.

**సంస్థల రుణ వివరాలు**

| బ్రోకరేజీ | రుణం (రూ. కోట్లు) |
|---|---|
| మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ | 1,835 |
| ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | 1,500 |
| కార్వీ స్టాక్ బ్రోకింగ్ | 1,415 |
| ఏంజిల్ బ్రోకింగ్ | 1,379 |
| కోటక్ సెక్యూరిటీస్ | 600 |
| రెలిగేర్ బ్రోకింగ్ | 330 |
| ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్ | 245 |
| ఎస్‌బీఐ క్యాప్ సెక్యూరిటీస్ | 200 |
| యాక్సిస్ సెక్యూరిటీస్ | 150 |
| జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ | 87 |

### కార్వీ ట్రేడింగ్ లైసెన్సు రద్దు ఎత్తివేతపై 6న నిర్ణయం

స్టాక్ ఎక్స్ఛేంజీ, మార్కెట్ నియంత్రణ మండలి నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను బీఎస్ఈ, ఎన్ఎస్ఈతోపాటు మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్) సోమవారం నాడు కార్వీ స్టాక్ బ్రోకింగ్ ట్రేడింగ్ లైసెన్సును రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈక్విటీ, క్యాష్, కరెన్సీ, కమోడిటీస్.. ఇలా అన్ని సెగ్మెంట్లలోనూ కంపెనీ ట్రేడింగ్ లైసెన్సును సస్పెండ్ చేశాయి. స్టాక్ ఎక్స్ఛేంజీల నిర్ణయంపై కంపెనీ అదే రోజు సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (శాట్)ను ఆశ్రయించింది. అయితే, ట్రేడింగ్ లైసెన్సు రద్దు ఎత్తివేత కోసం ఎన్ఎస్ఈ క్రమశిక్షణ కమిటీని సంప్రదించాలని మంగళవారం కార్వీని శాట్ కోరింది. ఎన్ఎస్ఈ క్రమశిక్షణ కమిటీ కార్వీ వాదనలు విన్న అనంతరం ఈ నెల 6న తుది నిర్ణయాన్ని వెల్లడించనుంది. ట్రేడింగ్ లైసెన్సు రద్దుతో కార్వీ స్టాక్ బ్రోకింగ్ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. కొత్త క్లయింట్లను చేర్చుకోవడమే కాదు ఆర్డర్లను సైతం ఎగ్జిక్యూట్ చేయకుండా ఇప్పటికే కంపెనీపై సెబీ నిషేధం విధించింది. అంతేకాదు, క్లయింట్లు కంపెనీకి కల్పించిన పవర్ ఆఫ్ అటార్నీ(పీఓఏ)ని సైతం ఉపయోగించుకోరాదని ఆదేశించింది.

## రూ.3,500 కోట్లు

**▸▸ దేశీయ డయాలసిస్ మార్కెట్ విలువ**

**▸▸ ఏడాదికి 25 శాతం పెరుగుదల**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): చిన్న పట్టణాల్లో డయాలిసిస్ సదుపాయాల కొరత బాగా ఉందని.. మూత్రపిండ రోగుల డయాలిసిస్ కేంద్రాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని నెఫ్రోప్లస్ వ్యవస్థాపకుడు, సీఈఓ విక్రమ్ ఉప్పల అన్నారు. చిన్న పట్టణాల్లో డయాలిసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి మానవ వనరులు కొరతగా ఉన్నాయని చెప్పారు. దేశీయ డయాలిసిస్ మార్కెట్ విలువ దాదాపు రూ.3,500 కోట్లుందని.. ఏడాదికి 25-30 శాతం పెరుగుతోందని వివరించారు. మొత్తం మార్కెట్‌లో నెఫ్రోప్లస్‌కు 10 శాతం వాటా ఉందని.. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం రూ.201 కోట్లు ఉండగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.270-280 కోట్లకు చేరనున్నట్లు తెలిపారు.

## ఓఎంఆర్‌వీ హాస్పిటల్స్‌లో నాట్కోకు 12.81% వాటా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పేస్ హాస్పిటల్ పేరుతో ఆసుపత్రులను నిర్వహిస్తున్న ఓఎంఆర్‌వీ హాస్పిటల్స్‌లో నాట్కో వాటా పెంచుకుంది. కంప్లసరీ కన్వర్టబుల్ క్యుములేటివ్ ప్రిఫరెన్స్ షేర్ల ద్వారా ఓఎంఆర్‌వీలో హాస్పిటల్స్‌లో రూ.5 కోట్ల పెట్టుబడులు పెట్టామని, వాటా 12.81 శాతానికి చేరనుందని తెలిపింది.

## మార్కెట్లోకి భారత్ బయో 'రోటావ్యాక్ 5డీ'



వ్యాక్సిన్ విడుదల చేస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రపంచంలోనే అతి తక్కువ డోస్ పరిమాణం కలిగిన కొత్త రోటావైరస్ వ్యాక్సిన్‌ను భారత్ బయోటెక్ మార్కెట్లోకి విడుదల చేసింది. 'రోటావ్యాక్ 5డీ'ని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మార్కెట్లోకి ప్రవేశపెట్టారు. డయేరియా (అతిసారం)ను కట్టడి చేయడానికి తొలితరం రోటావైరస్ వ్యాక్సిన్ 'రోటావ్యాక్'ను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో బయోటెక్నాలజీ విభాగం, అంతర్జాతీయ భాగస్వాముల సహకారంతో భారత్ బయోటెక్ అభివృద్ధి చేసింది. ఇప్పటి వరకూ 10 కోట్ల డోసులను విక్రయించింది. తాజాగా కొత్త తరం వ్యాక్సిన్ రోటావ్యాక్ 5డీని ప్రవేశపెట్టింది. 10 కోట్ల డోసులను విక్రయించడంపై కంపెనీకి వెంకయ్య నాయుడు అభినందనలు తెలిపారు. కొత్తగా విడుదల చేసిన రోటావ్యాక్ 5డీ వ్యాక్సిన్ భద్రమైందే కాక మరింత సమర్థంగా పని చేస్తుందని భారత్ బయోటెక్ సీఎండీ కృష్ణ ఎల్లా తెలిపారు.

## వీఆర్ఎస్‌కు 92,700 దరఖాస్తులు

**బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లో ముగిసిన గడువు**

**ఏటా రూ.8,800 కోట్లు ఆదా**

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లో ప్రకటించిన స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) పథకానికి ఉద్యోగుల నుంచి మంచి స్పందనే లభించింది. మంగళవారం ముగిసిన ఈ పథకం కింద రిటైర్ అయ్యేందుకు దేశవ్యాప్తంగా 78,300 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నట్టు బీఎస్ఎన్ఎల్ సీఎండీ పీకే పుర్వార్ ప్రకటించారు. నిజానికి ఈ వీఆర్ఎస్ పథకం ద్వారా ప్రస్తుతం పనిచేస్తున్న 1.60 లక్షల మంది ఉద్యోగుల్లో 82,000 మంది వరకు తగ్గుతారని బీఎస్ఎన్ఎల్ భావించింది. అయినా వీఆర్ఎస్ ఎంచుకున్న ఉద్యోగుల సంఖ్య తమ లక్ష్యానికి అనుగుణంగానే ఉన్నట్టు పుర్వార్ చెప్పారు. వీరు గాక 60 ఏళ్ల వయసు నిండటంతో మరో 6,000 మంది బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు రిటైర్ అయ్యారు. ప్రస్తుతం ఏటా వేతనాల కోసం రూ.14,000 కోట్లు వెచ్చిస్తుండగా తాజాగా ఇది రూ.7,000 కోట్లకు తగ్గనుందని పుర్వార్ వెల్లడించారు.

**అదేబాటలో ఎంటీఎన్ఎల్ ఉద్యోగులు..**

ముంబై, ఢిల్లీలో టెలికాం సేవలు అందించే మరో ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ ఎంటీఎన్ఎల్ ఉద్యోగులు కూడా పెద్దఎత్తున స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 18,808 మంది ఉద్యోగుల్లో 13,650 మంది వీఆర్ఎస్ కోసం దరఖాస్తు చేస్తారని భావిస్తే 14,378 మంది దరఖాస్తు చేశారని ఎంటీఎన్ఎల్ సీఎండీ సునీల్ కుమార్ చెప్పారు. దీంతో తమ వార్షిక వేతనాల బిల్లు రూ.2,272 కోట్ల నుంచి రూ.500 కోట్లకు తగ్గుతుందన్నారు. రెండు సంస్థల్లో ప్రకటించిన వీఆర్ఎస్‌తో ఏటా దాదాపు రూ.8,800 కోట్లు ఆదా కానున్నాయి.

**సీనియర్ టెక్నికల్ ఉద్యోగులు కావాలి..**

వినియోగదారులకు ఎలాంటి ఆటంకం లేకుండా సేవలందించాలంటే సీనియర్ ఐటీఎస్ అధికారులను కీలకమైన మేనేజిరియల్ పదవుల్లో నియమించాలని టెలికాం శాఖ (డాట్)ను బీఎస్ఎన్ఎల్ కోరింది. సంస్థలో వీఆర్ఎస్‌ను ప్రకటించటంతో చాలా మంది ఉద్యోగులు దాన్ని ఎంచుకున్నారని, దీంతో సేవలను విఘాతం ఎదురయ్యే అవకాశం ఉందని డాట్‌కు వివరించింది. ఈ పరిస్థితిని గట్టెక్కాలంటే కొంత మంది ఉద్యోగులను సత్వరమే కేటాయించాలని కోరింది.

## లాభంలో 25% వృద్ధి

**▸▸ వచ్చే మూడేళ్లపై గ్రాన్యూల్స్ లక్ష్యం**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వచ్చే రెండు, మూడేళ్లలో నికర లాభంలో సగటున ఏడాదికి 25 శాతం వృద్ధిని నమోదు చేయాలని గ్రాన్యూల్స్ ఇండియా లక్ష్యంగా పెట్టుకుంది. ఆదాయం కూడా 20 శాతం చొప్పున పెరగగలదని కంపెనీ వెల్లడించింది. అధిక మార్జిన్లు ఇచ్చే వ్యాపారంపై దృష్టి పెట్టాలని, అమెరికాలో జనరిక్స్ ఔషధాల వ్యాపారాన్ని పెంచుకోవాలని భావిస్తోంది. వచ్చే రెండు, మూడేళ్లలో మొత్తం ఆదాయంలో ఫినిష్డ్ డోసేజ్ (ఎఫ్‌డీ) ఔషధాల వాటా 75 శాతం ఉండగలదని అంచనా వేస్తోంది. రుణ భారాన్ని తగ్గించుకోవడంతో పాటు భవిష్యత్తులో భారీ పెట్టుబడుల ప్రతిపాదనలు లేకుండా ఆస్తి, అప్పుల పట్టికను పటిష్ఠం చేసుకోనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ప్రస్తుతం కంపెనీకి 80 శాతం ఆదాయం ఎగుమతుల ద్వారా లభిస్తోంది. 66 శాతం ఆదాయం అమెరికా, యూరప్, కెనడా వంటి నియంత్రణలు అధికంగా ఉండే మార్కెట్ల నుంచి వస్తోంది. మొత్తం కంపెనీకి ఆరు తయారీ యూనిట్లు ఉండగా.. ఇందులో అయిదు భారత్‌లో, ఒకటి అమెరికాలో ఉంది. కాగా, వాటా విక్రయానికి ప్రైవేట్ ఈక్విటీ కంపెనీలతో చర్చలు జరుపుతున్నట్లు వచ్చిన వార్తలను గ్రాన్యూల్స్ తోసిపుచ్చింది. కంపెనీని వృద్ధి పథంలో నడిపించడానికి ప్రమోటర్లు కట్టుబడి ఉన్నారని, కంపెనీ విలువ పెంచి వాటాదారులకు ప్రయోజనం చేకూరుస్తామని స్పష్టం చేసింది.

## హెచ్ఎన్ఐ మదుపర్ల గుండెల్లో రైళ్లు!

**▸▸ ట్రేడింగ్ ఖాతాలో నగదుపై ఆందోళన**

**▸▸ దీర్ఘకాలం వేచి ఉండాల్సిందే అంటున్న బ్రోకర్లు**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కార్వీ స్టాక్ బ్రోకింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేయడంతో కార్వీ వద్ద ట్రేడింగ్ చేస్తున్న ఇన్వెస్టర్లు, అధిక నికర విలువ కలిగిన వ్యక్తుల (హెచ్ఎన్ఐ) గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. తమ డీమ్యాట్ ఖాతాలో ఉన్న షేర్లను ఇతర బ్రోకర్ వద్ద ఖాతాను ప్రారంభించి దానికి బదిలీ చేసుకోవచ్చు. అయితే.. ట్రేడింగ్ ఖాతాలోని నగదుపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నచిన్న మొత్తాల్లో పే అవుట్‌లు చేయలేక కార్వీ ఇబ్బంది పడుతోందని. బ్రోకింగ్ లైసెన్స్‌ను రద్దు చేయడంతో తమ ట్రేడింగ్ ఖాతాలోని నగదు ఎప్పటికి వస్తుందోనని ఇంట్రాడే ట్రేడింగ్ చేసే ఇన్వెస్టర్లు భయపడుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. పే అవుట్ పెట్టుకుంటే చిన్నచిన్న మొత్తాలను కూడా కార్వీ చెల్లించడం లేదు. ట్రేడింగ్ ఖాతాలో ప్రస్తుతం నగదు ఉంటే కనుక ఇబ్బందే. ఒక పక్క కార్వీ లిక్విడిటీ లేక ఇబ్బందులు పడుతోంది. తాజాగా వచ్చే ఆదాయం కూడా నిలిచిపోయింది. ఇన్వెస్టర్లు ట్రేడింగ్ ఖాతాలో నగదుతో ఇంట్రాడే ట్రేడింగ్ చేస్తారు. ఆ నగదు ఇన్వెస్టర్ల చేతికి ఎలా వస్తుందన్నది తెలియడం లేదు. దీనిపై హెచ్ఎన్ఐ ఇన్వెస్టర్లు ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు. ఇది సెబీ తీసుకునే చర్యలపై ఆధారపడి ఉంటుంది. ఎంత మందికి ఎంత చెల్లించాలో ఇంతవరకూ బయటకు రావడం లేదు. సెబీ విచారణ పూర్తయితే అవన్నీ బయటకు వస్తాయి. ట్రేడింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేయడంపై కార్వీ సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను (శాట్)ను ఆశ్రయించింది. ఎన్ఎస్ఈ క్రమశిక్షణ కమిటీని సంప్రదించాలని శాట్ సూచించింది. ట్రేడింగ్ లైసెన్స్‌పై సస్పెన్షన్‌ను కొనసాగించాలా? ఎత్తివేయాలా అన్న దానిపై క్రమశిక్షణ కమిటీ 6న నిర్ణయం తీసుకోవచ్చు అయితే.. సెబీ విచారణ పేరు చెప్పి చెల్లింపులను కార్వీ ఆపేందుకు వీలుందని హైదరాబాద్‌కు చెందిన బ్రోకరు ఒకరు తెలిపారు. పెళ్లిళ్లు, ఇతర అత్యవసర అవసరాలకు నగదు కావాల్సిన వారు పొందడానికి సాధ్యం కాదు. ఇప్పట్లో మదుపర్లకు నగదు రావడానికి అవకాశం లేదని మార్కెట్ విశ్లేషకుడు ఒకరు తెలిపారు. నగదు కోసం దీర్ఘకాలం ఆగాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. 'కార్వీకి నగదు రావాలి. అప్పుడు చెల్లించగలుగుతుంది. ఆస్తులు, వాటాను విక్రయించిన తర్వాత ఇన్వెస్టర్లకు చెల్లింపులు చేయగలుగుతుంది. అప్పటి వరకూ వేచి ఉండాల్సిందే. సంవత్సరాలు పట్టొచ్చు. రూ.20-30 కోట్ల వరకూ మార్కెట్లో పెట్టుబడులు పెట్టిన హెచ్ఎన్ఐలు కూడా ఉంటారు. సాధారణంగా రూ.కోటి నుంచి రూ.5 కోట్ల వరకూ హెచ్ఎన్ఐలు మదుపు చేస్తారు. వారందరికీ ఇబ్బందే.

ఖాతా నుంచి నగదు తీసుకోవడం ఇప్పట్లో సాధ్యం కాదు. కార్వీ ఖాతాదారుల్లో 90 శాతం రిటైల్ ఇన్వెస్టర్లు. కనీసం 10 శాతం హెచ్ఎన్ఐలు ఉండొచ్చు. ఇన్వెస్టర్లు చెల్లించడానికి కార్వీ వద్ద ఆస్తులు ఉన్నాయి. అమ్మి చెల్లింపులు చేయగలరు. అది ఎప్పటికి జరుగుతుందన్నది చెప్పలే'మని పేర్కొన్నారు. ఖాతాదారులు తమ షేర్ల బదిలీకి షేర్ల వివరాలతో డెలివరీ స్లిప్ ఇచ్చినా కార్వీ ఆ షేర్లను ఇతర బ్రోకర్ వద్ద ప్రారంభించిన ఖాతాలోకి బదిలీ చేస్తుందా లేదా అన్న అంశంపై కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విచారణతో పాటు సస్పెన్షన్ వేటు పడినందున షేర్ల బదిలీ కూడా కష్టమవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సెబీ వెంటనే స్పందించినప్పటికీ.. కార్వీ పరిణామాలు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని దెబ్బతీసిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

**3న ఫారం గేటు అమ్మకం ధరలు**

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 5.05 — నెక్ (100 గుడ్లు) — 4వ తేదీకి..



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 444 | విశాఖపట్నం | 460 |
| బెంగళూరు | 465 | వరంగల్ | 447 |
| విజయవాడ | 457 | చెన్నై | 478 |
| గోదావరి | 457 | చిత్తూరు | 477 |
| నమక్కల్ | 433 | ముంబై | 499 |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 88 | విజయవాడ | 93 |
| వరంగల్ | 88 | గుంటూరు | 93 |
| మహబూబ్‌నగర్ | 88 | ఒంగోలు | 95 |
| కరీంనగర్ | 88 | చిత్తూరు | 89 |
| కర్నూలు | 88 | నెల్లూరు | 89 |
| విశాఖపట్నం | 82 | అనంతపురం | 86 |
| గోదావరి | 88 | | |



**బులియన్**

| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 38,150 | 38,850 | 39,420 | 38,850 | 37,890 |
| క్రితం ముగింపు | 38,340 | --- | 39,280 | 38,850 | 37,780 |
| 22 క్యారెట్లు | 36,290 | 36,000 | 36,360 | 36,040 | 36,280 |
| క్రితం ముగింపు | 36,480 | --- | 36,130 | 36,030 | 36,170 |
| వెండి (కిలో) | 44,200 | 45,600 | 45,800 | 45,600 | 47,900 |
| క్రితం ముగింపు | 44,200 | --- | 45,600 | 45,700 | 47,600 |

## 12000 ఎగువన కీలకం

**టెక్ వ్యూ**

బుధవారం స్థాయిలివే...
నిరోధం : 12050
మద్దతు : 11950

నిఫ్టీ 12000 కన్నా పైన పాజిటివ్ ధోరణిలోనే ప్రారంభమైనా నిలదొక్కుకోలేకపోయింది. తదుపరి ఇంట్రాడే కరెక్షన్‌లో పడి ప్రధాన మద్దతు స్థాయి 11950 వరకు దిగజారి చివరికి 54 పాయింట్ల నష్టంతో 12000 కన్నా దిగువనే క్లోజయింది. గత కొద్ది రోజుల్లో మార్కెట్‌లో మైనర్ కరెక్షన్ ధోరణి నెలకొని ఉంది. ప్రస్తుతం అత్యంత కీలకమైన స్వల్పకాలిక 20 డీఎంఏ వద్ద నిలిచి ఉంది.

◆ సానుకూల సంకేతం కోసం మార్కెట్ 12000 కన్నా పైన పునరుజ్జీవం సాధించాలి. మైనర్ నిరోధం 12050. ప్రధాన నిరోధం 12150. ఇదే గతంలో ఏర్పడిన ప్రధాన టాప్.

◆ బలహీనతకు లోనై 11950 కన్నా దిగువన క్లోజయితే స్వల్పకాలిక బలహీనతను ప్రదర్శిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 11800.

■ వి.సుందర్ రాజా

## ప్రారంభ సెషన్ తర్వాత మెరుగు

**ఆస్ట్రో వ్యూ**

**తిథి :** మార్గశిర శుక్ల అష్టమి; నక్షత్రం : శతభిషం
**అప్రమత్తం :** ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి నక్షత్ర జాతకులు, మీన, కర్కాటక రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 10.22**

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ నిలకడగా ప్రారంభమై 10.20 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 12 గంటల వరకు మెరుగ్గాను, తిరిగి 1.35 వరకు నిలకడగానే ట్రేడయ్యే ఆస్కారం ఉంది. తదుపరి 1.35 వరకు నిస్తేజంగా ఉండి ఆ తర్వాత చివరి వరకు మెరుగ్గా ట్రేడ్ కావచ్చు.
**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఏటీపీ) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 12 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.45 తర్వాత ఏటీపీ కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 3 గంటల సమయంలో క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం : 12035, 12070**

**మద్దతు స్థాయిలు : 11955, 11920**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.
**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinanciala strologer.blogspot.in

## హస్తినలో మన గళం

### ఆంధ్రలో అదుపుతప్పిన శాంతిభద్రతలు

▸▸ తక్షణమే కేంద్రం జోక్యం చేసుకోవాలి: కనకమేడల



న్యూఢిల్లీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): "ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయి. ఈ విషయంలో తక్షణమే కేంద్రం జోక్యం చేసుకోవాలి. సాక్షాత్తు కేబినెట్ హోదాలో ఉన్న ప్రధాన విపక్ష నేత చంద్రబాబు ప్రయాణించే బస్సుపైనే అధికారపక్షానికి కొమ్ముకాసే కొందరు రాళ్లు, చెప్పులతో దాడి చేశారు. దుండగులపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారు" అని టీడీపీ నేత కనకమేడల రవీంద్రకుమార్ తెలిపారు. మంగళవారం రాజ్యసభలో జీరో అవర్‌లో ప్రత్యేక అంశం కింద ఈ విషయాన్ని మాతృభాషలో ప్రస్తావించారు. జెడ్ ప్లస్ కేటగిరీలో ఉన్న ఆయనకు భద్రత కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని తెలిపారు. తక్షణమే కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. 'మీరు చెప్పే అంశాల్లో రాజకీయ కోణాన్ని మినహాయించి, క్షేత్రస్థాయిలో వాస్తవాలకు అనుగుణంగా కేంద్రం స్పందించేలా చర్యలు తీసుకుంటాం' అని రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు చెప్పారు.

### జీరో అవర్‌లో రాజకీయాలు వద్దు: వెంకయ్య

"రాష్ట్రాలకు సంబంధించిన ప్రధానమైన సమస్యలపై ప్రత్యేక అంశం కింద ప్రస్తావించే జీరో అవర్‌ను సద్వినియోగం చేసుకోవాలి. మీ ప్రస్తావనలో అనవసరంగా రాజకీయాలను జోడించవద్దు" అని అని రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు హితవు పలికారు. ప్రతి అంశానికీ స్థానిక రాజకీయాలను జోడించి, వాతావరణం కలుషితం చేసే ప్రయత్నం చేసేవారికి ఇకపై మాట్లాడేందుకు అవకాశం ఇవ్వబోనని ఆయన స్పష్టం చేశారు.

### 'ఇసుక' బాధితులకు 10 లక్షలివ్వండి: గల్లా

ఏపీలో ఇసుక కొరత కారణంగా ఉపాధి లేక భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ లోక్‌సభ దృష్టికి తీసుకొచ్చారు. మరణించిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆత్మహత్య చేసుకున్న కార్మికుల కుటుంబాలకు భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి నుంచి రూ.10లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని లోక్‌సభ ప్రత్యేక ప్రస్తావనల సమయంలో కోరారు.

### ప్రాణహాని రుజువైతేనే ఎస్పీజీ భద్రత: సాయిరెడ్డి

వ్యక్తులకు నిజంగా ప్రాణహాని ఉందని పోలీసు విచారణలో రుజువైతేనే వారికి ప్రత్యేక భద్రతా దళం(ఎస్పీజీ) భద్రత కల్పించాలని రాజ్యసభలో వైసీపీ నేత విజయసాయిరెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఎస్పీజీ సవరణ చట్టం-2019పై రాజ్యసభలో మంగళవారం జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. ఈ బిల్లుకు వైసీపీ తరఫున పూర్తిగా మద్దతిస్తున్నట్లు తెలిపారు.

### కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు: మాధవ్

న్యూఢిల్లీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కురువలను మాదాసి కురువ, మాదారి కురువలుగా గుర్తించి ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేయాలని వైసీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ లోక్‌సభలో కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో కేన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ఎంపీ బి.సత్యవతి కోరారు.

### పోలవరం పెండింగ్ నిధులివ్వండి: రఘురామ

పోలవరం ప్రాజెక్టు పెండింగ్ నిధులు రూ.3223 కోట్లు విడుదల చేయాలని వైసీపీ ఎంపీ రఘురామకృష్ణంరాజు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం రూ.11,800 కోట్లు ఖర్చు చేయగా... కేంద్రం రూ.8577 ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి ఈ నిధులు విడుదల చేయాలని కోరారు.

### ఐటీ నివేదికపై ఏ నిర్ణయమూ తీసుకోలేదు: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆదాయపన్నుల చట్టాన్ని సమీక్షించేందుకు నియమించిన టాస్క్‌ఫోర్స్ కమిటీ తన నివేదికను కేంద్రానికి సమర్పించిందని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ వెల్లడించారు. రాజ్యసభలో వైసీపీపీ నేత విజయసాయిరెడ్డి అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వకంగా జవాబిచ్చారు. టాస్క్‌ఫోర్స్ సిఫారసు చేసిన అంశాలపై కేంద్రం ఇంకా ఏ నిర్ణయమూ తీసుకోలేదన్నారు.

### విశాఖలో ఆయుర్వేదిక్, హోమియో డిస్పెన్సరీలు

విశాఖపట్నంలో ఆయుర్వేదిక్, హోమియో డిస్పెన్సరీలను కొత్తగా ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీకుమార్ చౌబే వెల్లడించారు. మంగళవారం రాజ్యసభలో వైసీపీపీ నేత విజయసాయిరెడ్డి అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి ఈ మేరకు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.

### ప్రమాణాల ప్రకారం టైలింగ్ పాండ్ పునర్నిర్మాణం

కడప జిల్లాలోని యురేనియం ప్లాంట్‌కు సంబంధించిన టైలింగ్ పాండ్‌ను ప్రమాణాల ప్రకారం నిర్మించనందున ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం పడుతోందని, దానిని పునర్నిర్మించాలని వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన లోక్‌సభ జీరో అవర్‌లో మాట్లాడుతూ ఈ అంశాన్ని ప్రస్తావించారు.

### 'ఉపాధి'కి 6,011 కోట్లు ఇచ్చాం: కేంద్రం

ఉపాధి హామీ పథకం కింద 2019-20 సంవత్సరానికి సంబంధించి ఏపీకి ఇప్పటి వరకూ రూ.6011.93 కోట్లు విడుదల చేశామని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. లోక్‌సభలో వైసీపీ సభ్యుడు భరత్ అడిగిన ఓ ప్రశ్నకు తోమర్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అలాగే, వైసీపీ సభ్యుడు రఘురామకృష్ణంరాజు అడిగిన మరో ప్రశ్నకు సమాధానమిస్తూ... శ్యామప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ కింద రాష్ట్రంలో 13క్లస్టర్లను గుర్తించామని, వాటి అభివృద్ధికి రూ.1360కోట్లకు ఆమోదం తెలపగా, రూ.93.65 కోట్లు విడుదల చేశామని పేర్కొన్నారు.

#### పంచాయతీలకు రూ.4197 కోట్లు..

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీల అభివృద్ధికి 14వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు రూ.4197.33 కోట్లు విడుదల చేశామని తోమర్ వెల్లడించారు. లోక్‌సభలో టీడీపీ సభ్యుడు రామ్మోహన్‌నాయుడు అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2018-19కి సంబంధించి రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ పథకం కింద రూ.67.69 కోట్లు ఇచ్చామని, దాదాపు 4847 గ్రామపంచాయతీల్లో కంప్యూటర్లు ఉన్నాయని పేర్కొన్నారు. భారత్‌నెట్ ప్రాజెక్టు కింద 1573 గ్రామ పంచాయతీలకు బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ కనెక్టివిటీ కల్పించామని స్పష్టం చేశారు.

### స్థానికత గడువు రెండేళ్లు పెంచాం...

రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే వారు స్థానికత పొందడానికి గడువును మరో రెండేళ్లు పెంచామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద్ రాయ్ తెలిపారు. వైసీపీ ఎంపీ వంగా గీత అడిగిన ఓ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుంచి తొలి ఐదేళ్ల వరకూ ఇచ్చిన గడువు ముగిసిన నేపథ్యంలో ఏపీ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి వివరించారు.

## 'ఉపాధి'తో సచివాలయాల నిర్మాణం: పెద్దిరెడ్డి



సచివాలయ నమూనాను పరిశీలిస్తున్న మంత్రి

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ నిధులతో గ్రామ సచివాలయాల నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా 4,892 గ్రామ సచివాలయాలను నిర్మిస్తామని, ఇప్పటికే 2,781 సచివాలయాల నిర్మాణానికి అనుమతులు ఇచ్చామని చెప్పారు. మంగళవారం సచివాలయంలో ఉపాధి హామీ పథకంపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత ఆయన సచివాలయాల నిర్మాణ డిజైన్లను పరిశీలించారు. సచివాలయాల నిర్మాణానికి సిమెంటు బస్తా రూ.240కే ఇచ్చేలా కంపెనీలతో చర్చలు జరపాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల పక్కా గృహాల నిర్మాణానికి అనుబంధంగా ఉపాధి హామీ పనులు చేయాలన్నారు.

## వైఎస్‌ఆర్ 'లా' నేస్తం ప్రారంభం

▸▸ లబ్ధిదారుల ఖాతాల్లో రూ.5వేలు వేసిన జగన్

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వైఎస్‌ఆర్ 'లా' నేస్తం పథకాన్ని ముఖ్యమంత్రి జగన్ మంగళవారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. అదేవిధంగా ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్‌ను కూడా సీఎం ఆవిష్కరించి... లబ్ధిదారులైన న్యాయవాదుల ఖాతాల్లోకి నగదు జమ చేశారు. వైఎస్‌ఆర్ 'లా' నేస్తం కింద జూనియర్ న్యాయవాదులకు ప్రతినెలా రూ.5వేలు ప్రభుత్వం జమ చేయనుంది. దీనిపై ముఖ్యమంత్రికి న్యాయవాదులు ధన్యవాదాలు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ.100కోట్లు మంజూరు పైనా, న్యాయవాదుల సంక్షేమం కోసం చట్టంలో సవరణలు తీసుకొస్తున్నందుకు కూడా వారు కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపిన వారిలో ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, వైస్‌చైర్మన్ రామజోగేశ్వరరావు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు రామిరెడ్డి, సీనియర్ న్యాయవాది చిత్తరువు నాగేశ్వరరావు ఉన్నారు.



వైఎస్‌ఆర్ లా నేస్తం పథకం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం జగన్

## రేపు కియ ప్లాంటు ప్రారంభం!

▸▸ అనంతకు వెళ్లనున్న సీఎం జగన్

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో స్థాపించిన కియ మోటార్స్ ప్లాంటును గురువారం సీఎం ప్రారంభించనున్నారు. వాస్తవానికి టీడీపీ హయాంలో ఏర్పాటుచేసిన ఈ ప్లాంటును అప్పటి సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ ప్లాంటులో ఉత్పత్తి అయిన కార్లు ఇప్పటికే రోడ్లపై తిరుగుతున్నాయి. అయితే జగన్ ఈనెల ఐదో తేదీన దీనిని ప్రారంభించడానికి వెళ్లనున్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి పుట్టపర్తి చేరుకుంటారు. అక్కడినుంచి హెలికాప్టర్‌లో కియ ప్లాంటుకు వెళ్తారు. చంద్రబాబు టెస్ట్ ట్రయల్ చేశారని, ఇప్పుడు పూర్తిగా ప్లాంటు నిర్మాణం పూర్తయిందని అధికారులు చెప్తున్నారు.

## కేటాయింపుల్లేవు.. వాడుకోవడమే!

▸▸ కృష్ణా నీటి వినియోగంపై బోర్డు వైఖరి ఇదే..

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రిజర్వాయర్లలో సంవృద్ధిగా నీరు ఉండడంతో తెలుగు రాష్ట్రాలకు నీటి కేటాయింపులపై ఎటువంటి నిర్ణయమూ తీసుకోకూడదని కృష్ణా బోర్డు నిర్ణయించినట్లు తెలిసింది. తగినంత నీరు ఉండడంతో ఇరు రాష్ట్రాలూ తమ అవసరాల మేరకు నీటిని వినియోగించుకునే అవకాశం ఉందన్న అభిప్రాయంతో బోర్డు ఉంది. అందుకే ఇప్పట్లో బోర్డు సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం కూడా లేదని తెలుస్తున్నది. ఇప్పటి వరకు ఉపయోగించుకున్న నీటితో పాటు, భవిష్యత్తులో ఉపయోగించుకునే నీటికి సంబంధించిన లెక్కలను మాత్రం నమోదు చేసే విధంగా చర్యల్ని తీసుకోవాలని నిర్ణయించారు. ఈ ఏడాది భారీ వరద నమోదు కావడంతో కృష్ణా బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టులు పూర్తిగా నిండిన విషయం తెలిసిందే. చాలా రోజుల పాటు ప్రాజెక్టులకు సంబంధించిన గేట్లను ఎత్తి దిగవకు నీటిని విడుదల చేశారు. దాంతో ఇరు రాష్ట్రాలకు నీటి కొరత తలెత్తలేదు. కావాల్సిన మేర నీటిని ఉపయోగించుకుంటున్నాయి. ఇప్పటి వరకు తెలంగాణ 129 టీఎంసీలను ఉపయోగించుకోగా, ఏపీ 439 టీఎంసీల నీటి వాడుకున్నాయి.

| ప్రాజెక్టు పేరు | తెలంగాణ | ఏపీ |
|---|---|---|
| కల్వకుర్తి | 20.866 | - |
| పోతిరెడ్డిపాడు | - | 161.967 |
| హంద్రీ-నీవా | - | 18.5691 |
| ముచ్చుమర్రి | - | 0.436 |
| చెన్నై మంచినీరు | 0.655 | 1.311 |
| హైదరాబాద్ తాగునీరు | 7.998 | - |
| ఏఎమ్మార్పీ | 18.018 | - |
| సాగర్ ఎడమ కాల్వ | 32.602 | 16.930 |
| సాగర్ కుడి కాల్వ | - | 83.011 |
| కృష్ణా డెల్టా | - | 110.599 |
| గుంటూరు కాల్వ | - | 1.606 |
| తుంగభద్ర హెచ్ఎల్‌సి | - | 15.304 |
| తుంగభద్ర ఎల్ఎల్‌సి | - | 8.230 |
| ఆర్‌డిఎస్ | 0.856 | - |
| జూరాల | 17.158 | - |
| నెట్టెంపాడు | 11.276 | - |
| బీమా | 12.418 | - |
| కోయిల్‌సాగర్ | 4.191 | - |
| మీడియం ప్రాజెక్టులు | 3.034 | 0.448 |
| **మొత్తం** | **129.072** | **439.319** |

## 'పోలవరం' మట్టి అమ్ముదాం

గట్లపై 12కోట్ల క్యూబిక్ మీటర్ల మన్ను

అదంతా విక్రయిస్తే రూ. వెయ్యి కోట్లు

▸▸ గనుల శాఖ పరిధిలోకి ప్రాజెక్టు కాలువలు

▸▸ మంత్రుల సమావేశంలో కీలక నిర్ణయం

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పోలవరం సాగునీటి ప్రాజెక్టు కోసం తవ్వుతున్న మట్టిని విక్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఆదాయ మార్గాలను అన్వేషించే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకొంది. ఈ మట్టిని విక్రయించడం ద్వారా ఇసుకతో పాటు, మట్టితోనూ ఆదాయం సంపాదించాలని తీర్మానించింది. దీనికోసం ఇసుక పాలసీ తరహాలోనే మట్టి పాలసీని రాష్ట్రంలో చేపట్టాలని, పోలవరం కాలువలను గనుల శాఖ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించింది. సచివాలయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చాంబర్‌లో జల వనరుల శాఖ మంత్రి పి. అనిల్ కుమార్ యాదవ్, జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి రామ్‌గోపాల్, జల వనరుల శాఖ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం సీఈ సుధాకర్‌బాబు, పోలవరం కుడి ప్రధాన కాలువ ఎస్ఈ వీరకుమార్, ఎడమ ప్రధాన కాలువ ఎస్ఈ శ్రీనివాసయాదవ్‌తో సహా పలువురు గనులు, జల వనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సమీక్షలో ప్రధానంగా పోలవరం సాగు నీటి ప్రాజెక్టుతో సహా..ఇతర శాఖలలో చేపడుతున్న మట్టి తవ్వకం పనులు ..వాటి విక్రయాలపై సమీక్ష జరిగింది.

పోలవరం కాలువ గట్లపై సుమారు 12 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి ఉందని సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. దీనిని ఎస్ఎస్ఆర్ ధరల మేరకు విక్రయిస్తే రూ.1000 కోట్ల ఆదాయం వస్తుందని వెల్లడైంది. దీనిలో ఇరిగేషన్ శాఖకు రూ.700కోట్లు, మైనింగ్ శాఖకు రూ.300 కోట్లు మేర ఆదాయం వస్తుందని వెల్లడయింది. ఉభయగోదావరి ,కృష్ణా, విశాఖ జిల్లాల పరిధిలో మట్టి నిల్వలు ఉన్నాయని ..పోలవరం సాగు నీటి ప్రాజెక్టు మట్టి నిల్వ చేసేందుకు సుమారు ఐదువేల ఎకరాల భూమి వినియోగించాల్సి వస్తుందని మంత్రుల సమావేశం నిర్ణయించింది. ఇరిగేషన్, మైనింగ్ అధికారులు సంయుక్తంగా ఈ ప్రాజెక్టులను పరిశీలించాలన్నారు. రెండువారాల్లో దీనిపై ఒక పాలసీని రూపొందించాలని మంత్రుల సమావేశం నిర్ణయించింది. కాలువ గట్లపై ఉన్న మట్టిని .. రాళ్లతో కూడిన మట్టిని సేకరించాలని సమావేశంలో అధికారులను మంత్రులు ఆదేశించారు. మట్టి తవ్వకాలను టెండర్ విధానం ద్వారా విక్రయించాలన్న నిర్ణయానికి వచ్చారు. ఇప్పటికే 71 లక్షల క్యూబిక్ మీటర్ల కోసం 41 దరఖాస్తులు వచ్చాయన్నారు. గ్రావెల్ మెటల్ ఉన్న ప్రాంతాల్లోని మట్టి కోసం ఎక్కువ డిమాండ్ ఉందని .. మెటల్ ఎక్కువగా ఉన్న చోట్ల అవసరమైతే క్రషర్లకూ అనుమతిని ఇవ్వాలన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. కాగా, పోలవరం సాగు నీటి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా తవ్వకాలు జరపగా వచ్చిన మట్టి అక్రమ తరలింపును అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రుల సమావేశం తీర్మానించింది. గత ప్రభుత్వ హయాంలో పోలవరం మట్టిని దోపిడీ చేసిందని మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు మట్టిని తవ్వుకెళ్లినవాళ్లు ప్రభుత్వానికి కనీసం సీనరేజీని కూడా చెల్లించలేదని ఆరోపించారు. కోట్లాది రూపాయల విలువైన పోలవరం మట్టిని అనధికారికంగా తరలించారన్నారు. మట్టి మాఫియాకు చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

## వేతనాల కోసం అప్పు!

▸▸ 2,700 కోట్లు తెచ్చిన ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది వేతనాలు, పింఛన్లకు రాష్ట్రప్రభుత్వానికి రుణ సమీకరణే దిక్కవుతోంది. ఇందుకోసం నవంబరు నెలలో ఆర్థిక శాఖ రూ.2,700 కోట్ల మేర అప్పు చేసింది. నవరత్నాల అమలుకు పెద్దపీట వేస్తుండడంతో వేతనాలు, పెన్షన్లు, నిర్వహణ వ్యయం లాంటి అత్యవసర ఖర్చులకు మాత్రమే నిధులివ్వగలుగుతోంది. ఉద్యోగులకు వేతనాలు, రిటైరైన వారికి పెన్షన్లు, సామాజిక పింఛన్లు ఇచ్చేందుకు.. భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) కల్పించిన ప్రత్యేక నిధుల విడుదల సౌకర్యం (స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీ-ఎస్‌డీఎఫ్) పరిమితిని (రూ.1,500 కోట్లు) దాదాపు ప్రతి నెలా పూర్తిగా వాడుకుంటోంది. ఈ నెలా కూడా పూర్తిగా వినియోగించుకుంది. వేస్ అండ్ మీన్స్ ద్వారా రూ.1,200 కోట్లు వినియోగించుకున్నారు. వాస్తవానికి ప్రతి నెలా వేతనాలు, పెన్షన్లకు రూ.5,500 కోట్ల వరకు ఖర్చవుతుంది. ఇందులో సగం ప్రభుత్వం సొంత ఆదాయం నుంచి సమకూర్చుకుంటుండగా.. మిగతా సగాన్ని ఎస్‌డీఎఫ్, వేస్ అండ్ మీన్స్ ద్వారా అప్పు రూపంలో తీసుకుంటున్నారు. ఆర్‌బీఐ ద్వారా ఓపెన్ మార్కెట్లో బాండ్ల వేలంతో నవంబరు 26వ తేదీన రూ.1,500 కోట్లు, మంగళవారం ఇంకో రూ.510 కోట్లను ఆర్థిక శాఖ సమీకరించింది. బాండ్ల వేలం ద్వారా నిధులు సమీకరించే చాన్సు డిసెంబరు వరకే ఉంటుంది. ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు రూ.29 వేల కోట్ల రుణాన్ని ఇలా సమీరించుకునేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఇందులో రూ.28 వేల కోట్లు ఇప్పటికే తెచ్చేశారు. మిగతా రూ.1,000 కోట్లను డిసెంబరు ముగిసేలోపు సమీకరించాల్సి ఉంది. కాగా.. నిధుల వ్యయం తన పరిధి దాటి పోకుండా చూసుకునేందుకు ఆర్థిక శాఖ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగానే గ్రీన్ చానల్ పీడీ ఖాతాలను అందుబాటులోకి తెచ్చింది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమయంలో ఈ గ్రీన్ చానల్ పీడీ ఖాతాలు లేవు. ఆ సమయంలో బిల్లులను బ్యాంకుఖాతాల ద్వారా చెల్లించేవారు. ఇప్పుడు వాటన్నిటినీ గ్రీన్‌చానల్ పీడీ ఖాతాలకు బదిలీ చేయాలని ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ మంగళవారం అన్ని శాఖల కార్యదర్శులకు, శాఖాధిపతులకు సర్క్యులర్ మెమో జారీ చేశారు. ఇలా బదిలీ చేయడం వల్ల.. ఆయా శాఖలు వాడకుండా ఉంచిన మొత్తం ఆర్థిక శాఖకు అందుబాటులోకి వస్తుంది. భవిష్యత్‌లో ఆయా శాఖలు అడిగినప్పుడు సమకూర్చే వీలుంటుంది.

మద్య నిషేధమే లక్ష్యమైతే...

## రిటైల్ షాపులు తగ్గించరేం?



▸▸ కొత్త లైసెన్సు దరఖాస్తుకు 10లక్షలు ఎందుకు?

▸▸ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): "మద్య నిషేధం మీ లక్ష్యమైతే రిటైల్ షాపులను ఎందుకు తగ్గించరు? వాటిని అలాగే ఉంచి మద్య నిషేధం అంటే ఇదేం హేతుబద్ధత? మద్య నిషేధమంటారు, షాపుల్ని తగ్గించబోమంటారు. విడతల వారీ నిషేధమంటూ ప్రజలకు అందుబాటులో ఉండే మద్యం దుకాణాలను తగ్గించకుండా, బార్లను మాత్రమే తగ్గించడంలో మతలబేంటి?" అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు నిలదీసింది. బార్లను తగ్గించేందుకు సన్నాహాలు మొదలుపెట్టినా వాటిలో మద్యం ధరలు పెంచి ప్రభుత్వానికి రావాల్సిన రాబడి తగ్గకుండా చూసుకుంటోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎం.వెంకటరమణతో కూడిన ధర్మాసనం తప్పు బట్టింది. కొత్త బార్ల లైసెన్సుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ బార్ల యజమానులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. మంగళవారం ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా బార్ లైసెన్స్ దరఖాస్తు కోసం రూ.10 లక్షలు వసూలు చేస్తుండడంపై జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. "పది లక్షలు కట్టినా డ్రాలో లైసెన్స్ రాకుంటే ఆ డబ్బులు అంతేగదా? దానివల్ల ప్రభుత్వానికే కదా లాభం? నిజంగా బార్లు తగ్గించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే ప్రస్తుతం ఉన్నవాటిలోనే కొన్నింటిని తగ్గించవచ్చు కదా? కొత్త పాలసీ పేరుతో లైసెన్సులకు దరఖాస్తులు ఆహ్వానించడమెందుకు? రూ.10లక్షలు చొప్పున వసూలు చేయడమెందుకు? దీని వెనుక ఇంకేవో కారణాలున్నట్లు అనిపిస్తోంది. ప్రస్తుత బార్ లైసెన్సులకు ఐదేళ్ల కాలపరిమితి ఉండగా అకారణంగా ఎందుకు ఉపసంహరించుకుంటున్నారు?" అని ప్రశ్నించింది.

ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరాం వాదనలు వినిపిస్తూ.. "బార్ల లైసెన్సులను ఎప్పుడైనా ఉపసంహరించుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. ప్రజాసంక్షేమం కోసం, సామాన్యుల బాగుకోసం ప్రభుత్వం విడతల వారీ మద్యనిషేధం అమలు చేస్తోంది. అందుకే కొత్త బార్ల లైసెన్స్ విధానం అమలులోకి తీసుకొచ్చాం. దరఖాస్తు ధర అధికంగా ఉంటే పోటీలో తక్కువమంది పాల్గొంటారన్నది మా ఉద్దేశం" అని అన్నారు. ఏజీ వాదనపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. 'సామాన్యుల కోసమే మద్య నిషేధం చేపడితే, వారికి అందుబాటులో ఉండే మద్యంషాపులు ఎలా నడుపుతున్నారు? తక్కువ ధరకు అమ్మే రిటైల్ షాపుల్ని ఎలా నిర్వహిస్తున్నారు?' అని ప్రశ్నలు సంధించింది. పాత బార్లను తొలగించి, వాటి స్థానే కొత్తవి ఏర్పాటు చేస్తూ.. మళ్లీ దాన్నెలా సమర్థించుకుంటారని వ్యాఖ్యానించింది. మద్యం బార్ల పాలసీపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈనెల 18కి వాయిదా వేసింది. నూతన బార్ల లైసెన్సుల కోసం ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన డ్రాను 23వ తేదీ వరకు వాయిదా వేసుకోవాలని ధర్మాసనం సూచించింది. ఇదిలా ఉండగా బీరు, వైన్ తదితరాలపై అదనపు రిటైల్ పన్ను విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి ముందు మంగళవారం విచారణ జరిగింది. వాదనల అనంతరం న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేశారు.

### ఒక్క దరఖాస్తూ రాలేదు

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఉన్న బార్ల స్థానంలో కొత్త బార్లు ఏర్పాటు చేయాలని ఎక్సైజ్ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌కు స్పందన కరువైంది. మద్యం వ్యాపారం అంటే పరుగెత్తుకుంటూ వచ్చే వ్యాపారులు ఈ సారి దరఖాస్తు చేసేందుకు తటపటాయిస్తున్నారు. నవంబరు 29న ఎక్సైజ్‌శాఖ నోటిఫికేషన్ జారీ చేయగా మంగళవారం నాటికి 5 రోజులు గడిచినా ఒక్కరూ బార్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోలేదు. గడువుకు ముందే లైసెన్సులు రద్దు చేశారంటూ వ్యాపారులు కోర్టును ఆశ్రయించడంతో ఈ పరిస్థితి తలెత్తిందని అధికార వర్గాలు చెబుతున్నాయి. దరఖాస్తు ఫీజు ఒకేసారి రూ.10 లక్షలకు పెంచడం, కోర్టులో విచారణ ఉండటం తదితర కారణాలతో దరఖాస్తు చేసేందుకు వ్యాపారులు భయపడుతున్నారు. కోర్టులో కొత్త బార్లకు ప్రతికూలంగా తీర్పు వస్తే ఈ డబ్బులు వెనక్కి ఇస్తారా? అని వ్యాపారులు సందేహిస్తున్నారు. కోర్టులో స్పష్టత వచ్చాక చూద్దాంలే అన్న ధోరణితో ముందడుగు వేయడం లేదు.



రెహమాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

## ఎంపీడీవో గారూ.. ఇతడిని రానివ్వొద్దు

▸▸ పార్టీ అనుచరుడిపైనే ఎస్‌కోట వైసీపీ ఎమ్మెల్యే ఆగ్రహం

శృంగవరపుకోట, డిసెంబరు 3: విజయనగరం జిల్లా ఎస్.కోట వైసీపీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు.. తమ పార్టీకే చెందిన.. తనకు సన్నిహితుడైన ఓ నాయకుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల ముందే నిలదీస్తూ.. గెటౌట్ అంటూ హెచ్చరించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ వలంటీర్ల సమావేశం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే హాజరయ్యారు. వారితో మాట్లాడిన అనంతరం ఆయన బయటకు వచ్చారు. ఇంతలో మండల ప్రజా పరిషత్ అధికారి ఎంపీడీఓ శ్రీనివాసరావుతో గ్రామ వలంటీర్ నియామకం విషయమై పట్టణ వైసీపీ నాయకుడు షేక్ రెహమాన్ గొడవ పడుతుండడం ఎమ్మెల్యే దృష్టిలోలో పడింది. దీంతో ఆయన తీవ్రంగా స్పందించారు. సామరస్యంగా మాట్లాడి అధికారులతో పని చేయించుకోవాలి కానీ తిరగబడడం ఏంటని ఊగిపోయారు. 'ఇలాంటి వాటిని ప్రోత్సహించను. అధికారులు పని చేయనప్పుడు నాదృష్టికి తేవాలి తప్ప వారితో వాదనలకు దిగితే ఒప్పుకోనని' స్పష్టం చేశారు. 'గెటౌట్.. గెటౌట్' అని రెహమాన్‌ను ఉద్దేశించి అన్నారు. 'ఎంపీడీఓ గారూ ఇతను ఆఫీస్‌కు వస్తే ఎంటర్ చేయొద్దు..' అని ఆదేశించారు. దీంతో రెహమాన్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

### సీహెచ్‌డబ్ల్యూలకు 4 వేల వేతనం

▸▸ ఆంధ్రజ్యోతి కథనంపై స్పందించిన ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల(సీహెచ్‌డబ్ల్యూ) గౌరవ వేతనాన్ని ప్రభుత్వం రూ.400నుంచి రూ.4,000కు పెంచింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 'మొదటి మాట' శీర్షికన నవంబరు 30న 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి స్పందించిన ప్రభుత్వం సీహెచ్‌డబ్ల్యూల వేతనాలు పెంచుతూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీని కోసం రూ.14.46 కోట్లు కేటాయించింది.

### ఏపీసీఎఫ్ఎస్ఎస్ సీఈవో వాసిరెడ్డి రాజీనామా

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏపీసీఎఫ్ఎస్ఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పోస్టుకు వాసిరెడ్డి కృష్ణదేవరాయులు రాజీనామా చేశారు. దేశవ్యాప్తంగా అందరి మన్ననలు అందుకుంటున్న రాష్ట్ర చెల్లింపుల వ్యవస్థ(సీఎఫ్ఎంఎస్) అభివృద్ధిలో వాసిరెడ్డి కీలక పాత్ర పోషించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎఫ్ఎంఎస్ సీఈవో పదవి నుంచి ఆయనను తొలగించింది. ప్రస్తుతం ఏపీసీఎఫ్ఎస్ఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయన మరో చోట అవకాశం రావడంతో ఆ పోస్టుకు మంగళవారం రాజీనామా చేశారు.

### ఉద్యమిస్తే.. 'ప్రభుత్వ వ్యతిరేకా?': ఏపీఎన్జీవో

విజయవాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి సంబంధించి ప్రత్యేక హోదాపై ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నట్టే.. ఉద్యోగుల న్యాయమైన సమస్యలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాన్ని తాము కూడా అడుగుతూనే ఉంటామని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.చంద్రశేఖరరెడ్డి, బండి శ్రీనివాసరావులు అన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన ఎన్జీవో విజయవాడ నగర కార్యవర్గ ప్రమాణ స్వీకారం అనంతరం సభలో మాట్లాడుతూ, ఉద్యోగుల పక్షాన ఆందోళనలు చేస్తే ప్రభుత్వ వ్యతిరేక ముద్ర వేయడం తగదన్నారు.

### దివ్యాంగులకు టీడీపీ అండ: చంద్రబాబు ట్వీట్

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విభిన్న ప్రతిభావంతులందరికీ టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. 'అందరితో సమానంగా మీరూ లక్ష్యాలను అందుకోవచ్చు. కలలను సాకారం చేసుకోవచ్చు. అందుకు టీడీపీ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుంది. మిమ్మల్ని వికలాంగులని పిలుస్తుంటే.. మీలో ఆత్మన్యూనతా భావం కలగకూడదని, మీరంతా విభిన్న ప్రతిభావంతులని మా ప్రభుత్వంలోనే నామకరణం చేశాం' అని మంగళవారం చంద్రబాబు ట్వీట్ చేశారు.

## ప్రభుత్వ సెలవులపై.. ప్రకటనేదీ?

▸▸ ఇంకా వెల్లడికాని 2020 క్యాలెండర్ సెలవులు

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సెలవుల ప్రకటన ఎప్పుడొస్తుందా? అని ఉద్యోగులు, ఇతర వర్గాలు ఎదురుచూస్తున్నాయి. వచ్చే ఏడాదిలో ప్రభుత్వ సెలవు దినాలు ఏవి? ఏయే తేదీల్లో వచ్చాయన్న విషయాన్ని ప్రభుత్వం ముందుగానే ప్రకటిస్తుంది. ఉదాహరణకు 2019లో ప్రభుత్వ సెలవు రోజులను 2018నవంబరు 14వ తేదీనే ప్రకటించారు. 2020కి సంబంధించి ఇంకా అలాంటి ప్రకటనేదీ రాలేదు. సంక్రాంతి, ఉగాది, దీపావళి, క్రిస్మస్, రంజాన్ లాంటి పండుగలతో పాటు పలు సందర్భాలను పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులుంటాయి. ప్రభుత్వం ఒక జీవో ద్వారా సెలవులను ప్రకటించాల్సి ఉంది. ఈ సెలవులను బట్టి ఉద్యోగులు, వారి కుటుంబాలు.. పర్యటనలు, స్వగ్రామాలకు వెళ్లడం, ఇతర పనుల కోసం ముందస్తు ప్రణాళిక వేసుకుంటారు. దూర ప్రయాణాల కోసం టికెట్లు రిజర్వు చేసుకుంటారు. మరోవైపు కొంతమంది డైరీలు ముద్రిస్తుంటారు. వాటిలో కూడా పండుగలు-ప్రభుత్వ సెలవు దినాలను నమోదు చేయాల్సి ఉంటుంది. మరోవైపు ఈ సెలవుల ప్రకటన వస్తేనే.. విద్యాశాఖ, విద్యాసంస్థలు పరీక్షల క్యాలండర్ రూపొందిస్తాయి. సెలవులు ఎప్పుడో తెలియకుండా క్యాలండర్ ప్రకటించినా.. మళ్లీ మళ్లీ మార్పులు చేయాల్సి ఉంటుంది.

## గ్రామ సచివాలయాలపై ఐటీ పర్యవేక్షణ

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు ఆన్‌లైన్ సేవలు అందించడం, అదేవిధంగా ఆ సేవలు అందుతున్నాయా? లేదా? అన్నది పర్యవేక్షించేందుకు ఐటీ శాఖ సిద్ధమైంది. ప్రస్తుతం వలంటీర్లు తమకు కేటాయించిన వార్డులోని కుటుంబాల వివరాలు తీసుకుంటున్నారు. అయితే వాటిని ఆన్‌లైన్‌లో ఆర్టీజీ కేంద్రానికి అప్‌లోడ్ చేయడానికి వారికి తగిన సౌకర్యాలు లేవు. పురపాలక వార్డుల్లో కార్యాలయాలు, వాటిలో కంప్యూటర్లు లేవు. దీంతో కమ్యూనిటీ హాళ్ల నుంచి ఆ సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఫీడ్ అధికారులు చెప్తున్నారు. అయితే కమ్యూనిటీ హాళ్లలో ఇతర కార్యక్రమాలేమైనా ఉంటే అవి పూర్తయ్యే వరకూ వలంటీర్లు ఎదురుచూడాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. కొన్నిచోట్ల ఇంజనీరింగ్ కళాశాలల్లోని కంప్యూటర్లను ఉపయోగించుకునేలా ఏర్పాటుచేశారు. ఆ కళాశాలల తరగతులు ముగిశాకే సమాచారం అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఇక్కడా కొన్ని ఇబ్బందులను సచివాలయ సిబ్బంది ఎదుర్కొంటున్నారని అంటున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ సచివాలయాల స్థాయిలో ప్రజలకు సత్వరమే సేవలందించేందుకు ఐటీ శాఖ ఒక ప్రణాళిక సిద్ధం చేయాలని ఇటీవల సీఎం జగన్ ఆదేశించారు. ఆ మేరకు ఆర్టీజీ, ఐటీ శాఖలు ప్రణాళిక రూపొందించాయి. ఈ విషయంలో ఆర్టీజీకి సహకరించేందుకు ఎస్టోనియా దేశంతో రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ఒక ఒప్పందం చేసుకోనుంది.

## బాబు ఇచ్చే రెమ్యూనరేషన్ కోసమే...

- జగన్‌పై పవన్ వ్యాఖ్యలపై మంత్రుల ధ్వజం
- కుదరకే మూడు పెళ్లిళ్లు అంటే... అభిమానులనూ చేసుకొమ్మనేనా!
- ఆయనను మేం అసలు గుర్తించడమే లేదు
- మంత్రులు పేర్ని, కొడాలి వ్యాఖ్యలు

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై మంత్రులు పేర్ని నాని, కొడాలి నాని విరుచుకుపడ్డారు. మంగళవారం మంత్రులిద్దరూ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఇచ్చే రెమ్యూనరేషన్ కోసమే సీఎం జగన్మోహన్‌రెడ్డిపై అనుచిత ఆరోపణలు చేస్తున్నారంటూ పేర్ని వ్యాఖ్యానించారు. కుదరకే మూడు పెళ్లిళ్లు చేసుకోవాల్సి వచ్చిందంటూ చెప్పడం ద్వారా అవసరమైతే మీరూ చేసుకోండంటూ అభిమానులకు పవన్ సందేశమిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. ఇలాంటి సందేశంతో స్త్రీ జాతిని పవన్ అవమానిస్తున్నారని అన్నారు. సీఎంగా జగన్‌ని గుర్తించడం లేదన్న పవన్‌ని తాము రాజకీయ నాయకుడిగానే గుర్తించడం లేదంటూ పేర్ని ప్రకటించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను, ప్రధాని మోదీని నిరంతరం పొగుడుతుంటే జనసేన అధ్యక్షుడు పవన్ ఎందుకు అరెస్టవుతారని మంత్రి కొడాలి నాని అన్నారు. యూపీఏ అధ్యక్షురాలు సోనియా గాంధీని ఎదిరించినందుకే జగన్‌ని అరెస్టు చేశారని అన్నారు. జగన్ జైలుకు వెళ్లాడని చెపుతున్న పవన్ వ్యక్తిగత జీవితమేమిటని కొడాలి నిలదీశారు. తమకంటే ఒకరిద్దరే అభిమానులు ఉంటారని, పవన్‌కు లక్షలాది మంది అభిమానులు ఉంటారని, వారు అతనిని అనుసరిస్తే ఏమవుతుందని కొడాలి ఆందోళన వ్యక్తం చేశారు. రాజధానిలో తమను మోసం చేసినందుకే రైతులు చంద్రబాబుపై చెప్పులు వేశారని అన్నారు. దీనిపై గవర్నర్ హరిచందన్‌కు తన నేతలతో ఫిర్యాదు చేయించి రాజకీయం చేస్తున్నారని కొడాలి నాని ఎగతాళి చేశారు.

## అమరావతిలో ప్రజాధనం దుర్వినియోగం: మంత్రి మోపిదేవి



తిరుమల, డిసెంబరు 3: “మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనలో అమరావతిలో శాశ్వత కట్టడాలేవీ రాలేదు. రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు” అని మంత్రి మోపిదేవి వెంకటరమణ విమర్శించారు. మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. జగన్ సీఎంగా బాధ్యతలు తీసుకున్న ఆరు నెలల్లోనే ఏవో నేరాలు, ఘోరాలు జరిగిపోయినట్టు తన ఉనికిని కాపాడుకోవటానికి చంద్రబాబు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలు జగన్మోహన్‌రెడ్డికి సీఎంగా అవకాశమిచ్చారన్నారు. కొంతకాలం ఓర్పుతో పరిశీలన చేసి ఆ తర్వాత ప్రజలకు నష్టం జరుగుతుంటేనే స్పందించాలి తప్ప... ఇలాంటి రాజకీయాలు సరికాదన్నారు.

# చేతకాకపోతే దిగిపోండి

(మొదటి పేజీ తరువాయి)

పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం తిరుపతిలోని రైతుబజారును సందర్శించారు. రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులతో మాట్లాడారు. ఆకాశాన్నంటుతున్న ఉల్లిపాయల ధరల గురించి పలువురు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎర్రగడ్డల ధర పెరిగినా రైతులెవరికీ లాభం లేదని, కేవలం దళారీలు దోచుకుంటున్నారని పవన్ ఈ సందర్భంగా ధ్వజమెత్తారు. ఆరు నెలల్లోనే ప్రజల్లో ఇంతటి అసహనం తీసుకొచ్చిన ప్రభుత్వం.. ఇక పాలన కొనసాగించడానికి పనికిరాదన్నారు. అనంతరం కడప, రాజంపేట నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జగన్‌పై పవన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆ సందర్భంగా ఏమన్నారంటే..

### అలా మాట్లాడుతుంటే నవ్వొస్తోంది..

‘మానవత్వం మా మతం. మాట తప్పదు మా కులమని చెప్పుకొంటున్న జగన్‌రెడ్డి మనుషులు రాయలసీమలో ప్రత్యర్థుల బత్తాయి, మామిడి చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికేశారు. ఇదేనా మానవత్వం? ఆయన కులం మాట తప్పదంటే తక్కిన కులాలు మాట తప్పుతాయని అర్థమా? ఇలాంటి వ్యక్తులకు నాయకత్వం వహించే జగన్ మానవత్వం గురించి మాట్లాడుతుంటే నవ్వొస్తోంది. జనసేన నాయకుల పంటలను ధ్వంసం చేస్తున్నారు. కార్యకర్తలను యాక్సిడెంట్ పేరుతో చంపేస్తున్నారు. ఇలా చేస్తుంటే చూస్తూ ఊరుకునేదిలేదు. మానవత్వం మీ మతమైతే ఒక మతాన్ని చంపేసి ఇంకో మతాన్ని వెనకేసుకుని రావడం కాదు. అన్ని మతాలు, కులాలు కలిసిమెలిసి ఉండాలి.’

### ఇది సింహాల సీమ..

‘కర్నూలు అహోబిలంలో నరసింహ స్వామి వెలిశాడు. స్వార్థంతో నిండిపోయిన అసురుడైన హిరణ్యకశిపుడిని చంపేందుకు స్తంభం నుంచి ఉద్భవించాడు. ప్రకృతి ఏదో ఒక రూపంలో బయటకు వచ్చి అసుర సంహారం చేస్తుంది. అలాంటి నేల ఇది. మీకు భయం వేసినప్పుడు నరసింహస్వామిని తలుచుకోండి. ఇది రాయలసీమ కాదు.. సింహాల సీమ. మీరు సింహాలుగా ఉన్నప్పుడు ఎంతమంది ఎన్ని ఆయుధాలతో వచ్చినా రమ్మనండి. మీ కోసం నేను ముందుంటాను. సీమలో నేను పుట్టకపోయినా పౌరుషంలో తక్కువ లేదు. సీమలోని ఓ గ్రామం పేరు ‘కొణిదెల’ నా ఇంటిపేరు. మాపై దాడులు చేసిచూడండి. అన్నీ వదిలేస్తా. చివరికి బిడ్డల్ని కూడా. నాతోపాటు నడుస్తున్న అన్న నాగబాబును కూడా. వైసీపీ నేతలు వారి కుటుంబాలను వదిలి రాగలరా?’

### ప్రజలు తరిమికొడతారు..

‘గతంలో కూడా చాలా గొప్పగొప్ప సామ్రాజ్యాలు వచ్చాయి. వ్యతిరేకత వచ్చినప్పుడు ప్రజలు వాటిని తరిమికొట్టిన సందర్భాలు చరిత్రలో కోకొల్లలు. 151 సీట్లు వచ్చాయని విర్రవీగితే తెగించేందుకు సిద్ధంగా ఉన్నాం. మార్పు రావాలంటే తెగించాలి. కయ్యానికి కాలుదువ్వకండి. కానీ మన మీదకు వస్తే సంఘటితంగా నిలబడండి. మనలోని అనైక్యతే వారి బలం. ఎన్నికలప్పుడు అనంతపురంలో పోరాట యాత్ర పెడితే 3.5 లక్షల మంది జనం వచ్చారు. కానీ అవి ఓట్లుగా రాలేదు. ఒక్క రోజులో మార్పు రాదు. ఇలాంటి సమూహాన్ని ఎదుర్కోవాలంటే బలమైన నాయకత్వం కావాలి. ముందు నేను నిలబడాలి. ఎన్ని అవాంతరాలు వచ్చినా వెన్నుచూపను.’

### నేను ప్రధాని వద్దకు వెళ్లి ఉంటే..

‘ఎన్నికలకు ముందు నేను సిద్ధాంతాలను పక్కనపెట్టి ప్రధాని దగ్గరకు వెళ్లి ఉంటే వైసీపీ బయటకు వచ్చిఉండేదా? వ్యూహాలు వేయలేక కాదు. తెలివి లేకపోవడం కాదు. అందరిలా అబద్ధాలు ఆడలేను. నేను నిబద్ధతగా ఉండాలనుకున్నా కాబట్టే వైసీపీ గెలిచింది. ఎన్నికల తర్వాత నిజంగా వైసీపీ బలంగా ఉండిఉంటే లాంగ్‌మార్చ్‌కు 2 లక్షల మంది ప్రజలు మనకు వచ్చి ఉండరు.’



కార్యకర్తలు తొక్కివేసిన ఉల్లిపాయలను ఏరుతున్న పవన్

### 3 కిలోల నష్టానికి రూ.3 వేల పరిహారం

తిరుపతి రైతుబజార్‌లో పవన్ పర్యటిస్తున్నప్పుడు జనసేన కార్యకర్తలు, అభిమానులు అక్కడ ఆరబోసిన ఉల్లిపాయలను తొక్కివేశారు. దాంతో వ్యాపారి 3 కిలోల ఉల్లిపాయలు నష్టపోయారు. అది గమనించిన పవన్ వెంటనే తమ పార్టీ నాయకుడు పగడాల మురళి ద్వారా ఆ వ్యాపారికి నష్టపరిహారంగా రూ.3 వేలు అందించారు.

## ఓట్ల కోసం కాదు.. తెలుగు భాష రక్షణకే పోరాటం

**పేద పిల్లలపై ఆంగ్లం రుద్దుతారా?.. సగం మంది భవిష్యత్ దెబ్బతింటుంది.. ‘ఆంధ్రజ్యోతి’తో పవన్**

తిరుపతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలుగు భాష, సంస్కృతులను కాపాడుకునేందుకు తాను మొదలు పెట్టిన పోరాటం ఓట్ల కోసం కాదని జనసేనాని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఇప్పట్లో ఎన్నికలూ లేవని.. నాలుగున్నరేళ్ల తర్వాత వచ్చే ఎన్నికల కోసం ఇప్పటి నుంచే ఎవరూ జనంలోకి రారని వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన ‘ఆంధ్రజ్యోతి’తో మాట్లాడారు. ‘ఇక్కడే కాదు.. హైదరాబాద్‌లోనూ ఎందరో ప్రముఖులు, తెలుగు భాషా ప్రేమికులు కలిశారు. రాజకీయాలకు అతీతంగా తెలుగు కోసం గళం విప్పాలని కోరారు. ఒకటి, రెండు, మూడో తరగతి చదువుతున్న పేద పిల్లలపై హఠాత్తుగా ఆంగ్ల మాధ్యమం రుద్దితే వారు ఏవిధంగా తట్టుకోగలరు? డబ్బున్న తల్లిదండ్రులు ట్యూషన్లు పెట్టించుకునైనా కొంతవరకూ నెట్టుకొస్తారు. ఆ స్తోమత లేని పేదల పరిస్థితి ఏమిటి? దీనివల్ల 50 శాతం పేద పిల్లల భవిష్యత్ దెబ్బతింటుందన్నదే నా ఆందోళన. దీన్ని ఎవరూ అర్థం చేసుకోవడం లేదు’ అని ఆవేదన వ్యక్తంచేశారు. మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయినందుకు అవమానంగా భావించలేదని చెప్పారు. ‘ఎలాగూ ఓడిపోయాం కదా కనీసం ఆరు నెలలు లేదా సంవత్సరంపాటు ఎటైనా వెళ్లి ప్రశాంతంగా గడుపుదామనుకున్నా. కానీ ఆరు నెలల్లోపే ఫుల్ టైమ్ పనిచేయాల్సిన పరిస్థితి వచ్చేసింది. భీమవరం, గాజువాకల్లో కష్టపడి పనిచేసిన అభిమానులకు, ఆదరించిన ప్రజలకు కృతజ్ఞతలు చెబుదామని నాదెండ్ల మనోహర్‌తో కలిసి బయల్దేరా. సిద్ధాంతం అనే ఊరి వద్ద జనం కారు ఆపారు. ఇసుక తవ్వనివ్వడం లేదని, పనుల్లేక ఇబ్బందులు పడుతున్నామని చాలామంది మహిళలు చెప్పారు. దాని ప్రభావం కూలీలపైనే కాకుండా ఇతర రంగాలపైనా పడిందని తెలిసింది. లోతుల్లోకి వెళ్తే అది సాధారణ సమస్య కాదని అర్థమైంది. దాని ఫలితమే విశాఖలో సభ పెడితే అనూహ్యంగా విజయవంతమైంది. అధికారంలోకి వచ్చీ రాగానే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైంది’ అని తెలిపారు. ఎంతసేపూ ఎన్నికలు, ఓట్లను దృష్టిలో పెట్టుకుని రాజకీయాలు చేస్తే ఎలాగని నిలదీశారు. సమాజంలో ప్రతి వర్గాన్నీ లక్ష్యం చేసుకుని నగదు తాయిలాలు ఇచ్చుకుంటూ పోతున్నారని ఆక్షేపించారు. ‘ప్రతి కులం, ప్రతి వర్గం.. ప్రభుత్వం నుంచి తాయిలాలు ఆశించే పరిస్థితి తెచ్చి పెడుతున్నారు. చివరికిది ఎక్కడకు దారితీస్తుందనేది ఆలోచిస్తే భయమేస్తోంది. పేదలకు బిస్కెట్లు వేయడం ఇప్పటికైనా మానాలి’ అని హితవు పలికారు. రాష్ట్ర రాజకీయాల్లో మధ్యతరగతి ప్రజల గళం వినిపించే నాయకులే లేరని.. అందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు.



మంత్రి కొడాలి నానిపై ఫిర్యాదు చేస్తున్న తంగిరాల సౌమ్య, పద్మజ

## ‘పద్మజ’ నిర్బంధం... విడుదల

- కొడాలిని దూషించారంటూ కేసు నమోదు
- మంత్రి నానిపై కంచికచర్ల, మంగళగిరిలో ఫిర్యాదు

కంచికచర్ల, మంగళగిరి, డిసెంబరు 3: మంత్రి కొడాలి నానిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ రాజధాని ప్రాంతానికి చెందిన మహిళ యలమంచిలి పద్మజను కృష్ణా జిల్లా కంచికచర్ల పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. నవంబరు 27న మంగళగిరి ప్రాంతంలో రైతులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పద్మజ మంత్రి నానిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఆమెపై చర్యలు తీసుకోవాలంటూ కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామస్థుడు మంగళపూడి ముక్తేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో పోలీసులు పద్మజ స్వగ్రామం యర్రబాలెం వెళ్లి స్టేషన్‌కు తరలించి విచారించి పంపేశారు. సీఐ సతీశ్ మాట్లాడుతూ.. పద్మజను అరెస్టు చేయలేదని, 41ఏ కింద నోటీసులు ఇచ్చి విచారించామని తెలిపారు. కాగా, పద్మజను కంచికచర్ల స్టేషన్‌కు తీసుకొని వస్తున్నారన్న సమాచారం తెలుసుకొన్న నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాలసౌమ్య అక్కడకు చేరుకొన్నారు. కంచికచర్ల నుంచి పద్మజను ఆమె స్వగ్రామానికి తీసుకెళ్లారు.

### భయపడేది లేదు: పద్మజ

“నేను టీడీపీ నాయకురాలిని... కనీసం కార్యకర్తను కూడా కాదు. కేవలం సానుభూతిపరురాలిని మాత్రమే. మంత్రి కొడాలి నాని పలుమార్లు మాజీ సీఎం చంద్రబాబును, లోకేశ్‌ను దూషించిన తీరు బాధ కలిగించింది. నిరసన ప్రదర్శనలో ఉద్రేకంగా మాట్లాడానే తప్ప ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేదు” అని పద్మజ తెలిపారు. కంచికచర్లలోనూ, యర్రబాలెంలోనూ ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మల, మాజీ ఎమ్మెల్యే సౌమ్య మీడియాతో మాట్లాడారు. ఆవేశంతో మాట్లాడిన గృహిణికి ఓ న్యాయం, సభ్యసమాజం తలదించుకొనేలా మాట్లాడిన మంత్రికి ఓ న్యాయమా అని ప్రశ్నించారు. కాగా, మాజీ సీఎం చంద్రబాబు, మాజీ మంత్రి లోకేశ్‌ని దూషించిన మంత్రి కొడాలి నానిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కంచికచర్ల రూరల్ పీఎస్‌లో తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ కోగంటి బాబు, మంగళగిరి రూరల్, అర్బన్ పోలీస్ స్టేషన్లలో టీడీపీ నేతలు పోతినేని శ్రీనివాసరావు, గంజి చిరంజీవి ఫిర్యాదు చేశారు.

## వైసీపీ తీరుతో పడిపోయిన రెవెన్యూ

- మాజీ మంత్రి దేవినేని ఉమా విమర్శ

విజయవాడ(విద్యాధరపురం), డిసెంబరు 3: “వైసీపీ ప్రభుత్వ తీరువల్ల రాష్ట్ర రెవెన్యూ 17 శాతానికి పడిపోయింది. ఈ 6 నెలల్లో రాష్ట్రానికి రూ.6 వేల కోట్ల నష్టం జరిగింది. రూ.30 వేల కోట్ల ఆదాయం పడిపోయింది. రూ.25 వేల కోట్లు అప్పులు తెచ్చామని సీఎం చెప్పటం సిగ్గుచేటు. జగన్మోహన్ రెడ్డి మంచి ముఖ్యమంత్రి కాదు.. ముంచే ముఖ్యమంత్రి” అని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఎద్దేవా చేశారు. మంగళవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జగన్ మతం మూర్ఖత్వమని అన్నారు. కక్ష, వివక్షలే వైసీపీ ప్రభుత్వ ప్రధాన ఏజెండాలని తెలిపారు.

### అప్రజాస్వామిక వ్యవహారం: కళా

“రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోంది. రాజధాని నిర్మాణ పనులు నిలిపివేసి పైశాచికానందం పొందుతోంది” అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు విమర్శించారు. 5వ తేదీన ఏ1 కన్వెన్షన్ హాలులో టీడీపీ ఆధ్వర్యంలో జరిగే రాజధానిపై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాట్లను మంగళవారం ఆయన నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్, బెంగళూరులో జగన్‌కి భూములున్నాయని, ఏపీలో రియల్ ఎస్టేట్ ధరలు పడిపోవాలని చూస్తున్నారని ఆరోపించారు. రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరుకావాలని జనసేన, సీపీఎం, సీపీఐ,బీజేపీలకు ఆహ్వానం పంపామని ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు తెలిపారు.

## సిట్ విచారణకు సీఎం బాబాయి

కడప, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సిట్ బృందం రెండో రోజు వైఎస్ భాస్కర్‌రెడ్డి సోదరుడు, జగన్‌కు బాబాయి అయిన వైఎస్ మనోహర్‌రెడ్డి, ఆయన సన్నిహితుడు వరప్రసాద్‌ను అధికారులు మంగళవారం విచారించారు. వీరితో పాటు టీడీపీ నాయకుడు, సింహాద్రిపురం మాజీ జడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రఘునాథరెడ్డిని కూడా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ నేతృత్వంలోని సిట్ బృందం కడపలోని జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్‌కు పిలిపించి విచారించినట్లు తెలిసింది.

## సిట్ సెట్ అయింది

- వివేకా హత్యకేసు విచారణపై వర్ల వ్యాఖ్య

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): “వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఇద్దరు వైసీపీ ముఖ్య నాయకులను పోలీసులు విచారించినట్లుగా పత్రికల్లో వచ్చింది. పోలీసుల విచారణ ఇంతకాలానికి సరైన లైన్ పైకి వస్తున్నట్లుగా అనిపిస్తోంది” అని టీడీపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసులో కడప వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డిని పోలీసులు విచారించడంపై వర్ల ఈ వ్యాఖ్య చేశారు. మంగళవారం గవర్నర్‌ని కలిసి బయటకు వచ్చిన తరువాత వర్ల రామయ్య విలేకరులతో మాట్లాడారు. వివేకానందరెడ్డి హత్య కేసుపై సిట్ వేసి ఆరు నెలలైనా ఇంతవరకూ ఏమీ సాధించలేకపోయారని టీడీఎల్పీ ఉపనేత అచ్చెన్నాయుడు విమర్శించారు.

## ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలకు గాలం!

- ముగ్గురు మంత్రుల మంత్రాంగం.. బాలినేని నివాసంలో భేటీ
- రేపు సీఎంను కలిసే అవకాశం.. తమ ఎమ్మెల్యేలకు బాబు ఫోన్లు

ఒంగోలు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యేలకు గాలంవేసే ప్రయత్నాలను అధికార పార్టీకి చెందిన ముగ్గురు మంత్రులు ముమ్మరం చేశారు. జిల్లాలో నలుగురు టీడీపీ ఎమ్మెల్యేలు ఉండగా.. వారిలో ముగ్గురికి ఫోన్లు చేయడంతో రాజకీయంగా అలజడి మొదలైంది. ఈ విషయమై ముగ్గురు మంత్రులు మంగళవారం విజయవాడలో మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఇంట్లో సమావేశమై మంతనాలు జరిపినట్లు సమాచారం. వారు బుధవారం సీఎం జగన్మోహన్‌రెడ్డిని కలుస్తారని తెలిసింది. మరోవైపు టీడీపీ అధినేత చంద్రబాబు మంగళవారం ఉదయం తమ పార్టీ ఎమ్మెల్యేలకు నేరుగా ఫోన్లు చేసి వారి యోగక్షేమాలను విచారించారు. టీడీపీకి ఉన్న 23 మంది శాసనసభ్యుల్లో కనీసం ఆరేడుగురిని ఆ పార్టీకి దూరం చేసి చంద్రబాబుకు ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేయాలని వైసీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. గత ఎన్నికల్లో టీడీపీ ప్రకాశం జిల్లాలో నాలుగు చోట్ల.. చీరాల(కరణం బలరాం), గొట్టిపాటి రవికుమార్(అద్దంకి), పరుచూరు(ఏలూరి సాంబశివరావు), కొండపి(డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి).. విజయం సాధించింది. వీరిలో ముగ్గురిని తమ వైపు లాక్కునే ప్రయత్నాలకు వైసీపీకి చెందిన మంత్రులు బాలినేని, కొడాలి నాని, పేర్ని నాని శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. కొడాలి నాని, పేర్ని నాని తొలుత ఎమ్మెల్యే గొట్టిపాటితో మంతనాలు జరిపారు. పార్టీ మారేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేయకపోవడంతో ఆయన క్వారీలపై అధికారుల దాడులు ప్రారంభమయ్యాయి. అనంతరం బాలినేని కూడా రంగంలోకి దిగి రవికుమార్‌తో మాట్లాడినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో కొడాలి నాని పర్చూరు శాసనసభ్యుడు ఏలూరికి ఫోన్ చేసి.. వైసీపీలోకి రావాలని ఆహ్వానించారని.. అన్ని విధాలా ప్రాధాన్యం ఉంటుందని భరోసా ఇచ్చినట్లు సమాచారం. ఇటీవల ఓ కార్యక్రమంలో కలిసిన కరణం బలరాంతో బాలినేని చర్చించి పార్టీలోకి రమ్మని ఆహ్వానించినట్లు తెలిసింది. కొండపి ఎమ్మెల్యే స్వామి పార్టీ మారతారని ఆ నియోజకవర్గ వైసీపీ నాయకులు ప్రచారం చేస్తున్నా.. ఆయనతో ఏ మంత్రీ మాట్లాడలేదని తెలిసింది. టీడీపీ ఎమ్మెల్యేలకు గాలం వేస్తున్న మంత్రులు మంగళవారం విజయవాడలోని మంత్రి బాలినేని నివాసంలో సమావేశమై చర్చించినట్లు సమాచారం. వీరు బుధవారం బుధవారం ముఖ్యమంత్రి జగన్‌ను కలిసి ఇదే విషయంపై మాట్లాడబోతున్నారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.



టీడీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారంటూ గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆ పార్టీ నేతలు

## మాజీ సీఎంకు భద్రత ఇలాగేనా?

- పోలీసు అధికారులే దగ్గరుండి రాళ్లేయించారు
- వైసీపీ గూండాల చేతిలో పోలీసు లాఠీ
- వారు లాక్కున్నారా.. వీరే ఇచ్చారా?
- గవర్నర్‌కు టీడీపీ నేతల ఫిర్యాదు

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ‘మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి పర్యటనకు వెళ్లడానికి వారం ముందే పోలీసు శాఖకు సమాచారం ఇచ్చాం. భద్రత కోసం 250 మంది పోలీసులను మోహరించారు. అయినా ఆయన వాహనంపై వైసీపీ గూండాలు రాళ్లు, చెప్పులు విసిరారు. ఇంత మంది పోలీసులు కేవలం 30 మంది ఆందోళనకారులను అదుపు చేయలేరా? 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి జడ్ ప్లస్ సెక్యూరిటీలో ఉన్న నేతకు భద్రత కల్పించే విధానం ఇదేనా’ అని తెలుగుదేశం పార్టీ నేతలు ప్రశ్నించారు. అమరావతి పర్యటనలో పోలీసు అధికారుల వైఖరిని తప్పుబడుతూ వారిపై దర్యాప్తు చేయాలని కోరుతూ ఆ పార్టీ నేతలు మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌ను కలిశారు. టీడీఎల్పీ ఉప నేత అచ్చెన్నాయుడి నాయకత్వంలో ఎమ్మెల్యేలు రామానాయుడు, గద్దె రామ్మోహనరావు, మద్దాలి గిరి, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీలు అశోక్ బాబు, బచ్చుల అర్జునుడు, మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, శ్రావణ్ కుమార్, పార్టీ నేతలు వర్ల రామయ్య, పంచుమర్తి అనూరాధ తదితరులు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. వైసీపీ నాయకులు విసిరిన పోలీసు లాఠీని ఈ సందర్భంగా ఆయనకు చూపించారు. అనంతరం రాజ్‌భవన్ వెలుపల విలేకరులతో మాట్లాడారు. గవర్నర్‌కు చూపించిన లాఠీని అచ్చెన్నాయుడు మీడియా ప్రతినిధులకు కూడా చూపించారు. ‘పోలీసుల వద్ద ఉండాల్సిన ఈ లాఠీని చంద్రబాబు పర్యటనలో టీడీపీ నేతలపై విసిరారు. ఒక నేతకు కన్ను పోయే ప్రమాదం కొద్దిలో తప్పింది. ఇది పోలీసు లాఠీ అవునా కాదా? దీనిని పోలీసులు విసిరారా లేక వైసీపీ గూండాలకు పోలీసులే ఇచ్చి విసిరేలా చేశారా? లేకపోతే పోలీసుల నుంచి వైసీపీ గూండాలే లాక్కొని మాపై విసిరారా? పోలీసులే సమాధానం చెప్పాలి. మేం రాజధానిలో అనేక గ్రామాలు తిరిగినా ఎక్కడా నిరసనలు లేవు. బయటివారిని తెచ్చి ఒకచోట మాపై దాడి చేయించారు. వారికి అనుమతి ఇచ్చి మరీ దాడి చేయించారు. పోలీసు అధికారుల సమక్షంలో.. వారి ప్రోత్సాహంతో జరిగిన దాడి ఇది. వారి తీరును వివరించడానికే గవర్నర్‌ను కలిశాం’ అని అచ్చెన్న చెప్పారు. తాము అమరావతి పర్యటనకు ఉపయోగించిన మూడు బస్సులను సీజ్ చేసి వాటి డ్రైవర్లను లాకప్‌లో పెట్టి బస్సు అద్దాలు ముందే పగిలి ఉన్నాయని చెప్పాలని ఒత్తిడి తెస్తున్నారని, ఈ దాడిపై డీజీపీ ఇచ్చిన వివరణలు ప్రజలు నవ్వుకునేలా ఉన్నాయని ఎద్దేవాచేశారు. ఆందోళనకారులు రాళ్లు, చెప్పులు విసిరారని ఐజీయే అంగీకరిస్తూ.. మళ్లీ ఏమీ జరగలేదంటూ బుకాయిస్తున్నారని ఆక్షేపించారు. విచారణకు ఎన్ని సిట్‌లు వేసినా పోలీసు అధికారుల చర్య బలంగా ఉండడం ముఖ్యమని, అది లేకుండా ఏ విచారణలు జరిగినా ఉపయోగం లేదని చెప్పారు. తమ వినతికి గవర్నర్ బాగా స్పందించారని, విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చారని... న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాజధాని ప్రాంతంలో ఒక మహిళను తీసుకెళ్లి అనేక స్టేషన్లు తిప్పి విచారించే ముందు.. చంద్రబాబును పరమనీచంగా బూతులు తిట్టిన మంత్రి కొడాలి నానిని కూడా అరెస్టు చేయాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు.

## చెప్పులతో దాడి భావప్రకటనా స్వేచ్ఛా!

- కడుపు మండిన మహిళ మాట్లాడితే చట్ట వ్యతిరేకమా?
- జగన్ ఆస్తుల్లా పెరిగిపోతున్న ఉల్లి ధరలు: ట్విటర్‌లో లోకేశ్

అమరావతి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): “తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడిపై చెప్పులతో, రాళ్లతో ముఖ్యమంత్రి జగన్ దాడి చేయిస్తే పోలీసులకు అది భావప్రకటన స్వేచ్ఛగా కనిపించింది. జగన్ చెత్త పాలన చూసి కడుపు మండి ఒక మహిళ మాట్లాడితే పోలీసులకు అది చట్ట వ్యతిరేక చర్యగా కనిపించడం ఆశ్చర్యంగా ఉంది. పద్మజ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నా” అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. ఆయన మంగళవారం ట్విటర్‌లో వివిధ అంశాలపై స్పందించారు. రాష్ట్రంలో ఒక్క వైకాపా మంత్రులు, నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందా? మంత్రులు బూతులు తిట్టినా, నీ అమ్మ మొగుడు అంటూ దుర్భాషలాడినా అది పవిత్రమైన భావ ప్రకటనా స్వేచ్ఛలా కనిపిస్తుందా? ఎప్పటికీ మీరే అధికారంలో ఉండిపోతారు అనుకోవడం అవివేకం. వ్యవస్థలను భ్రష్టుపట్టించేలా చేస్తున్న ప్రతి చర్య భవిష్యత్తులో మీ మెడకు చుట్టుకోవడం ఖాయం” అని తన ట్వీట్‌లో జగన్‌ని హెచ్చరించారు. మరో ట్వీట్‌లో పీపీఏలపైనా, పోలవరంపైనా వైసీపీ విధానాన్ని ఎండగట్టారు. పోలవరంలో అన్నీ నిబంధనల మేరకే జరిగాయంటూ పార్లమెంటులో కేంద్ర మంత్రి ఇచ్చిన సమాధానం చెప్పపెట్టు అంటూ వ్యాఖ్యానించారు. ఆరునెలల్లో ఒక్క ఆరోపణనైనా నిరూపించలేని మంత్రుల కమిటీలు, వాటిని పర్యవేక్షిస్తున్న జగన్ గాడిదలు కాస్తున్నారా? అంటూ మండిపడ్డారు. మరో ట్వీట్‌లో... జగనన్న ఉల్లి వారోత్సవాలు పెట్టాల్సిన రోజులు దగ్గర పడ్డాయని వ్యాఖ్యానించారు. ఉల్లి ధరలు జగన్ ఆస్తుల్లా పెరుగుతూ పోతున్నాయని పేర్కొన్నారు. జగన్ విధ్వంసకర పాలనతో అసలు పనులే లేవంటే ఇప్పుడు అప్పు చేసి పూట గడిపే పరిస్థితి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేజీ ఉల్లికోసం రూ.500 కూలీ వదులుకుని క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి చూస్తే బాధేస్తోందని అన్నారు.

# ఇదేనా మానవత్వం?

(మొదటి పేజీ తరువాయి)



పేదల కన్నీళ్లే శాపాలుగా మారుతాయి జాగ్రత్త అంటూ ఆయన హెచ్చరించారు. కర్నూల్లో కొనసాగుతున్న రెండో రోజు పర్యటనలో భాగంగా ఈ జిల్లాలో వైసీపీ నాయకుల వేధింపులకు గురి అయిన బాధిత కుటుంబాలతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ఒక్కొక్కరుగా వారు చెప్పిన వ్యథాభరిత ఘటనలు ఆయనను కదిలించాయి. పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులపై సాగుతున్న రాజకీయ దాడుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. “మాట్లాడితే కడప పౌరుషం అంటారే! ఆ పౌరుషాన్ని పేదోళ్లపై కాదు, బాబాయి హంతకులపై చూపండి. నా 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఇంతటి క్రూరమైన నాయకుల్ని ఎన్నడూ చూడలేదు. రాష్ట్రం రావణకాష్టంలా మారుతోంది. మా కార్యకర్తల్ని చంపడం మీకు తెలిస్తే.. వారి అభిమానాన్ని గుండెల్లో నింపుకోవడం మాకు తెలుసు. గుర్తుపెట్టుకో జగన్! రోషం మీకే కాదు, మా ప్రతీ కార్యకర్తకీ ఉంది’ అంటూ చంద్రబాబు నిప్పులు చెరిగారు. లా అండ్ ఆర్డర్‌తో ఆడుకుంటే అదే వారి పతనానికి నాంది పలుకుతుందని పోలీసులను ఉద్దేశించి ఘాటుగా సూచించారు. “వైఎస్ హయాంలో పనిచేసిన ఎందరో ఐఏఎస్‌లు ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. తాత్కాలిక పదవుల్లో ఉండే నాయకుల మాట విని చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే రిటైర్ అయ్యాక కూడా ఆ అధికారుల కేసుల్ని వెలికితీస్తాం” అని హెచ్చరించారు. ప్రాణాలు అడ్డుపెట్టి అయినా కార్యకర్తల్ని కాపాడుకుంటామన్నారు. “నేను ఈ ముఠా కక్షలను పెంచి పోషించి ఉంటే సీమ ఎప్పుడో రూపురేఖలు కోల్పోయేది. ‘చలో ఆత్మకూరు’కు పిలుపిస్తే గుమ్మం దాటనివ్వకుండా ఆపేశారు. అమరావతి పరిశీలనకు వెళ్తే బస్సుపై రాళ్లు, చెప్పులు.. చివరకు లాఠీలు కూడా విసిరేయించి, అల్లరి మూకల నిరసనగా చిత్రీకరిస్తున్నారు. నన్ను, నా కార్యకర్తల్ని అణగదొక్కాలని ప్రయత్నిస్తున్న వైసీపీపై మేం ఒక్కసారి తిరగబడితే నిలబడగలరా?’ అని తీవ్రస్వరంతో ప్రశ్నించారు.

### దివ్యాంగుల మధ్య..

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసిన దివ్యాంగులు చంద్రబాబును కలిశారు. విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోటేశ్వరరావు, చంద్రదండు ప్రకాశ్ ఆధ్వర్యంలో పలువురు దివ్యాంగులు చంద్రబాబుతో కాసేపు మాట్లాడారు. వారి సమక్షంలో చంద్రబాబు కేక్ కట్ చేశారు. అనంతరం దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేశారు.

### ఎన్టీఆర్ ఫొటో కనిపిస్తే దాడులా?

ఆర్నెల్లలో కర్నూలు జిల్లాలోనే 33 మందికి పైగా కార్యకర్తల్ని వేధించి, కేసులు బనాయించి హింసించారని, ఈ లెక్కలు నానాటికీ పెరుగుతూనే ఉన్నాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యుడి ప్రాథమిక హక్కులైన స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యాన్ని హరించే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. “వాహనాలపై ఎన్టీఆర్, పరిటాల రవి, నావి ఫొటోలు కనిపించడమే పాపంగా వైసీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారు. మేం కూడా ఇలాగే ప్రవర్తిస్తే ఇప్పటి దాకా మిగిలి ఉండేవాళ్లా?” అని చంద్రబాబు నిప్పులు చెరిగారు.

### బాబాయి హత్య ఫైలు అంగుళం కదిలిందా?

మెదడు బయటకు వచ్చేలా వివేకానందరెడ్డిని నట్టింట్లో చంపేస్తే గుండెపోటు అని కాసేపు, టీడీపీ నాయకులే హత్య చేయించారని మరికాసేపు విమర్శలు చేసి, ఆర్నెల్ల అధికారంలో అంగుళమైనా ఆ ఫైల్ ఎందుకు కదల్చలేకపోయారని సీఎం జగన్‌ను చంద్రబాబు ప్రశ్నించారు. ప్రజల్ని పాలిస్తారని నమ్మి ఓట్లేస్తే ఆ ప్రజలపైనే కేసులు పెట్టించి, ప్రాణాలు తీయిస్తూ, వేడుక చూస్తున్నారని పత్తికొండ ఎమ్మెల్యే కె.శ్రీదేవి, ఆర్థిక మంత్రి బుగ్గనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత రోజులు టీడీపీకి మళ్లీ వస్తాయని, తిరిగి తాము అధికారంలోకి వచ్చాక ఆ ఇద్దరు నాయకులపై ఇలాగే ప్రవర్తిస్తే ఏమవుతారని ప్రశ్నించారు. ‘మీ పదవులు శాశ్వతం కాదు జాగ్రత్త’ అని చంద్రబాబు అన్నప్పుడు ప్రాంగణమంతా హర్షధ్వానాలతో మార్మోగింది.

### ఒక్కసారి వదిలితే..

‘మా పార్టీ అధికారంలోకి వచ్చాక మీ ఇళ్లపై పార్టీ జెండా ధైర్యంగా ఎగరేయగలరా? కట్టె కాలేవరకు మేం టీడీపీతోనే ఉంటాం. ఇంకే పార్టీకి ఓటేయబోం’ అంటూ ప్యాపిలి మండలానికి చెందిన చిన్ని కృష్ణ యాదవ్ అనే మరో బాధితుడు అన్నారు. కృష్ణ యాదవ్‌కు చంద్రబాబు సర్దిచెప్పారు. ‘చూశారా.. మా కార్యకర్తల్ని ఒక్క నిమిషం వదిలేస్తే ఏం చేస్తారో తెలుస్తుందా? కానీ, మా పార్టీ క్రమశిక్షణతో కూడుకున్నది. చట్టంపై గౌరవంతోనే ఇదంతా సహిస్తున్నాం” చంద్రబాబు పేర్కొన్నారు.

### దండే కాదు.. దణ్ణమూ పెట్టం

“ప్రమాణ స్వీకారం చేయకుండానే మా ఎమ్మెల్యే కక్ష సాధింపులకు దిగారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నా ఉద్యోగం తీసేశారు. నాపైన, నా కుటుంబంపైన బెదిరింపులకు దిగారు. మూడురోజులు నిద్రాహారాలు మాని నా తండ్రి బెంగపడ్డాడు. ప్రాణం పోయినా ఆ ఎమ్మెల్యేకి దండ కాదు కదా, దణ్ణం కూడా పెట్టొద్దని చెప్పి ఆయన చనిపోయాడు. పోయాక టీడీపీ జెండా కప్పాకే తనను పూడ్చమని చివరి కోరిక కోరాడు. మా రక్తం చివరి బొట్టు దాకా టీడీపీలోనే ఉంటాం”

-నాగరాజు, గోనెగండ్ల మండలం, కర్నూలు జిల్లా,



## శభాష్.. మిథు



గులాబీతో మిథాలీకి బర్త్‌డే విషెస్ చెబుతున్న తాప్సీ

### మిథాలీ బయోపిక్‌లో తాప్సీ

**న్యూఢిల్లీ:** భారత మహిళా స్టార్ క్రికెటర్ మిథాలీ రాజ్ జీవితకథ ఆధారంగా బాలీవుడ్‌లో సినిమా రానుంది. మిథాలీ పాత్రలో ప్రముఖ నటి తాప్సీ పన్ను నటించనుంది. మంగళవారం మిథాలీ 37వ పుట్టినరోజు సందర్భంగా తాప్సీ ఈ విషయాన్ని ప్రకటించింది. 'శభాష్.. మిథు' అనే పేరుతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాహుల్ ఢోలాకియా దర్శకత్వం వహించనున్నాడు. వయాకామ్ 18 స్టూడియో ఈ బయోపిక్‌ను నిర్మిస్తోంది. 'ఈ అవకాశం రావడం నాకు గర్వకారణం. నిన్ను నువ్వు తెరపై చూసుకున్నప్పుడు గర్వంగా ఫీలయ్యేలా చేస్తాను. అదే నేను నీకిచ్చే పుట్టినరోజు కానుక' అని మిథాలీని ఉద్దేశిస్తూ తాప్సీ ట్వీట్ చేసింది. ఈ సందర్భంగా మిథాలీతో కేక్ కట్ చేయిస్తున్న ఫొటోను కూడా పోస్ట్ చేసింది.

## ప్రతి సిరీస్‌లోనూ ఓ 'గులాబీ'

**సౌరవ్ గంగూలీ**

**న్యూఢిల్లీ:** ప్రయోగాత్మకంగా తొలిసారి భారత్‌లో నిర్వహించిన డే/నైట్ టెస్టు విజయవంతం అవడంతో భారత జట్టు మరిన్ని పింక్ బాల్ మ్యాచ్‌లు ఆడాలని బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ కోరుకుంటున్నాడు. అందులో భాగంగా ఇకనుంచి ప్రతి సిరీస్‌లోనూ ఓ గులాబీ టెస్టును ఆడించేలా ప్రతిపాదనలు చేయనున్నట్టు దాదా వెల్లడించాడు. 'ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళతా. ప్రతి టెస్టూ డే/నైట్ అంటే కుదరదు కానీ.. భారత్ ఆడే ప్రతి సిరీస్‌లోనూ కనీసం ఓ మ్యాచ్‌ను గులాబీ బంతితో ఆడించాలి. ఈ విషయంలో నా అనుభవాన్ని బోర్డుతో పంచుకుంటా. మిగతా వేదికల్లోనూ పింక్ టెస్టు ఆడేందుకు ప్రయత్నిస్తాం. కేవలం ఐదువేల మంది ప్రేక్షకుల ముందు టెస్టును ఆడాలని ఎవరూ కోరుకోరు. ఈడెన్ గార్డెన్స్‌లో ఆడిన తర్వాత గులాబీ టెస్టుకు ఇప్పుడు అంతా సిద్ధంగా ఉన్నారు' అని గంగూలీ వ్యాఖ్యానించాడు.

భార్యా పిల్లలతో మెస్సీ



## మెస్సీ 'సిక్సర్'

### ఆరోసారి బాలన్ డీ ఓర్ అవార్డుతో రికార్డు

**మాడ్రిడ్:** అర్జెంటీనా సాకర్ స్టార్ లియోనెల్ మెస్సీ రికార్డుస్థాయిలో ఆరోసారి బాలన్ డీ ఓర్ అవార్డును గెలుచుకున్నాడు. ఫ్రాన్స్ ఫుట్‌బాల్ సంఘం ప్రపంచ అత్యుత్తమ ఫుట్‌బాలర్‌కు ప్రతిఏటా ఇచ్చే ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం ఈ ఏడాది మెస్సీని వరించింది. ఈ అవార్డు కోసం పోటీపడ్డ పోర్చుగల్ హీరో క్రిస్టియానో రొనాల్డో, డచ్ ఆటగాడు వాన్ దిక్‌లను వెనక్కినెట్టి మెస్సీ విజేతగా నిలిచాడు. అవార్డు కోసం నిర్వహించిన ఓటింగ్‌లో రొనాల్డో మూడోస్థానానికి పడిపోగా, వాన్ దిక్ రెండోస్థానంతో సరిపెట్టుకున్నాడు. గతంలో ఐదుసార్లు (2009, 10, 11, 12, 2015) ఈ అవార్డు అందుకున్న 32 ఏళ్ల మెస్సీ.. 2015 తర్వాత ఈ పురస్కారం దక్కించుకోవడం ఇదే తొలిసారి. అమెరికాకు చెందిన మెగాన్ రాపినో అత్యుత్తమ మహిళా ఫుట్‌బాలర్ అవార్డును గెలుచుకుంది. 34 ఏళ్ల మెగాన్.. ఈ ఏడాది ప్రపంచకప్‌లో అమెరికా విజేతగా నిలవడంలో కీలకపాత్ర పోషించింది.



శ్రేయాస్ అయ్యర్

## చెప్పకుండా మార్చేశారు!

### బాక్సింగ్ లీగ్‌లో ఒడిశా నుంచి నార్త్‌ఈస్ట్‌కు నిఖత్



**న్యూఢిల్లీ:** ఇండియన్ బాక్సింగ్ లీగ్ వేలంలో తెలుగమ్మాయి నిఖత్ జరీన్‌ను ఒడిశా జట్టు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఆమెకు సమాచారం కూడా ఇవ్వకుండా గత ఆదివారం రాత్రికి రాత్రే ఒడిశా నుంచి నార్త్‌ఈస్ట్ జట్టు తీసుకుంది. ఈ విషయం సోమవారం మేరీకోమ్‌తో బౌట్ ముందు వరకు నిఖత్‌కు తెలియజేయకపోవడంతో మరోసారి వీరిద్దరి మధ్య వివాదం రాజుకుంది. 'ఫ్రాంచైజీ మార్పు విషయం మేరీతో బౌట్ ముందు వరకు నాకు తెలీదు. నా అనుమతి కూడా ఎవరూ తీసుకోలేదు. సవరించిన షెడ్యూల్ ప్రకారం మేరీతో బౌట్ ఈనెల 17న ఉంటుంది' అని నిఖత్ తెలిపింది. ఇక, మంగళవారం నార్త్‌ఈస్ట్ - బెంగుళూరు రైనోస్ జట్ల మధ్య జరిగిన పోరులో మహిళల 51 కిలోల బౌట్‌లో పింకీ రాణిపై నిఖత్ విజయం సాధించింది.

**వెస్టిండీస్‌తో మరో రెండ్రోజుల్లో మొదలవనున్న టీ20, వన్డే సిరీస్‌లకు పలువురు సీనియర్ ప్లేయర్ల ఎంపికను చూస్తే.. వచ్చే ఏడాది జరిగే పొట్టి వరల్డ్ కప్‌నకు సెలెక్టర్లు సన్నాహాలు చేస్తున్నట్టుగానే కనిపిస్తోంది. ఈ సిరీస్‌లో ప్రదర్శన ఆధారంగానే విశ్వ సమరానికి వీరి బెర్త్ ఖరారయ్యే అవకాశముంది. ఈ నేపథ్యంలో తమ సత్తా చాటేందుకు షమి, జడేజా, కుల్దీప్, రాహుల్ లాంటి సీనియర్లతో పాటు యువ ఆటగాడు శ్రేయాస్ అయ్యర్‌కు కరీబియన్లతో పోరు సువర్ణావకాశం కానుంది.**

### సెలెక్టర్ల పదవీ కాలం కుదింపు

**ముంబై:** భారత జట్టు చీఫ్ సెలెక్టర్‌గా ఎమ్మెస్కే ప్రసాద్ పదవీ కాలం ముగియనుంది. ప్రస్తుత సెలెక్టర్ల కాలపరిమితిని ఐదేళ్ల నుంచి నాలుగేళ్లకు తగ్గించేందుకు బీసీసీఐ కొత్త పాలకులు నిర్ణయం తీసుకోనున్నారు. భవిష్యత్తులో సెలెక్టర్ల పదవీకాలాన్ని నాలుగు నుంచి మూడేళ్లకు కుదించనున్నారు. బోర్డు రాజ్యాంగం ప్రకారం జాతీయ సెలెక్టర్ల పదవీ కాలాన్ని అప్పటి కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీవోఏ) నాలుగేళ్ల నుంచి ఐదేళ్లకు పెంచింది. ఇప్పుడు మళ్లీ అప్పటి స్థితిని పునరుద్ధరించాలని బీసీసీఐ బాస్‌లు భావిస్తున్నారు. కాగా, ప్రసాద్ స్థానాన్ని మాజీ స్పిన్నర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్‌తో భర్తీ చేసే అవకాశాలున్నట్టు సమాచారం.

# భలే చాన్సులే!

వాలీబాల్ మహిళల జట్టు





వెస్టిండీస్‌తో తొలి టీ20 కోసం మంగళవారం హైదరాబాద్ చేరుకున్న టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి



కుల్దీప్ యాదవ్

### డిపెండబుల్ ...

డిపెండబుల్ మిడిలార్డర్ బ్యాట్స్‌మన్‌గా శ్రేయాస్ అయ్యర్ వేగంగా ఎదుగుతున్నాడు. గత ఆరునెలల్లో అతడి ప్రదర్శన అద్భుతంగా ఉంది. దూకుడైన బ్యాట్స్‌మన్ నుంచి జట్టు అవసరాలకు తగ్గట్టుగా తన ఆటను మార్చుకున్న తీరు అతడిపై నమ్మకాన్ని పెంచుతోంది. టీమిండియా మిడిలార్డర్ ఇబ్బందులకు అయ్యర్ సరైన సమాధానమని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. వరల్డ్‌కప్ తర్వాత విండీస్ పర్యటనలో అయ్యర్ రెండు అర్ధ శతకాలతో సత్తా చాటాడు. ఆ తర్వాత సొంతగడ్డపై దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్‌లతో జరిగిన టీ20 సిరీస్‌ల్లో అటాకింగ్ బ్యాట్స్‌మన్ తరహా నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. ఐపీఎల్‌లో ఢిల్లీని ప్లే-ఆఫ్స్‌కు చేర్చి విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. విండీస్‌తో సిరీస్‌తో నాలుగో నెంబర్‌లో శ్రేయాస్ పాతుకుపోతాడేమో చూడాలి.

### విరామం తర్వాత..

దాదాపు తొమ్మిది నెలల విరామం తర్వాత లెఫ్టామ్ రిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు టీ20 జట్టులో చోటు దక్కింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో న్యూజిలాండ్‌తో సిరీస్‌లో కుల్దీప్ చివరిసారిగా ఆడాడు. అయితే, ఐపీఎల్‌లో పేలవ ప్రదర్శన అతడికి మైనస్‌గా మారింది. కోల్‌కతా నైట్‌రైడర్స్ తరఫున ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లో 4 వికెట్లు మాత్రమే పడగొట్టాడు. ఆ తర్వాత వరల్డ్‌కప్‌లోనూ కుల్దీప్ ఏమాత్రం ఆకట్టుకోలేక పోయాడు. కానీ, విండీస్‌తో జరిగే టీ20లు, వన్డే జట్లకు ఎంపిక కావడంతో జట్టులో తనస్థానాన్ని పదిలం చేసుకోవడానికి అతడికిదో సువర్ణావకాశం. చాహల్, కుల్దీప్ జోడీ మరోసారి ఆకట్టుకొనే అవకాశం ఉంది.



మహ్మద్ షమి

### స్పీడ్ 'స్టార్'గా ..

టెస్టుల్లో పేసర్ మహమ్మద్ షమి తిరుగులేని ఫామ్‌లో ఉన్నాడు. మరి వైట్ బాల్ క్రికెట్‌లోనూ షమి ఇదే తరహా ప్రదర్శన చేస్తాడో లేదో చూడాలి. ప్రస్తుతం బుమ్రా, నవ్‌దీప్ సైనీ గాయాల కారణంగా టీమ్‌కు దూరం కావడంతో డెత్ ఓవర్ల స్పెషలిస్ట్ కోసం టీమిండియా ఎదురు చూస్తోంది. ఇది షమికి వరంగా మారింది. 2014లో టీ20ల్లో అరంగేట్రం చేసిన షమి.. కేవలం ఏడు మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. వన్డేల్లో తన పాత పార్ట్‌నర్ భువనేశ్వర్ కుమార్‌తో కలసి షమి బంతిని పంచుకొనే అవకాశం ఉంది.



కేఎల్ రాహుల్

### లక్కీ మ్యాన్..

శిఖర్ ధవన్ గాయపడడంతో టాపార్డర్‌లో కేఎల్ రాహుల్‌కు లైన్ క్లియర్ అయింది. విండీస్‌తో సిరీస్‌లో రోహిత్ శర్మకు రాహుల్ ఆటోమేటిక్ చాయిస్ అయ్యాడు. పొట్టి క్రికెట్‌లో రాహుల్ 1000 పరుగులు సాధించాడు. ఓపెనర్‌గా వచ్చే అవకాశం ఉండడంతో రాహుల్ మరోసారి బ్యాట్‌తో ధనాధన్ ఇన్నింగ్స్ ఆడే చాన్సుంటుంది. ముస్తాక్ అలీ ట్రోఫీలో రాహుల్ ఆరు మ్యాచ్‌ల్లో సగటున 50 పరుగులకు పైగా స్కోరు చేశాడు.

### సువర్ణావకాశం..



రవీంద్ర జడేజా

విండీస్‌తో సిరీస్ రవీంద్ర జడేజాకు సువర్ణావకాశం. లెఫ్టామ్ స్పిన్నర్ కోసం వెదుకుతున్న టీమిండియా మేనేజ్‌మెంట్‌కు బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా జడేజా భరోసా ఇచ్చే చాన్సుంది. బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌లో క్రునాల్ పాండ్యా జట్టులోకి రావడంతో జడేజా బెంచ్‌కే పరిమితమయ్యాడు. కానీ, కరీబియన్లతో సిరీస్‌కు క్రునాల్ దూరం కావడంతో సత్తాచాటడానికి జడేజాకు మంచి అవకాశం. అయితే, టీమ్ కాంబినేషన్‌పైనే తుది జట్టులో జడ్డూకు స్థానం ఆధారపడి ఉంటుంది. కాగా, వన్డేలు, టీ20ల్లో జడేజా బ్యాటింగ్ ఎంతో మెరుగుపడింది. విండీస్‌తో సిరీస్ జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి అతడికి ఎంతో ఉపయోగపడనుంది.

## రెండోరోజు 27 పతకాలు

- **షూటింగ్, వాలీబాల్‌లో భారత్ హవా**
- **దక్షిణాసియా క్రీడలు**

**ఖట్మాండు:** దక్షిణాసియా క్రీడల్లో (సాగ్) భారత క్రీడాకారుల జోరు కొనసాగుతోంది. వరుసగా రెండోరోజూ పతకాల మోత మోగించారు. మంగళవారం ఒక్కరోజే ఏకంగా 27 పతకాలు కొల్లగొట్టారు. ఇందులో 11 స్వర్ణాలుండడం విశేషం. షూటర్లు నాలుగు స్వర్ణాలు, నాలుగు రజతాలు, ఓ కాంస్యంతో కలిపి మొత్తం తొమ్మిది పతకాలు అందించారు. వాలీబాల్ పురుషులు, మహిళల జట్లు ఫైనల్స్‌లో తమ ప్రత్యర్థులను ఓడించి చాంపియన్లుగా నిలిచాయి. తైక్వాండో క్రీడాకారులు వరుసగా రెండోరోజూ తమ హవా చాటుతూ ఓ స్వర్ణం, మూడు కాంస్యాలు నెగ్గారు. టేబుల్ టెన్నిస్‌లో పురుషులు, మహిళల టీమ్ విభాగాల్లో పసిడి పతకాలు దక్కాయి. ఇక.. అథ్లెటిక్స్‌లో మనోళ్లు గ్రాండ్‌గా శుభారంభం చేశారు. మూడు స్వర్ణాలతో కలిపి పది బంగారు పతకాలు గెలుచుకున్నారు. రెండ్రోజులు ముగిసేసరికి భారత్ 43 పతకాల (18 స్వర్ణాలు, 16 రజతాలు, 9 కాంస్యాలు)తో రెండోస్థానంలో కొనసాగుతోంది.

**క్వార్టర్స్‌లో గాయత్రి, సిక్కి:** బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్లలో స్వర్ణాలు కొల్లగొట్టిన భారత షట్లర్లు వ్యక్తిగత ఈవెంట్లలోనూ పతకాల దిశగా దూసుకెళుతున్నారు. మహిళల సింగిల్స్‌లో తెలుగమ్మాయి గాయత్రి గోపీచంద్ 21-9, 21-14తో నాన్‌జాల్ తమాంగ్ (నేపాల్)ను ఓడించి క్వార్టర్‌ఫైనల్ చేరింది. మహిళల డబుల్స్‌లో సిక్కిరెడ్డి-మేఘన జోడీ 21-11, 21-10తో మాల్దీవులు జంట నీలా అహ్మద్-మైసా ఫతుల్లాపై గెలుపొంది క్వార్టర్స్‌లో ప్రవేశించింది.

## అండర్ డాగ్స్‌మే కానీ..: పొలార్డ్

ఉప్పల్ స్టేడియంలో వెస్టిండీస్ క్రికెటర్ల ప్రాక్టీస్



**న్యూఢిల్లీ:** భారత్‌తో సిరీస్‌లో వెస్టిండీస్‌ను అండర్ డాగ్‌గా పరిగణించినా తానేమీ పట్టించుకోనని ఆ టీమ్ కెప్టెన్ కీరన్ పొలార్డ్ అన్నాడు. కానీ, ఆటలో ఏదైనా జరగొచ్చని చెప్పాడు. మెరుగైన ఫలితాల కోసం ప్రాథమిక అంశాలపై దృష్టిసారించామన్నాడు. 'భారత్ లాంటి బలమైన జట్టుతో తలపడుతున్నాం. టాలెంట్‌పై నమ్మకం ఉంచి.. సరైన సమయంలో ప్రదర్శించగలిగితే ఏదైనా సాధ్యమేన'ని పొలార్డ్ అన్నాడు. శుక్రవారం జరిగే టీ20తో విండీస్ పర్యటన ఆరంభం కానుంది. ఇటీవల అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను విండీస్ కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో నిలకడగా విజయాలు సాధించడానికి మరింత శ్రమించాల్సిన అవసరం ఉందని పొలార్డ్ చెప్పాడు. అనుకోకుండా కెప్టెన్సీ వరించినా అది సవాళ్లతో కూడుకున్నదేనన్నాడు.



హైదరాబాద్‌లో మంగళవారం తెలంగాణ గవర్నర్ తమిళిసైని కలిసి తన వివాహ శుభలేఖను అందజేస్తున్న భారత మాజీ కెప్టెన్ అజరుద్దీన్ కుమారుడు అసదుద్దీన్. సానియా మీర్జా చెల్లెలు ఆనమ్‌తో అసదుద్దీన్ పెళ్లి ఈనెల 11న హైదరాబాద్‌లో జరగనుంది. చిత్రంలో సానియా తండ్రి ఇమ్రాన్ మీర్జా ఉన్నారు.

## నాన్న వల్లే ఇంత వాడినయ్యా!



ప్రియమ్ గార్గ్

**లఖ్‌నవ్:** తన తండ్రి త్యాగాలు లేకుండా తాను భారత జట్టుకు నాయకత్వం వహించే స్థాయికి ఎదగగలిగే వాడిని కాదని భారత క్రికెట్ అండర్-19 వరల్డ్‌కప్ టీమ్ కెప్టెన్ ప్రియం గార్గ్ అన్నాడు. 'నాన్న నరేష్ స్కూల్ వ్యాను డ్రైవర్. నాకు అన్నయ్య, ముగ్గురు అక్కలు ఉన్నారు. ఇంట్లో నేనే చిన్నవాడిని. ఇంతమందిని పోషిస్తూ నా క్రికెట్ శిక్షణకు ఖర్చు చేసేంత స్థోమత ఆయనకు లేద'ని ప్రియం చెప్పాడు. కానీ, ఆటపట్ల తనకున్న ఇష్టాన్ని గుర్తించి.. అప్పుచేసి మరీ క్రికెట్ కిట్ కొని తెచ్చాడని గుర్తు చేసుకున్నాడు. ఆయన పడిన కష్టం వల్లే ఈ రోజు తాను అండర్-19 జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యానన్నాడు. అయితే, ప్రియంకు పదకొండేళ్ల వయసులో తల్లి దూరమైంది. తాను భారత జట్టు తరఫున ఆడుతుండగా చూడాలనేది అమ్మ కోరికని ప్రియం ఎంతో భావోద్వేగానికి లోనయ్యాడు.

## కివీస్-ఇంగ్లండ్ రెండో టెస్టు డ్రా

### 1-0తో సిరీస్ విలియమ్స్ సేన కైవసం

**హామిల్టన్:** రాస్ టేలర్ (105 నాటౌట్), కెప్టెన్ కేన్ విలియమ్సన్ (104 నాటౌట్) అజేయ సెంచరీలతో రాణించడంతో.. ఇంగ్లండ్-న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టు డ్రాగా ముగిసింది. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను కివీస్ 1-0తో కైవసం చేసుకుంది. వర్షం కారణంగా చివరి రోజైన మంగళవారం కేవలం 38 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. టేలర్, విలియమ్సన్ శతకాలతో మెరవడంతో.. ఓవర్‌నైట్ స్కోరు 96/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ వర్షంతో ఆట నిలిపివేసే సమయానికి 241/2తో నిలిచింది. టేలర్, విలియమ్సన్ మూడో వికెట్‌కు 145 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే లంచ్ తర్వాత వర్షం కారణంగా కేవలం 5 ఓవర్ల ఆటే సాగింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 375, ఇంగ్లండ్ 476 పరుగులు చేశాయి.

**న్యూజిలాండ్‌కు ఎంసీసీ అవార్డు:** ఈ ఏడాది ఇంగ్లండ్‌లో జరిగిన ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో అద్భుతమైన ప్రదర్శనతో రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ జట్టును 'ఎంసీసీ స్పిరిట్ ఆఫ్ ద క్రికెట్' అవార్డు వరించింది. ఇంగ్లండ్‌తో రెండో టెస్టు ముగిసిన అనంతరం కివీస్‌కు ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ అవార్డు పొందడానికి కివీస్ జట్టు అన్ని విధాలా అర్హమైనదని ఎంసీసీ అధ్యక్షుడు కుమార సంగక్కర చెప్పాడు. రసవత్తరంగా సాగిన ఆ ఉత్కంఠ పోరులో బ్లాక్ క్యాప్స్ అమోఘమైన క్రీడాస్ఫూర్తిని కనబరచిందని ప్రశంసించాడు.

# నౌకాదళానికి నిధుల తగ్గింపా?

**ఆధునికీకరణకు కేటాయింపులు పెంచాలి.. చైనా కార్యకలాపాలను విస్తరిస్తోంది**

**ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొంటాం.. నేవీ చీఫ్ అడ్మిరల్ సింగ్ వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ, డిసెంబరు 3: పొరుగు దేశం చైనా తన నౌకాదళాన్ని రోజురోజుకు విస్తరిస్తుండగా.. మన నౌకాదళానికి మాత్రం కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపును తగ్గించేసింది! రక్షణ బడ్జెట్‌లో నౌకాదళానికి నిధుల కేటాయింపును తగ్గించడంపై నేవీ చీఫ్ అడ్మిరల్ కరంబీర్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. 2012-13లో 18 శాతంగా ఉన్న కేటాయింపు 2018-19లో 13 శాతానికి తగ్గిపోవడం గమనార్హం. నేవీ డే సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అడ్మిరల్ సింగ్ మాట్లాడుతూ.. చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన నౌక సెప్టెంబరులో భారత జలాల్లోకి ప్రవేశించగా వెంటనే మన నౌకాదళం తిప్పి పంపిందని తెలిపారు. భారత ప్రత్యేక ఎకనామిక్ జోన్‌లోకి చైనా నౌక ప్రవేశించిందన్నారు. ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమని చెప్పారు. నౌకాదళ దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా మూడు విమానవాహక నౌకలను హిందూ మహాసముద్ర తీర ప్రాంతాల్లో మోహరించనున్నట్లు వెల్లడించారు. వీటిలో రెండు నౌకలు ఇప్పటికే సిద్ధమయ్యాయన్నారు. దేశీయంగా తయారు చేసిన విమాన వాహక నౌక 2022 నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. హిందూ మహాసముద్ర జలాల్లో చైనా కార్యకలాపాలను విస్తరిస్తోందన్న సింగ్.. ఎలాంటి సవాళ్లను ఎదుర్కొనేందుకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. నౌకాదళాన్ని ఆధునికీకరించేందుకు మరిన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు.

# అమ్మో... 'ఆకాశ్'!

**కదలదు, మెదలదు, పేలదు**

**ఈ క్షిపణిని నమ్ముకోలేం**

**రక్షణ శాఖకు స్పష్టీకరణ**




న్యూఢిల్లీ, డిసెంబరు 3: అది... ఆకాశ్ క్షిపణులు అమర్చిన వాహనం. వైమానిక దళ కేంద్రంలో నిలిపి ఉంచిన ఆ వాహనం టైరు ఉన్నట్టుండి పేలిపోయింది. ఆ తాకిడికి టైరును బిగించిన బోల్టులు కూడా ఊడిపోయాయి! ఇది చూసి వైమానిక దళ అధికారులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ సంఘటన గత ఏడాది జూన్ 3న జరిగింది. ఆ తర్వాత కొన్నాళ్లకు... 'ఆకాశ్' డమ్మీ క్షిపణులకు అమర్చిన ఎయిర్ క్యాపులకు చీలికలు ఉన్నట్లు మరో స్క్వాడ్రన్ సిబ్బంది గుర్తించారు. గత ఏడాది 'క్రాస్‌బో-18' పేరిట వైమానికదళం చేసిన విన్యాసాల్లో 'ఆకాశ్'ను ప్రయోగించారు. కానీ, క్షిపణి ఆకాశంలోకి ఎగరనే లేదు! నింగిలో 30 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను భూమిపై నుంచి ఛేదించేందుకు రూపొందించిన 'ఆకాశ్' క్షిపణి పరిస్థితి ఇది! ఈ క్షిపణులను 2013-15 మధ్య సైన్యానికి అప్పగించారు. అయితే... క్రాక్‌లు, లీక్‌లు, టైరు పేలిపోవడం, బోల్టులు ఊడి రావడం, విడి భాగాలు మొరాయించడం... ఇలా ఆకాశ్‌లో వివిధ దశల్లో అనేక లోపాలను గుర్తించారు. యుద్ధ సమయాల్లో దీనిని నమ్ముకోలేమని రక్షణ సిబ్బంది స్పష్టం చేసినట్లు తెలిసింది. దీనిపై ఒక వార్తా సంస్థ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఆకాశ్ క్షిపణి వ్యవస్థకు ప్రైవేటు తయారీదారులు నాసిరకం ఉపకరణాలను సరఫరా చేశారని... ఈ లోపాలను డీఆర్‌డీఎల్, బీడీఎల్, బీఈఎల్ వంటి సంస్థలు రక్షణ శాఖకు చెప్పకుండా దాచాయని అధికారులు చెబుతున్నారు. "ఆకాశ్‌లో అనేక లోపాలు తలెత్తుతున్నాయి. ఈ క్షిపణులపై ఆధారపడలేం" అని వైమానిక దళ ఆయుధాల నిర్వహణ విభాగం గత ఏడాదే స్పష్టం చేసినట్లు తెలిసింది. ఆకాశ్‌ను యుద్ధ సమయంలో నమ్ముకోలేమని 2017లోనే 'కాగ్' తన నివేదికలో తెలిపింది. ఇప్పుడు అదే నిజమైంది.

## ఆరుగురు పిల్లలు.. ఆకలి బాధకు మట్టి తింటున్నారు

» కేరళలో నిరుపేద తల్లి దైన్యం

తిరువనంతపురం, డిసెంబరు 3: పేగులను మెలిపెట్టేంత ఆకలి బాధ ఎంత నరకప్రాయమో ఆ ఆరుగురు చిన్నారులకే తెలుసేమో! ఎందుకంటే, భరించలేని ఆకలి మంటను చల్లార్చుకునేందుకు ఆ పిల్లలు మట్టిని, బురదను తింటున్నారు. తాగుడుకు బానిసై తండ్రి బాధ్యతను మరిస్తే, పిల్లలపై గుండెల నిండు గా ప్రేమ ఉన్నా వారికి గుప్పెడు మెతుకులు పెట్టలేని పేదరికం ఆ తల్లిది. ఏడు, ఐదేళ్లున్న ఇద్దరు బాబులు.. నాలుగు, రెండేళ్లున్న ఇద్దరు పాపలు.. మూడు నెలలు, నెలన్నర వయసున్న ఇద్దరు చిన్నారులున్నారు. కేరళ తిరువనంతపురం సమీపంలోని ఓ రైల్వే ట్రాక్ పక్కన చిన్న గుడారంలో నివసిస్తున్నారు. 'నా పిల్లలకు తిండి పెట్టలేకపోతున్నాను. ఆకలైనప్పుడు వారు మట్టిని తింటున్నారు' అంటూ శిశు సంరక్షణ సమితికి ఆ తల్లి లేఖ రాసింది. ఇది కేరళ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనపై తిరువనంతపురం మేయర్ వెంటనే స్పందించి ఆమెకు తాత్కాలిక ఉద్యోగం కల్పించారు. నిరుపేదల కోసం 'లైఫ్ మిషన్' పథకం కింద నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లలో ఆ కుటుంబానికి ఒక ఫ్లాట్‌ను కేటాయించారు.

## మృతదేహాన్ని కోయకుండానే పోస్ట్‌మార్టమ్

మృతదేహానికి పోస్ట్‌మార్టమ్ చేయాలంటే దానిని కొయ్యాల్సిందే! ఈ ప్రక్రియ పూర్తికి సుమారు మూడు గంటలు పడుతుంది. ఇకపై మృతదేహాన్ని కోయనవసరం లేకుండానే పోస్ట్‌మార్టమ్ చేసే విధానాన్ని ఆరు నెలల్లో అమల్లోకి తీసుకురానున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రి హర్షవర్ధన్ రాజ్యసభకు వెల్లడించారు. కొత్త విధానంలో అరగంటలో పోస్ట్‌మార్టమ్ పూర్తి చేయవచ్చని తెలిపారు. ఈ విధానాన్ని ముందుగా ఎయిమ్స్‌లో అమలు చేస్తామన్నారు.

## రాళ్లతో కొట్టి.. పెట్రోలు పోసి తగలబెట్టి

» ఒంగోలులో తల్లీకూతుళ్ల దారుణహత్య

ఒంగోలు క్రైం, డిసెంబరు 3: తల్లీకూతుళ్లను రాళ్లతో కొట్టి చంపి ఆపై పెట్రోలు పోసి తగలబెట్టిన ఘటన ఒంగోలు సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. పేర్నమిట్ట నుంచి మద్దిపాడు మండలం మారెళ్లగుంటపాలెం వెళ్లే దారిలో యువతి, ఏడాది పాప మంటల్లో తగలబడుతున్నట్టు మంగళవారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఒంగోలు తాలూకా, మద్దిపాడు పోలీసులు అప్రమత్తమై సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ రెండు మృతదేహాలు కాలిపోయి ఉన్నాయి. పంజాబీ డ్రస్‌లో మహిళకు 25 ఏళ్లు ఉంటాయని, ఆమె కుమార్తెకు ఏడాది వయస్సు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

## లబ్ధిదారుల మేలు కోసమే..

» వలంటీర్ల వేలిముద్రలపై శ్రీకాకుళం జేసీ వెల్లడి

» 'ఆంధ్రజ్యోతి' కథనంపై వివరణ

శ్రీకాకుళం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారుల మేలు కోసమే వలంటీర్లు వేలిముద్రలు వేసి రేషన్ అందించారని శ్రీకాకుళం జిల్లా సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో 'ముద్ర ఎవరిది... ముద్ద ఎవరికి?' అన్న కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. వలంటీర్ల ద్వారా కార్డుదారుల ఇంటికే రేషన్ పంపిణీ ప్రక్రియకు శ్రీకాకుళం జిల్లాను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిందని చెప్పారు. మారుమూల గిరిజన గ్రామాల్లో సిగ్నల్స్ అందనిచోట్ల లబ్ధిదారుల మేలు కోసమే కొందరు వలంటీర్లకు వేలిముద్రలు వేసి బియ్యం అందించేందుకు అనుమతి ఇచ్చామని వివరించారు.



## తాబేళ్ల కోసం డీఆర్‌డీవో అసాధారణ నిర్ణయం

» క్షిపణి పరీక్ష కేంద్రంలో లైట్లు ఆర్పివేత

కేంద్రపరా, డిసెంబరు 3: ఆలివ్ రిడ్లీ తాబేళ్ల కోసం భారత అంతరిక్ష పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) అసాధారణ నిర్ణయం తీసుకుంది. ఈ సీజన్‌లో ఏటా ఒడిసా తీరానికి వచ్చే ఈ తాబేళ్లు సంతాన వృద్ధి కోసం గుడ్లు పెడుతుంటాయి. ఇక్కడే డీఆర్‌డీవో క్షిపణి పరీక్షా కేంద్రం కూడా ఉంది. ఈ ప్రాంతంలో రాత్రంతా శక్తిమంతమైన లైట్లు వెలుగులు పరుస్తుంటాయి. దీంతో ఆడ తాబేళ్లు తమ దిశను మార్చుకోవడంతో పాటు.. క్షిపణి కేంద్రం వైపు వస్తున్నాయని అధికారులు తెలిపారు. దీంతో తాబేళ్ల సంరక్షణ కోసం అబ్దుల్ కలాం ఐలాండ్‌ను కాంతివంతంగా ఉంచబోమని డీఆర్‌డీవో ప్రకటించింది.

# రైలు చార్జీల పెంపు!

## మెయిల్స్, ఎక్స్‌ప్రెస్‌లలో 5-10% వరకు

» పార్లమెంటు సమావేశాల తర్వాతే ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబరు 3: రైళ్లలో ప్రయాణికుల చార్జీలు పెరిగే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఆర్థిక మాంద్యం ప్రభావం ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతుండడంతో ఈ దిశగా రైల్వే బోర్డు అడుగులు వేస్తోంది. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో 5 నుంచి 10% వరకు చార్జీలు పెంచవచ్చని రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరుగుతున్నందున చార్జీల ప్రకటన ఉండకపోవచ్చు. అవి ముగిశాక ప్రకటించే అవకాశాలున్నాయి. మోదీ సర్కారు వచ్చిన తర్వాత తొలిసారి 2014 జూన్ 25న చార్జీలు పెంచారు. అప్పట్లో ప్రయాణికుల చార్జీలు 14.2% పెరగగా.. రవాణా చార్జీలను 6.5 శాతానికి పెంచారు. ఇప్పుడు పెంచితే ఐదున్నరేళ్లలో పెంపు రెండో సారి అవుతుంది.



**ఏప్రిల్-అక్టోబరు మధ్య ఆదాయం (రూ.కోట్లలో)**

| చార్జీలు | లక్ష్యం | రాబడి | తేడా |
|---|---|---|---|
| ప్రయాణికులు | 32,681.10 | 30,715.10 | 1,966 |
| సరుకు రవాణా | 77,615.89 | 62,733.17 | 14,882.72 |
| మొత్తం ఆదాయం | 1,18,634.69 | 99,222.72 | 19,411.97 |

### ఏసీ రైళ్లతో లాభమే: కాగ్

ఏసీ రైళ్లు ఆదాయ వనరుగా మారాయని కాగ్ వెల్లడించింది. మెయిల్స్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఉండే ఏసీ త్రీ టైర్‌తో పాటు ఇవి కూడా లాభసాటిగా మారాయని పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో వెల్లడించింది. '2016-17లో ఏసీ త్రీటైర్, ఏసీ ఛైర్‌కార్‌లతో పోల్చితే మిగతా సర్వీసుల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఏసీ సర్వీసులు ఆ నష్టాన్ని పూడ్చాయి' అని తెలిపింది.

### నష్టాల తీరిలా

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబరు చివరి వరకు రూ.1,18,634.69 కోట్ల రాబడిని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకోగా.. రూ.99,222.72 కోట్లు మాత్రమే వచ్చాయి. రూ.19,411.97 కోట్లు తగ్గిందన్న మాట. ఖర్చులు కూడా లక్ష్యాన్ని మించి ఇప్పటికే రూ.4 వేల కోట్లు దాటిపోయాయి. పండుగల సీజన్లో ప్రత్యేక రైళ్లను ఎక్కువ సంఖ్యలో నడిపినా పెద్దగా లాభం లేకపోయింది. ప్రయాణికేతర ఆదాయమైన వాణిజ్య ప్రకటనలు, స్టేషన్ల పునరాభివృద్ధి నుంచి ఆశించిన స్థాయిలో రాబడి రాలేదు.

- ఈ ఏడు నెలల్లో రూ.97,264.73 కోట్లు వ్యయం చేయాల్సి ఉండగా.. దానికి మించి ఇప్పటికే రూ.4,099 కోట్ల మేర పెరిగి రూ.1,01,363.90 కోట్లకు చేరింది.
- ప్రయాణికుల చార్జీల రూపంలో రూ.32,681.10 కోట్లు ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. రూ.30,715.10 కోట్లు మాత్రమే వచ్చాయి. అంటే రూ.1,966 కోట్లు తగ్గింది.
- సరుకు రవాణా ఆదాయమే రైల్వే శాఖకు కీలకం. ఇది భారీగా పడిపోయింది. రూ.14,882.72 కోట్ల లోటు ఏర్పడింది. అయితే ఆర్థిక మాంద్యం కారణంగా పరిశ్రమలు పడకేశాయని.. దీనిప్రభావం సరుకు రవాణాపైనా పడిందని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి.
- ఆదాయాన్ని దాటి ఖర్చు పెరుగుతోందని.. ఆపరేటింగ్ నిష్పత్తి ఈ ఆర్థిక సంవత్సరంలో 100 శాతం మార్కును దాటుతుందని 'ఆర్థిక పనితీరు నివేదిక' చెబుతోంది. రైల్వే శాఖ ఆర్థిక పరిస్థితి రానురాను క్షీణిస్తోందనడానికి ఇది సంకేతం. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) 2017-18 సంవత్సరానికి పార్లమెంటుకు సోమవారం సమర్పించిన నివేదికలో కూడా ఆదాయం-వ్యయాల ఆపరేటింగ్ నిష్పత్తి 98.44 శాతానికి చేరినట్లు తెలిపింది. గత పదేళ్లలో ఇదే అత్యంత అధమమని వెల్లడించింది. రైల్వే వ్యాగన్ల కోసం డిమాండ్ పూర్తిగా తగ్గిపోయింది. దీంతో 10,500 వ్యాగన్ల సేకరణ లక్ష్యాన్ని తాజాగా 1,860 వ్యాగన్లకు తగ్గించింది. డిమాండ్ తగ్గడంతో రూ.4 వేల కోట్లకు పైగా ఆదాయానికి గండిపడింది.

## జూన్ నుంచి 'ఒకే దేశం ఒకే రేషన్ కార్డు'

» రాజ్యసభలో ఎస్పీజీ బిల్లుకు ఆమోదం



న్యూఢిల్లీ, డిసెంబరు 3: ఒకే దేశం-ఒకే రేషన్ కార్డు విధానాన్ని వచ్చే ఏడాది జూన్ 1 నుంచి అమలు చేస్తామని కేంద్ర మంత్రి రామ్‌విలాస్ పాసవాన్ వెల్లడించారు. వలస కార్మికులు, బ్లూకాలర్ వర్కర్లకు ఈ నిర్ణయం ఉపయుక్తంగా ఉంటుందని మంగళవారం ఆయన లోక్‌సభలో చెప్పారు. వలస కార్మికులు తమకు అందుబాటులో ఉన్న రేషన్ దుకాణాల్లో సరుకులు తీసుకోవచ్చని వివరించారు. 'అన్ని సేవలకు ఒకే కార్డు' అనే ఆలోచన లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్‌రాయ్ వెల్లడించారు. ఎస్పీజీ చట్టం సవరణ బిల్లును రాజ్యసభ ఆమోదించింది.

## ఉద్యోగాల భర్తీకి ఒకే సంస్థ... ఒకే పరీక్ష

» గ్రూప్ బీ, సీ పోస్టులపై కేంద్రం ప్రతిపాదన



అన్ని గ్రూపు బీ, సీ పోస్టుల విషయంలో కేంద్రం కీలక ప్రతిపాదన చేసింది. వీటిని ఒకే సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి అర్హత పరీక్ష (సీఈటీ) ద్వారా భర్తీ చేయాలని భావిస్తున్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర తెలిపారు. ప్రస్తుతం గ్రూపు బీ గెజిటెడ్ పోస్టులకు నియామక ప్రక్రియను యూపీఎస్సీ చేపడుతోంది. గ్రూపు బీలో నాన్-గెజిటెడ్, కొన్ని గెజిటెడ్ పోస్టులు, గ్రూపు సీ, వీటికి సమానమైన పోస్టుల భర్తీకి ప్రత్యేక సంస్థ ఏర్పాటు చేస్తారు.

## అమ్మాయిలకు ధైర్యమే ఆయుధం

» ఇంటర్నెట్‌ను అవసరమైన మేరకే ఉపయోగించండి

» 'బీసేఫ్' యాప్ ఆవిష్కరించిన హోంమంత్రి సుచరిత



మహిళా స్టేషన్‌లో బాధితుల సమస్యలను వింటున్న సుచరిత

విజయవాడ(ఆంధ్రజ్యోతి)/గుంటూరు, డిసెంబరు 3: ఆపదలు, విపత్కర పరిస్థితుల్లో అమ్మాయిలు ధైర్యంగా వ్యవహరించాలని హోంమంత్రి మేకతోటి సుచరిత సూచించారు. వివిధ రకాల పోలీసు సేవలు, భద్రత చర్యలపై మహిళలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన 'బీసేఫ్' యాప్‌ను విజయవాడలో స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి తానేటి వనిత, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మతో కలసి హోంమంత్రి మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం సుచరిత మాట్లాడుతూ చిక్కుల్లో పడకుండా ఇంటర్నెట్‌ను అవసరమైనంత వరకే ఉపయోగించుకోవాలన్నారు. డీజీపీ గౌతమ్ సవాంగ్ మాట్లాడుతూ ఆపద సమయంలో అమ్మాయిలకు 100, 181, 112 నంబర్లు వెంటనే గుర్తుకు రావాలన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో సైబర్ వారియర్ గ్రూపులు ఏర్పడాలని, ఒక్కో యువతి ఒక్కో వారియర్‌గా తయారు కావాలని పిలుపునిచ్చారు. గుంటూరులోని మహిళా పోలీస్‌స్టేషన్‌ను కూడా సుచరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు.

### టోల్ గేట్ల వద్ద సాయుధ బలగాలు!

రాష్ట్రవ్యాప్తంగా టోల్‌గేట్ల వద్ద సాయుధ పోలీసులను నియమించాలని పోలీస్‌శాఖ భావిస్తోంది. హైదరాబాద్‌లో 'దిశ' ఘటన నేపథ్యంలో ఈ చర్యలకు ఉపక్రమించనుంది. దీనిపై సీఎం నిర్ణయానుసారం వ్యవహరించనుంది.

## పౌరసత్వ సవరణ బిల్లుకు తుదిరూపు

### నేడు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర

న్యూఢిల్లీ, డిసెంబరు 3: జమ్మూకశ్మీరులో ఆర్టికల్ 370ని నిర్వీర్యం చేసిన తర్వాత కేంద్రం మరో కీలక నిర్ణయానికి రంగం సిద్ధం చేసింది. గతంలో ప్రవేశపెట్టిన పౌరసత్వ(సవరణ) బిల్లుకు తుదిరూపు నిచ్చింది. కేంద్ర మంత్రివర్గం బుధవారం ఉదయం 9-30 గంటలకు సమావేశమై ఈ బిల్లుకు ఆమోదముద్ర వేస్తుంది. ఆ వెంటనే దీనిని పార్లమెంటులో హోంమంత్రి అమిత్ షా ప్రవేశపెడతారు. ఏ కారణాల చేతనైనా బుధవారం ప్రవేశపెట్టలేకపోతే ఒకట్రెండు రోజుల్లోనే తేవడం ఖాయం. ఈ దిశగా రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంకేతాలు ఇచ్చారు. బిల్లును ప్రవేశపెట్టే సమయంలో సభలో తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన మంగళవారం జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలకు స్పష్టం చేశారు. ఈ బిల్లు మతపరమైన లక్ష్యాలతో రూపొందించినది కాదని, ఇందులో భారతీయతే ఉందని ఆయన పేర్కొన్నారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌ల్లో మతపరమైన వేధింపులకు గురయ్యే ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. ఏ రకమైన పత్రాలు లేకపోయినా వారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. భారత్‌లో 11 ఏళ్లు తప్పనిసరిగా నివసించి ఉండాలన్న నిబంధన గతంలో ఉండేది. దానిని ఇప్పుడు ఆరేళ్లకు తగ్గించినట్లు సమాచారం. 1955నాటి పౌరసత్వ బిల్లు స్థానే దీన్ని తెస్తున్నారు. ఈ బిల్లుపై ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది.

# విక్రమ్ జాడ తెలిసింది!

చెన్నై(ఆంధ్రజ్యోతి)/శ్రీహరికోట, డిసెంబరు 3: భారీ అంచనాలతో చంద్రుని దిశగా దూసుకెళ్లిన చంద్రయాన్-2 చివరి దశలో విఫలమైంది. సెప్టెంబరు 7న విక్రమ్ ల్యాండర్ జాబిల్లి ఉపరితలాన్ని ఢీకొట్టి కుప్పకూలింది. దాని జాడ కోసం ఇటు ఇస్రో, అటు నాసా మూడు నెలలుగా శ్రమిస్తూనే ఉన్నాయి. అయినా ఫలితం దక్కలేదు. అయితే చెన్నైకి చెందిన ఇంజనీర్ షణ్ముగ సుబ్రమణియన్ ఇచ్చిన ఆధారంతో అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) విక్రమ్ జాడను గుర్తించింది. నాసాకు చెందిన లూనార్ రీకనైసాన్స్ ఆర్బిటర్ (ఎల్ఆర్‌వో) విక్రమ్ శకలాల వలన చంద్రుని ఉపరితలంపై ప్రభావితమైన ప్రదేశాలను స్పష్టంగా గుర్తించింది. చెన్నైకి చెందిన మెకానికల్ ఇంజనీర్ షణ్ముగ అందించిన సమాచారంతోనే ఇది సాధ్యమైందని నాసా పేర్కొంది. సుబ్రమణియన్ విక్రమ్‌కు సంబంధించిన తొలి శకలాన్ని గుర్తించారని, దీంతో ఎల్ఆర్‌వో బృందానికి ఇతర శకలాలు గుర్తించడం తేలికైందని పే ర్కొంది. ఈ మేరకు మంగళవారం అందుకు సంబంధించిన కొన్ని చిత్రాలను విడుదల చేసింది.

### ఎలా గుర్తించారు..?

విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై కుప్పకూలిన తర్వాత దాని జాడ కోసం వెతికే క్రమంలో లూనార్ రీకనైసాన్స్ ఆర్బిటర్‌కు ఉన్న కెమెరాతో నాసా కొన్ని చిత్రాలు తీసి వాటిని సెప్టెంబరు 17న విడుదల చేసింది. ఆ సమయంలో ల్యాండర్ దిగాల్సిన ప్రాంతం చీకటిగా ఉండడంతో దాని ఆనవాళ్లను గుర్తించలేకపోయింది. అయితే విక్రమ్ ప్రయోగానికి ముందు జూలై 16న తీసిన చిత్రాలను, సెప్టెంబరు 17న తీసిన చిత్రాలను నాసా తన వెబ్‌సైట్‌లో పెట్టి.. ఈ ఫొటోల ఆధారంగా విక్రమ్ ల్యాండర్ పడిన చోటును ఎవరైనా గుర్తించి తమకు పంపవచ్చని ప్రకటించింది. అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి ఉన్న షణ్ముగ సుబ్రమణియన్.. ఆ ఫొటోలను డౌన్‌లోడ్ చేసుకుని వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. చంద్రుని ఉపరితలంపై ఉబ్బెత్తుగా ఉన్న ప్రాంతాన్ని గుర్తించి అక్కడే విక్రమ్ జాబిల్లిని ఢీకొట్టి ముక్కలై ఉండవచ్చని భావించారు. విక్రమ్ కూలిన ప్రదేశానికి వాయువ్య దిశలో 750 మీటర్ల దూరంలో ఒక శకలం ఉన్న ప్రాంతాన్ని గుర్తిస్తూ తన నివేదికను నాసాకు పంపారు. దీని ఆధారంగా ఎల్ఆర్‌వో బృందం అక్టోబరు 14, 15, నవంబరు 11వ తేదీల్లో తీసిన కొన్ని ఫొటోలను సరిపోల్చి విక్రమ్ పడిన ప్రాంతాన్ని నిర్ధారించింది. షణ్ముగ గుర్తించిన ప్రదేశంతోపాటు నాసా మరో 24 చోట్ల మార్పులను గుర్తించింది. దాని శకలాలను, వాటి వలన ప్రభావితమైన చంద్రుడి ఉపరితల ప్రాంతాలను కచ్చితంగా గుర్తించింది.

### ఎవరీ షణ్ముగ?

మదురైకి చెందిన మెకానికల్ ఇంజనీర్ షణ్ముగ సుబ్రమణియన్ చెన్నైలోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నారు. వాస్తవానికి అతనికి ఇస్రోతోగానీ, నాసాతోగానీ ఎలాంటి సంబంధం లేదు. అతనికి అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి ఎక్కువ. నాసా ఇచ్చిన పిలుపు మేరకు ఆయన రంగంలోకి దిగారు. నాసా ఫొటోలపై లోతైన అధ్యయనం చేశారు. సంబంధాలు తెగిపోయిన పుడు ల్యాండర్ వేగం, ఎత్తు ఆధారంగా అది దిగాల్సిన ప్రాంతం, పరిసరాలను అధ్యయనం చేశారు. తన అధ్యాయాన్ని ఆధారాలతో సహా అక్టోబరు 3న నాసాకు మెయిల్ చేశారు. షణ్ముగ చేసిన కృషికి దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తున్నాయి.

### నాసా స్పందన బాగుంది



'ల్యాండర్ జాడ కనిపెట్టడం కష్టంతో కూడుకున్న పనే. కానీ దీన్ని సవాల్‌గా స్వీకరించాను. నాసా వెబ్‌సైట్‌లో పెట్టిన ఫొటోలను అణువణువూ పరిశీలించాను. ఇస్రోకు, నాసాకు ట్వీట్లు చేశాను. నాసాలోని ఇద్దరు శాస్త్రవేత్తలకు ఈ మెయిల్స్ పంపుతూ టచ్‌లో ఉన్నాను. వారి నుంచి స్పందన బాగుంది. ప్రధానంగా విక్రమ్ కూలిన ప్రాంతంలో రెండు కిలోమీటర్ల మేర నా పరిశీలను కేంద్రీకృతం చేశాను.'

– షణ్ముగ సుబ్రమణియన్

# 'కైలాసం' సృష్టిస్తి రామాహరీ..

(మొదటి పేజీ తరువాయి)

కోసం ప్రధానమంత్రిని, మంత్రిమండలిని కూడా ఏర్పాటు చేసుకున్నాడు. కైలాస'వాసులు కావాలనుకునేవారికి ఒక బంపర్ ఆఫర్ ఉంది. అదేంటంటే.. ఆ దేశానికి విరాళాలివ్వడమే! పైసలిస్తే పౌరసత్వ పథకం అన్నమాట!! అలా పైసలిచ్చినవారికి పాస్‌పోర్టులు ఇస్తారు. ఆ దేశ పాస్‌పోర్టు, పౌరసత్వం లేకపోయినంత మాత్రాన దిగులు చెందక్కర్లేదండోయ్..! ప్రపంచంలో ఏ మూల ఉన్నా.. హిందూయిజాన్ని ఆచరించలేకపోతున్న హిందువులైతే చాలు. ఆ దేశ పౌరులేనట. ఆ దేశం.. హద్దులే లేని దేశమట.

### రెండు రంగుల పాస్‌పోర్టులు..

మనం ఫలానా దేశ పౌరులం అని ధ్రువీకరించే గుర్తింపు పత్రం.. పాస్‌పోర్టు. మనందరి వద్ద ఉండేది భారత పాస్‌పోర్టు. దాని ప్రయోజనం అంతవరకే. వేరే దేశాలకు వెళ్లాలంటే.. మన పాస్‌పోర్టుతోపాటు, ఆయా దేశాలు ఇచ్చే 'వీసా' కావాలి. కానీ.. నిత్యానందుడు తన 'కైలాస'వాసులకు ఇచ్చే పాస్‌పోర్టుతో 11 డైమెన్షన్లకు, 14 లోకాల్లోకి (అందులో ఏడు అధో లోకాలు: అతల, సుతల, వితల, తలాతల, రసాతల, మహాతల, పాతాళలోకాలు. మరో ఏడు ఊర్ధ్వ లోకాలు: భూలోక, భువర్లోక, సువర్లోక, మహర్లోక, జనోలోక, తపోలోక, సత్యలోకాలు) ప్రవేశం ఉచితం!! ఆయా లోకాల వీసాలు గట్రా అక్కర్లేదు!! కానీ, పాస్‌పోర్టుల్లో మాత్రం కించిత్ స్థాయీభేదాలున్నాయి. స్థాయిని బట్టి కొందరికి బంగారం రంగులో ఉండే గోల్డెన్ పాస్‌పోర్టు, మరికొందరికి ఎర్ర రంగు అట్టతో ఉండే పాస్‌పోర్టు ఇస్తారట. ఏ 'స్థాయి' వాళ్లకి ఏ రంగు పాస్‌పోర్టు ఇస్తారనే వివరాలను మాత్రం కైలాస అధికారిక వెబ్‌సైట్‌లో వెల్లడించలేదు.

### సహచరుడే ప్రధాని

తన సొంత దేశానికి ప్రధానిగా.. తన అనుచరుడు, సన్నిహితుడు అయిన 'మా' అనే వ్యక్తిని ప్రధానిగా నియమించిన నిత్యానంద.. మంత్రి మండలినీ ఏర్పాటు చేశాడు. సదరు ప్రధాని, మంత్రులతో నిత్యానందుడు నిత్యం చర్చలు, సమావేశాలు కూడా జరుపుతున్నాడట!!

### 10 విభాగాలు..

'కైలాస' దేశంలో 10 ప్రభుత్వ విభాగాలుంటాయట. అందులో ప్రధానమైనది.. దేశాధిపతి అయిన 'హిజ్ డివైన్ హోలీనెస్ భగవాన్ శ్రీ నిత్యానంద పరమశివమ్ (పరమపూజ్యులైనట్టి భగవంతుడు శ్రీ నిత్యానంద పరమశివమ్)' కార్యాలయ వ్యవహారాలు చూసే విభాగం. మిగతా తొమ్మిదీ.. ఆ దేశ అంతర్గత వ్యవహారాలు, డిజిటల్ ఎంగేజ్‌మెంట్, సోషల్ మీడియా, హోం, రక్షణ, వాణిజ్య, విద్య వంటి చిన్నచిన్న శాఖలన్నమాట.

### రాజ్యాంగం..

'కైలాస' దేశ రాజ్యాంగంలో 547 పేజీలున్నాయి. తమిళం, హిందీ, సంస్కృత భాషల్లో ఆ రాజ్యాంగం ఉం టుంది. తన కైలాస దేశ సార్వభౌమాధికారాన్ని గుర్తించాల్సిందిగా కోరుతూ నిత్యానందుడు ఐక్యరాజ్యసమితికి ఒక పిటిషన్ సమర్పించాడు. హిందూయిజాన్ని ఆచరిస్తూ, దాని వ్యాప్తికి కృషి చేస్తున్న తన ప్రాణాలకు భారతదేశంలో ముప్పు ఉన్నదని.. 'కైలాస' ద్వీపాన్ని ఈక్వెడార్ నుంచి కొనుగోలు చేశానని పేర్కొన్నాడు.



**'కైలాస' దేశ అధికార భాషలు:** ఇంగ్లిష్, సంస్కృతం, తమిళం.
**అధికారిక మతం:** సనాతన హిందూ ధర్మం
**జాతీయ జంతువు:** నంది, **జాతీయ పక్షి:** శరభం
**జాతీయ పుష్పం:** పద్మం, **జాతీయ వృక్షం:** మర్రి చెట్టు




### నేను కైలాస వాసిని

జోరుగా సభ్యత్వాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 3: నిత్యానంద స్వామి చెప్పుకొంటున్న కైలాస దేశంలో "మేమూ పౌరులం" అంటూ ప్రపంచవ్యాప్తంగా పలువురు ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్నారు. ఆ విషయాన్ని నెట్‌లో ప్రచారం చేసుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో 'థర్డ్‌పార్టీ యాప్'ల ద్వారా కైలాసవాసిగా పేర్కొనే ప్రొఫైల్ ఫొటోలను సృష్టించుకుంటున్నారు. వాటిపై.. "గొప్పదైన నాగరికత ఉన్న దేశం.. ప్రపంచంలోనే ఏకైక హిందూ దేశం" అనే సందేశాలుంటున్నాయి.

### జెండాపై బసవన్న..



కైలాస దేశ జెండా.. రిషభధ్వజం. దాని రంగు.. తోపు (మెరూన్) రంగు. దాని మీద సాక్షాత్తూ శివుడి రూపంలో చిద్విలాసం గావించే 'నిత్యానంద' స్వామి బొమ్మ.. పక్కనే నంది విగ్రహం ఉంటాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.